ప్రజాశక్తి
స్నేహ
ఆదివారం అనుబంధం
నవంబర్ 04, 2018

NAVEEN PRASAD
VISAKHAPATNAM
Cell · 9849070838

సాహితీ దీపిక

దీపావళి ప్రత్యేక సంచిక

నవ్వుల టపాసులు







- శేఖర్, కార్టూనిస్టు

సాహితీ దీపిక

దీపావళి వెలుగుల పండగ. దాదాపు దేశమంతటా వేర్వేరు పేర్లతో జరుపుకునే పర్వదినం. ఈ సందర్భానికి సంబంధించి ఒక్కో ప్రాంతంలో ఒక్కో కథ ప్రచారంలో ఉంది. ఆ కథలూ, కారణాలూ ఏవైనా- దేశమంతటా కాంతుల సందడి మాత్రం నిజం. ఒక్కరోజులోనే కోట్లాది రూపాయలూ టపాసుల రూపంలో బూడిదగా మారుతున్న మాట నిజం. కాలుష్యం ఆవరించి, పర్యావరణానికి హాని కలుగుతుందన్న పర్యావరణ ప్రేమికుల భయం కూడా నిజమే! పండగను సమాజహితంగా, ప్రకృతి శోభితంగా జరుపుకోవటం ఉభయతారకం. ప్రజాశక్తి 'స్నేహ' తనవంతుగా ఈ దీపావళికి 'సాహితీ దీపిక' ప్రత్యేక సంచికను వెలువరించింది. ఇందులో కథలే దీపతోరణాలు. కవితలే మతాబు వెలుగులు. కార్టూన్లు నవ్వుల టపాసులు. మొత్తం 6 కథలూ, 8 కవితలూ, 14 కార్టూన్లతో ఈ సంచికను ముస్తాబు చేశాం. ఈ సంచిక మిమ్మల్ని అలరిస్తుందని ఆశిస్తున్నాం. మీ అభిప్రాయాలను ఆహ్వానిస్తున్నాం.

- ఎడిటర్

గమనిక : 'సాహితీ దీపిక' కోసం ఈ వారం కొన్ని రెగ్యులర్ శీర్షికలను నిలిపివేశాం. వచ్చేవారం నుంచి మామూలే!

ముఖచిత్రం : బాలి

లోపల చిత్రాలు : విజయ్ జో, చిదంబరం

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా : స్నేహ, ప్రజాశక్తి,
డోర్ నెం : 27-30-4, అకుల వారి వీధి,
గవర్నర్ పేట, విజయవాడ-520002.
snehaweekly.praja@gmail.com

కొత్త వాతలు - 2
ఒకటోరకం నిచ్చెన - 5
సిసింద్రీ - 9
దారితప్పిన పిల్లవాడు - 12
దక్షి - 14
థ్యాంక్యూ టీచర్ - 18
ఆకుపచ్చని రాగం - 20
రంగుల అగ్గిపుల్లలు - 22

కొత్త పాతలు

- మానస ఎండ్లూరి
9160734990

'అబ్బా ఏం చేశావే బూలి దానా.. నీ వంట కోసమన్నా రిస్క్ తీసుకుని పెళ్లి చేసుకోవాలి నిన్ను'

'నోర్మూయ్, అనౌసరంగా చెప్పాను నీకు, మా అమ్మమ్మ అలా పిలుస్తుందని. తొందరగా తిని వెళు. మా డాడీ వస్తాడు ఇప్పుడు.. నన్ను తీసుకెళ్ళడానికి'

'సరే బ్యూలా వైడూర్యం గారు'

'ఓయ్ ఎన్నిసార్లు చెప్పాను.. బ్యూల అని మాత్రమే పిలవమని. అయినా, కూర కోసం పెళ్లి చేసుకుంటావా? పద్దాక పెద్ద కూర మీద మోజు ఏంట్రా నీకు? అసలు సిమోన్ పేతురుని తింటే వదలవు తెలుసా!'

బ్యూల బుంగమూతి మీద పెద్ద కూర ముద్దులు పెట్టాడు శ్రీనివాస్. బ్యూల నల్లని ముఖంపై ఆమె కళ్ళు వెండి పత్రాల్లా మెరిసిపోతున్నాయి.

'మన పెళ్లి అంత కష్టమంటావా? అస్సలు ఒప్పుకోరా?'

'మా పిన్ని హిందూ అబ్బాయిని కాకుండా సాయిబులబ్బాయిని చేసుకుందనే ఇరవై ఏళ్ళు అవుతున్నా- మా వాళ్ళు ఇప్పటికీ దూరంగానే ఉన్నారు. నేనొక్కడినే ఇంట్లో తెలియకుండా మాట్లాడుతుంటాను వాళ్ళతో'

'కానీ మనిద్దరం దేవుని బిడ్డలమేగా'

'ఎంత అమాయకంగున్నవే. మా ఇంట్ల మతం తీసుకుంది నేనొక్కడనే. మా ఊరొచ్చి మా ఇల్లు సూస్తేనే అసలు నువ్వుంటవా ఎమ్మటే పోతవా అని భయమేస్తుంది నాకు. మా అమ్మ ఇప్పటికీ రేణుక ఎల్లమ్మ దేవి ఒగ్గు కత చెప్పిందంటే ఊరంత ఆమె చుట్టూ జమైతరు. నన్ను మా మామ బిడ్డెకిచ్చి చెయ్యాలని కూడా చిన్న ఆలోచన చేస్తున్నది'

చదువుకోడానికి పట్నమొచ్చి భాషా తీరూ మార్చుకున్నా... వాళ్ళ ఇంటి విషయాలు, ఊరి విషయాలు వస్తే- వెంటనే పోతరాజులా మారిపోతాడు. ఆ భాషే బ్యూలని ఆకట్టుకున్నట్టుంది.

'మరి చేసుకో..' కోపం నటిస్తున్న కళ్ళల్లో ప్రేమ పొంగిపోతోంది.

'అసలు కంటే వడ్డీ ముద్దని'

'మా ఇంటి పేరునే ఎక్కిరిస్తున్నావా. మా వాళ్ళలో వడ్డీ వాళ్ళంటే అందరు పైకొచ్చినోళ్ళే తెలుసా'

'నన్ను చేసుకున్నాక బైండ్ల బ్యూలవి అవుతావ్. అప్పుడు ప్రత్యేకంగా కులం పేరు చెప్పక్కరలేదులే' కోతలు కితకితలతో ముగిశాయి.

విలియం బాబు బుల్లెట్ బండి శబ్దంతో బ్యూలా ప్రవీణ్‌ల పరిపూర్ణ విరహం అసంపూర్ణ కౌగిలితోనే ఆ రోజుకి ముగిసింది.

• • •

'ఏదొకలాగా కిందా మీదా పడి సర్టిఫికేట్‌లో నా క్యాస్ట్ పెట్టుంటే రిజర్వేషన్ ఉండేది. పిల్లకి ఎంసెట్‌లో సీటు ఒచ్చేది. వద్దంటే ఇంగ్లీష్‌లో జాయిన్ చేశావ్. మళ్ళీ నీలాగే పంతులమ్మ అవ్వాలా అది కూడా' ఆఫీస్ నుంచి రాగానే ఇలా జరిగిపోయిన విషయాల గురించి విలియం మీద నిష్ఠూరాలతో అలసటంతా తీర్చుకుంటుంది బ్యూల తల్లి పరంజ్యోతి.

'ఇక్కడ రిజర్వేషన్ ఉంటే ఏమొస్తది? పరలోకంలో ఉండాలి మన కోసం రిజర్వేషన్. అది బీసీసీ అయితేనే ఉంటది. ఎస్‌సిసి అయితే ఎందుకుంటది? ఒక పవిత్ర క్రైస్తవురాలిగా నా మనవరాలు జీవిస్తుంది. అదే నిజమైన జీవితం. డాక్టర్ అయినా, టీచర్ అయినా, పోలీస్ ఆఫీసరే అయినా దేవుని బిడ్డగా పరలోకంలో స్థానం సంపాదించుకోకపోతే దేనికి' వళ్ళోని బైబిల్‌ని మూస్తూ అనింది హాలేలూయమ్మ, బ్యూల నానమ్మ.

'ఉద్యోగం చేసే కోడలు ఎస్‌సి అయినా ఫర్వాలేదు కాబోలు' గొణుక్కుంటూ ఆఫీస్ నుంచి ఇంటికి క్షేమంగా చేర్చినందుకు దేవుడికి కృతజ్ఞతలు చెప్తూ అలవాటుగా చిన్న ప్రార్థన చేసింది పంరజ్యోతి.

'రిజర్వేషన్ ఉన్నంత మాత్రాన మనోల్లందరూ బాగుపడిపోయారా? అయినా, అది ఇంకా Mphil చెయ్యాలి. తర్వాత PhD చెయ్యాలి. అప్పుడు పే...ద్ద ప్రొఫెసర్ అవుతది. నాలాగా బడి పంతులమ్మ ఎందుకౌతది'

నిద్రలోంచి తేరుకున్నట్టు ఉన్నట్టుండి గట్టిగా చెప్పాడు విలియం.

'అదే రిజర్వేషన్ ఉంటే మనింట్లో మొదటి డాక్టర్ అయ్యేదేమో నా బిడ్డ'

'ఇప్పుడు కూడా ఇంట్లో మొదటి ప్రొఫెసరే అవుతుంది. పోయి బియ్యం పెట్టు పొయ్యి మీద. అమ్మ మాత్రలేసుకోవాలి.'

'ఏం చదివిస్తావో పెళ్లి చేసి చదివించు. దానితోటి పిల్లలందరూ పెళ్ళిళ్ళు చేసుకుని పిల్లల్ని కూడా కంటున్నారు.'

అప్పటిదాకా టీవీ చూడడంలో మునిగిపోయిన బ్యూల గుండె ఒక్కసారిగా అదిరిపడింది.

'మ్మా.. పిచ్చెక్కిందా? వాళ్ళందరూ ఇంటర్ డిగ్రీ సగంలో వదిలేసి ఫెయిల్ అయినోళ్ళు. పాస్ అయినా ఇంక చదివే ఉద్దేశం లేదు. వాళ్ళు పుట్టిందే పెళ్ళీ పిల్లల కోసం. ఇప్పుడు మా క్లాస్మేట్స్ ఎవరికీ పెళ్లి ఆలోచనలు లేవు. అందరూ వచ్చే నెల ఎగ్జామ్స్ అయిపోయాక Mphil ఎంట్రన్స్ రాయడానికే ప్రిపేర్ అవుతున్నారు.'

దాచుకుంటుంది గానీ, కదిలిస్తే కన్నీళ్లు వచ్చేటట్టున్నాయి బూలి దానికి.

'నువ్ పెళ్లి చేసుకుని చదువుకో. అడ్డేముంది? ఎంతమంది ఇద్దరేసి పిల్లలున్నా పీహెచ్డీలు చేసుకోవట్లేదు.' జ్యోతి అంత తేలిగ్గా ఏ విషయాన్నీ వదిలిపెట్టదు.

'అబ్బా సరేలే. ఇప్పటికి వదిలేయ్. ముందు పరీక్షలు రాయనీ తర్వాత చూద్దాం.'

అదేంటో విలియంకి పరంజ్యోతి మాటలు ఎప్పుడూ అరుపుల్లానే వినిపిస్తాయి.

పిల్ల ముదిరిపోతుంది. ఒళ్ళు పెరిగిపోతుంది. తర్వాత సంబంధాలు కూడా రావు మరి..' కొంచెం లాగింది జ్యోతి.

'జ్యోతీ ఏం మాట్లాడుతున్నావ్ బిడ్డ ముందే. బూలమ్మా నువ్ చదువుకో పో' పెత్తనాలు చేసే అత్తగారి పాత్రకు ఎక్కడా అన్యాయం చెయ్యదు హలేలూయమ్మ.

బ్యూలకి ఆ గదిలోంచే కాదు, ఆ ఇంట్లోంచే కాసేపు బయటకు వెళ్ళాలనిపిస్తుంది. తన గదిలోకి తప్ప మరెక్కడికి వెళ్ళగలదు?

'ఏవత్తమ్మా.. అదేం చిన్నపిల్లా? ఇరవై రెండేళ్ళు ఇప్పుడు. వచ్చే అక్టోబర్‌కి ఇరవై మూడు పడ్తాయి. వయసుకి మించి కనిపిస్తుంది. ఇప్పటికే చర్చిలో కూడా మన సంబంధమంటే ఇష్టమున్నా, దాన్ని చూశాక ఆసక్తి చూపడం లేదు. చదువంతా అయ్యాక పెళ్లి అయ్యే మాటలేనా? నా కంగారు నాకుండదా'

'అవును, మొన్న మురికినాటి వాళ్ళ సంబంధం ఒకటి ఉందని షారోన్ చెప్పింది.. జ్యోతీ.! లేదమ్మా మేం పాకనాటోళ్ళం అని చెప్పి పంపించా'

'ఉండొచ్చు కానీ, మరీ ఇంత కుల పిచ్చా. ఎవరొకరు దొరకడమే గొప్పనుకుంటుంటే' సణుక్కుంటూ వెళ్ళింది జ్యోతి.

బ్యూల శరీరంపై వ్యాఖ్యలు చేస్తే- తన కంటే తండ్రికే ఎక్కువ బాధా దిగులు. భార్య మాట తీసిపడేయ్యలేడు. వాస్తవాన్ని వినలేడు. వెంటనే బయటకు వెళ్ళడానికి సిద్ధమయ్యాడు. కూతురు అలిగితే ఏ బిర్యానీ తేవాలో బాగా తెలుసు విలియంకి. ఆ రాత్రికి బియ్యమెంత పెట్టాలో జ్యోతికీ తెలుసు.

• • •

'మరి తరువాతేంటి?'

'నీ బూరి బుగ్గలు' మెడ మీద ముద్దుల వర్షానికి తెరిపినిస్తూ అన్నాడు శ్రీనివాస్.

'ఇంట్లో నా పెళ్లి గురించి మాట్లాడుకుంటున్నారు. ఈ సంవత్సరం చేసెయ్యాలని'... అతడి కళ్ళల్లో తడి. అందుకోసమైనా బ్యూల పెదవులు అతని చెమ్మ చెక్కిళ్ళను చేరుకోవాలిగా.

'సరే ఇంట్లో చెప్పేద్దాం' కంగారు, అభద్రతలతో అన్నాడు.

'కంగారు పడకు. ముందు లేచి అన్నం తిను'

ఇద్దరూ లంచ్ బాక్సులు తెరిచారు. ఎప్పుడూ మొదటి ముద్ద ఎదుటి వారిదే. కానీ శ్రీనివాస్‌కు ఆ మాట విన్నాక అన్నం సహించట్లేదు.

'ఇంకొంచెం తినరా'

'వద్దు'

బ్యూల అతన్ని అలా ఎంత మాత్రమూ చూడలేదు.

'సరే.. నువ్వు పీహెచ్‌డీకి అప్లై చేశావా? కెమిస్ట్రీకి పోటీ ఎక్కువ అన్నావ్'

'చేస్తాను రేపు. మన యూనివర్సిటీలో ఇప్పుడే వాళ్ళ గైడ్స్‌ని కూడా సెట్ చేసుకుంటున్నారు. సీట్ వస్తే ఎవరి దగ్గర రీసెర్చి చెయ్యాలా అని. కానీ, మా డిపార్టుమెంటులో మావాళ్ళలో ఒక్క ప్రొఫెసర్ కూడా లేరు. సీట్ వస్తే నాకు ఎవరైనా ఒకటే. నేనే వాళ్లకి వేరుగా కనిపిస్తాను.'

'అందరూ అలానే ఉండరు లేరా. ప్రమోద్ మిశ్రా సర్, రాములు సర్ నీతో బానే ఉంటారుగా'

'మ్మ్.. వేరే యూనివర్సిటీలకి కూడా అప్లై చేశాను. చూడాలి ఏమౌతదో. పెళ్ళిళ్ళకే ఒకే కులం కావాలి. చదువుకీ ఒకే కులం కావాలి'

'ప్రేమకి అవసరం లేదు లే'

'కానీ అది సరిపోదు. మన ఇళ్ళల్లో కావాల్సిందీ ఈ కులమే. మా నాన్నకి మీ వాళ్ళంటేనే పడదు. ఎంతసేపూ వాళ్ళకి టెక్కు ఎక్కువ అని తిడుతుంటాడు. నాకేంటో మన వ్యవహారం సవ్యంగా సాగుతదని నమ్మకం లేదు బ్యూలా. భయంగా ఉంది.'

'వదిలేస్తావా?'

కష్టమైన ప్రశ్నే. సులువుగా అడిగేసింది. సమాధానం చెప్పలేక శ్రీనివాస్ పెదవులు అదురుతున్నాయి. అయినా సరే, ఆమె పెదవుల మీద పచ్చబొట్టు లాంటి ముద్దు పెట్టాడు. బ్యూలకి ఇక అడగడానికి ఏమీ లేదు.

• • •

'ఎంత మోసం చేశావే దొంగముండ. ఇంత ప్రేమగా పెంచి నీకు ఇన్ని చేసినందుకు ఇదా నువ్ మాకిచ్చే బహుమానం.' పరంజ్యోతి కోపంతో ఊగిపోయింది.

'ఏందిరా లొల్లంతా. ఇంత కత జేషి పిల్లతోని దీని ఇంట్లకచ్చి ఎంత ధైర్నంగా నాకే ఫోన్ చేస్తావ్ రా.' శ్రీనివాస్ నాన్న రెండు దెబ్బలు కూడా వేశాడు.

ఎప్పుడూ దేవుని పాటలు, చర్చి, విశ్వాసం అంటూ ఉండే బ్యూల ఏ మాత్రం అనుమానం రాకుండా ఒక హిందూ కుటుంబం నుంచి వచ్చిన అబ్బాయిని ప్రేమించి అతనితో వేరే ఊరు వచ్చేసిందంటే- పరంజ్యోతి, విలియంలకు ఇంకా నమ్మశక్యం కావడం లేదు.

'ఇదే ఒక సాయిబుని చేసుకుని బరితెగించిన ఆడది. దీని అండ చూసుకున్నారా మీరు.' శ్రీనివాస్ తల్లి కాశవ్వ.

అశ్విని, అన్వర్ అవమానభారంతో కుమిలిపోలేదు. ధైర్యంగా ఒక్కటిగా వారికి చెప్పాల్సినవి చెప్పారు.

'చూడండి మేము ఇంకా కాలేజీ స్టూడెంట్స్ కాదు, మీ ఇష్టమొచ్చినట్టు మాట్లాడడానికి. నేను ఎమ్మార్వో. మా ఆయన కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్. మేజర్స్ అయిన వీరిద్దరినీ మీరిలా బెదిరించి భయపెట్టి విడదీయడం మంచిది కాదు. వాళ్ళు రక్షణ కోసం పోలీసులను ఆశ్రయించకముందే మీరు కళ్ళు తెరవండి.'

'కుటుంబాన్ని కాదనుకుని భయం లేకుండా వెళ్ళిపోయిన నువ్వు మాకు నీతులు చెప్పకే.'

ప్రవీణ్ తల్లి. స్వయానా అశ్విని అక్క.

'మరి వీళ్ళిద్దరేం తప్పు చేశారు? ఇద్దరూ ఒకటే కదా' అన్వర్ గట్టిగా అడిగాడు.

'కాదు. ఒక్కటి ఎంత మాత్రమూ కాదు. నక్కకి నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. దీనికి నేను ఎటువంటి పరిస్థితుల్లో ఒప్పుకోను' విలియం అరుస్తూ చెప్పాడు.

'ఇద్దరూ పీజీలు చేశారు. ఇప్పటికిప్పుడు కూడా చెప్పుకోదగ్గ ఉద్యోగాలే వస్తాయి. పెళ్లి చేసి పై చదువులు చదివితే ఇద్దరూ గొప్పవాళ్ళవుతారు' అశ్విని సర్దిచెప్పడానికి ప్రయత్నిస్తుంది.

'ఎంత గొప్పవాళ్ళు అవుతారు? అయిన వాళ్ళందరినీ దూరం చేసుకుని, ఒక శుభకార్యం, సంతోషం లేకుండా పెద్ద ఉద్యోగాలు చేస్తూ అనాథల్లాగా, ఎప్పటికీ తప్పిపోయిన గొర్రె పిల్లల్లా బతుకుతారా? దీనికి నేనస్సలు అంగీకరించను.' పరంజ్యోతి ఆవేశంతో చెప్పింది.

'ఇద్దరూ నమ్ముకుంది ఒకే దేవుడ్ని కదా? ఇద్దరూ తెలుగువాళ్ళే, ఒకే భాష. ఇంకేంటి అభ్యంతరం? ఇన్ని విషయాలు కలిసినప్పుడు ఒకే ఒక్క కులం పేరిట వేరవ్వాలని ఎందుకు తాపత్రయం? ఏసుప్రభువు చెప్పింది ప్రేమించమని, క్షమించమని. మీ పొరుగువారిని ఎలాగూ ప్రేమించలేరు. కనీసం మీ పిల్లల్ని వారి అభిప్రాయాల్ని వారి భవిష్యత్తుని ప్రేమించలేరా? ఇన్ని సంవత్సరాలు మేం సంతోషంగానే ఉన్నాం. ఇద్దరు సంతోషంగా ఉంటే అది తప్పు ఎలా అవుతుందో నాకిప్పటికీ అర్థం కాదు. నా చెల్లి కూడా ఒక క్రైస్తవుడినే చేసుకుంది. మా వాళ్ళు నన్నూ మా చెల్లిని మానసికంగా చిత్రవధ చేసి వదిలేసినట్టు అతని కుటుంబం వదిలేయలేదు. ఆనందంగా ఆమెను స్వీకరించారు. మహారాణిలా

చూసుకుంటున్నారు. వాళ్ళేమీ చదువుకోలేదు. బైబిల్, ఏసు ప్రభువును తప్ప. అందుకే ప్రేమించడం కాక మరింకేం తెలీదు వాళ్లకి' కన్నీటితో గోడు వెళ్ళబుచ్చుకున్నాడు అన్వర్.

'మా ఊర్ల నా కొడుకుని చేస్కొనికి అందగత్తెలు నా ఇంటి సుట్టుముడతరు. ఈ దొబ్బామెని చేసుకునే కర్మ ఏంది నా కొడుకుకి'

'అందము మోసకరము, సౌందర్యము వ్యర్థము. యెహోవా యందలి భయభక్తులు కలిగిన స్త్రీ కొనియాడబడును' అని నీ కొడుకు నమ్ముకున్న దేవుడు చెప్పాడక్కా.. వాళ్ళిద్దరూ ఒకరిని వదిలి ఒకరు ఉండలేరు. నేను నాలుగు రోజుల నుండీ వాళ్ళకి అన్ని రకాలుగా నచ్చజెప్పి చూసినా విడిపోయి బతకలేమంటున్నారు. మళ్ళీ మనింట్లో మరొకరు నాలా అవ్వడానికి వీల్లేదు అక్కా. మన తర్వాతి తరమైనా సంతోషంగా జీవించాలి. ఆలోచించండి'

అశ్విని ఎంత ప్రేమను పంచడానికి ప్రయత్నించినా తీసుకోడానికి ఎవరూ ముందుకొచ్చేలా లేరు.

'ఒక్కగానొక్క కూతురు ఇటువంటి గొడవలో ఇరుక్కోడం మమ్మల్ని ఇంత అవమానించడం.. ఏంటి ఇదంతా. జీవితకాల దుఃఖాన్ని దేవుడు ఎందుకిచ్చాడో అర్థం కావడమే లేదు. అది ఏ కులపోడ్ని చూపించినా పెళ్లి చేసేవాడ్నేమో. పోయి పోయి వీడిని తెచ్చింది'

ఇద్దరి తల్లిదండ్రులు ఇంకా ముఖాముఖి మాట్లాడుకోలేదు. ఒకరినొకరు అవమానించుకోడం తప్ప.

రోజులు గడుస్తున్నాయి.

బ్యూల, శ్రీనివాస్ బలవంతం మీద ఎవరిళ్ళల్లో వాళ్ళు ఉంటున్నారు. మాటా లేదు, మంతీ లేదు. కన్నీళ్ల కలవరింతలు తప్ప. బ్యూల MPhil ప్రస్తుతానికి ఆగిపోయింది. పెళ్లి సంబంధాలు చురుగ్గా చూస్తున్నారు. శ్రీనివాస్ PhD కోసం మరో ఊరికి పయనమయ్యాడు. ఏదీ మారలేదు. వారి స్వార్థం వారు చూసుకోనూ లేదు. పెద్దల మనసులూ కరగలేదు. ఎన్నో జంటలు... రకరకాల రంగుల్లో, వయసుల్లో, ఆకారాల్లో, వేరు వేరు కులాలతో, మతాలతో ఈ నలుగురు పెద్ద మనుషులకి రోజూ కనిపిస్తూనే ఉన్నారు. వారి సంతోషాన్ని వీక్షిస్తూనే ఉన్నారు. వీరు మట్టుకు కనబడని కులం మతంలోనే ఉంది.. ఐక్యతా ఆనందం అని పాత వాతలనే కొత్తగా పెట్టుకుంటున్న నక్కల్లానే మిగిలిపోయారు.

- అంబటి చంటిబాబు, కార్టూనిస్ట్



చెణుకులు చురకలు









ఒకటో రకం నిచ్చెన...!

- చింతకింది శ్రీనివాసరావు
8897147067

సామాన్యమైన ఉద్యోగం కాదు మునసబంటే. ఏ ఊరి మునసబు ఆ ఊరి కలక్టరు కింద లెక్క. అధికారాలన్నీ ఆయనవే. ఆ హెూదా అప్పట్లో చాలా దర్జాగా ఉండీది. మునసబు కాలినడకన వెళుతుండొచ్చు. గ్రామసేవకుడు ఆయన ముందు హడావుడిగా దారితీస్తూ అందర్నీ అదరగొడుతుండాలి. మునసబుగారు సైకిల్‌మీదో, సువేగా మోపెడ్‌మీదో పోతున్నారనుకుందాం. బంట్రోతు, తలారీగాడు కూడా సైకిలో మరోటో ఎక్కొచ్చునా? తప్పు తప్పు. అలా చెయ్యకూడదు. అది మహా నేరం. పెద్దాయన ఏది ఎక్కినా, చిన్నవాడయిన తలయారి ఆయన కంటే ముందు ఆయాసపడుతూ పరుగులు తీయడం తప్పనిచ్చి మరేం చేయకూడదు. మరి మునసబుగిరీ అంటే మజాకానా! అలాంటి విలువైన ఉద్యోగానికి మరింతగా వన్నె తెచ్చీవారు కాష్టాలనాయుడు గారు.

నాయుడుగారి ఇంటిపేరు జమ్మి. వాళ్ల అమ్మాబాబూ ఆయనకి పెట్టిన పేరు ఎరుకునాయుడు. కానీ, ఆయన ఎండుకంపలా ఉండటం చేతనూ.. శ్మశానంలో కాలుతున్న కారునలుపు కాష్టం పొగలను పోలి ఉండటం మూలానూ.. బుర్రకి ఆయన ఆరారా రాసుకునే ఆముదం, శవం కాలితే వచ్చే కమురు పరిమళమై సౌరభించడం వల్లనూ.. ఎవరో ముద్దుగా ఆ మనిషికి కాష్టాలనాయుడు అని అదెప్పుడో బారసాల చేస్సేరు. ఇదే అసలు పేరుగా స్థిరపడిపోయింది. ఇందుకు ఆయనకేం చింతలేదు. ఈ పేరు చెప్పగానే పిట్టలు నీళ్ల తాగకుండా, పశువులు కుడితి తాగకుండా, బీదలు అంబలి తాగకుండా ఉంటారని మనసా వాచా తలచీవారు. ఆ కాష్టాల నామధేయం తనకే సూటయినట్టుగా చెప్పడానికేనేమో, నిత్యమూ తాను పాలించే అమరాం గ్రామాన్ని నానా సంకలూ నాకబెట్టీవారు. ఊళ్లో తనకు పడనివాడెవడయినా ఉంటే వాడి భూముల్ని కరణానికి చెప్పి తారుమారు చేయించీవారు. మరెవడయినా తన గురించి వ్యతిరేకంగా మాట్లాడేడంటే చోడవరం పోలీస్‌స్టేషన్లో రిపోర్టిచ్చి, కేసు కట్టించి, కోర్టంట్ల తిప్పీవారు. తన ఆజ్ఞలను ఎవడయినా ధిక్కరిస్తున్నాడని తెలిస్తే అలాంటివాడి పొలం గట్లను కదపాయించి పక్కవాడి కళ్లంలో కలిపేయించీవారు. తనకెప్పుడయినా ప్రజలను పీడించడంలో కొత్త ఎత్తులు తట్టని పక్షంలో గురువైన మెలిపంతులుగారిని శరణు వేడీవారు. మెలిపంతులుగా జనబాహుళ్యంలో చిరపరిచితమైన పీరపూడి రంగారావుగారు అమరాం పక్కనే ఉన్న కంచుపల్లి కరణం. ఇతగాడు వేసే రెవెన్యూ పీటముళ్ల ఇప్పుకోలేక పెద్ద పెద్ద తాసీల్దార్లే గుడ్డుగుడిసిపోయిన మీదట ఈయనకు మెలిపంతులు అనే పేరు సెటిలయింది. ఈ బాబుగారు మన నాయుడి గారికి ప్రియాతి ప్రియమైన గైడూ, ఫిలాసఫరూ అన్నీను. వీరిద్దరూ అసలు పేర్లతో కాక కొసరు పేర్లతో ప్రవర్ధమానమయ్యారంటేనే చాలు. వీళ్ల పట్ల ప్రజలు ఎంతటి అవగాహన కలిగి ఉన్నారోననే విషయం తెలిసిపోడానికి.

ఎలాంటి మంచివాడికయినా మరెలాంటి చెడ్డవాడికయినా సంసారం అనీది ఒకటి ఉండి తగలడుతుంది. భార్యా పిల్లలూ ఉండి ఛస్తారు. రావణాసురిడికయినా మండోదరి అనే పెళ్లాంగారు, ఇంద్రజిత్తు అనే కుర్రాడుగారూ లేరా? సౌమిత్రి చేతుల్లో కొడుకు చచ్చినప్పుడు పదితలల రావణయ్య ఇరవై కళ్లతోనూ ఏడవలేదా? ఆ లెక్కనే కాష్టాలనాయుడుగారు అమరాం గ్రామవాసులతో ఎన్ని నాటకాలాడినా భార్యను బాగానే చూసుకునీవారు. ఒక్కగానొక్క కూతురు జయమ్మను కళ్లల్లో వత్తులు వేసుకుని కాపాడుకునీవారు.

'మీ చోడవరానికి దూరంగా ఉండీ అమరాం సంగతీ, ఆ పల్లెపట్టున సర్కారువారి సేవ చేసుకుంటున్న కాష్టాలనాయుడుగారి గురించీ మీకెలా తెలుసురా కుంకాయిల్లారా..?' అని మీరెవరయినా మమ్మల్ని ఉన్నపాటునే అడిగీవచ్చు. ధానికీ మా దగ్గరో రీజనుంది.

నాయుడుగారి ముద్దుల కుమార్తె జయమ్మ చోడవరాన్నే ఉంటుంది. జయమ్మ మొగుడు కంచుబోయిన ఈశ్వరరావు పీడబ్ల్యూడీలో ఇంజినీరు. ఈ కంచుబోయిన మహానుభావుడు మాత్రం మావగారిలా కాదు. తన ఉద్యోగం, తన పని, తన బతుకు అన్నట్టుండీవాడు. టైముంటే ఆఫీసయ్యేక నూకాల్తల్లి గుడికెళ్లి దండం పెట్టుకుని ఇంటికెళిపోయీవాడు. జయ విషయం చెప్పాలంటే ఆవిడ మొగుడులాటిది కాదు. ఇంకా చెప్పాలంటే మొగుడికే మొగుడులాటిది. మరీ చెప్పాలంటే మొగాడికే మొగుడులాంటిది. పూర్తిగా తండ్రిలాటిది. రంగూ రుచీ వాసనా అబ్బగారివే తెచ్చుకుని భూమ్మీద పడింది. ఓ మాదిరీ చిన్నకాష్టంలా ఉండీది.

చిన్నప్పుడు మేం వెళ్లే స్కూలు దారిలోనే తగిలీది ఈ జయమ్మ ఇల్లు. నాయుడుగారే పెళ్లికానుకగా ఆమె గారికి ఆ కొంప కొనిపెట్టేరు. ఆ ఇల్లూ వాకిలీ చూసే కంచుబోయినవారూ ఆమె మెళ్లో తాళికట్టేరు. కూతురు పెళ్లయ్యేక కాష్టాలనాయుడు వారానికి కనీసం రెండుసార్లయినా జయమ్మ ఇంటికి వచ్చీవారు. మునసబు కదా. వచ్చీటప్పుడు 'రాజు పోతులా ఉన్నాడు..' అన్నట్టుగా దయచేసీవారు. ఆయనగారు మా ఊరికి సువేగా మీద రివ్వురివ్వున చేరీవారు. ఆయన ముందు తలయారి లచ్చయ్యగాడు రొప్పుతూ రోజుతూ

పరుగుమీద పరుగ్గా వచ్చీవాడు. చెమట్లు కక్కుతూ వస్తున్న లచ్చుణ్ని చూస్తే మా గుంటల గుండె చెరువైపోయిది.

పైగా వచ్చీటప్పుడు వాడు ఉత్తిచేతుల్తో వచ్చీవాడు కాడు. కొబ్బరికాయలో, మునక్కాయ కట్టలో, బస్తాలో వేసుకుని మోసుకుంటూ వొచ్చీవాడు. ముష్టి పుస్తకాల సంచీలనే స్కూలికి తీసుకెళ్లడానికే ఆపసోపాలు పడిపోయే మాకు సదరు లచ్చుడుగాడు అమరాం నుంచి బరువుల్తో వొస్తుండటం చూసి గుండె జారిపోయిది. నిక్కరు నీరయిపోయిది. వాడేం చిన్నవాడు కాడు. అరవైయ్యేళ్లవాడు. మునసబుగారి కంటే పెద్దవాడు. 'ఎలా రన్నింగ్ చేస్తున్నాడ్రా బాబూ..!' అనుకుని విస్తుపోయీవాళ్లం. వీడే గనక మా స్కూలు గ్రిగ్స్ పోటీల్లో పాల్గొంటే సిక్స్‌టీన్ హండ్రడ్ మీటర్స్ డేష్‌లో ఫస్టే అనీసుకునీవాళ్లం.

లచ్చుమయ్య గుండెలవిసిపోయేలా మైళ్లకు మైళ్లు పారొచ్చినా కిక్కుకక్కుమనీవాడు కాడు. వాడి వెనకాల నిదానంగా సువేగా మీద పుట్టకొక్కులా వచ్చీ నాయుడుగారు మాత్రం వంద పందిరి గుంజలు పాతినవాడిలా ఆయాసపడిపోతుండీవారు. కాళ్లమీద వచ్చిన సర్వెంట్ కంటే మోపెడ్ మీదొచ్చిన ఆఫీసర్దే కష్టమన్నట్టుగా ఫీలయిపోయీవాడు. వస్తూ వస్తూనే 'అమ్మా. అమ్మా. జయమ్మా..' అని గావుకేకలు పెట్టీవారు.

జయమ్మ నికార్సయిన అనురాగాల కూతురు. తండ్రంటే పంచప్రాణాలు. తండ్రంటే సప్తధాతువులు. తండ్రంటే అష్టైశ్వర్యాలు. అందుకే నాన్న నోటికి వెనువెంటనే చల్లని చల్ల గళాసు అందించీది. తలయారిగాడి సంగతి మరిచిపోయిది. వాడు మెల్లగా ఊపిరి తీసుకుని బానయ్య కోనేరుకి పోయి దాహం తీర్చుకుని వచ్చీవాడు. జయమ్మగారు నీళ్లివ్వలేదని గానీ, అమరాం నుంచి ఒగర్చుకుంటూ రాలేపోతున్నాననిగానీ కలలో కూడా అనుకునీవాడు కాడు. వాడి బార్య గంగియ్యమ్మ మాత్రం ఈ వరసంతా తెలిసి అప్పుడప్పుడు నొచ్చుకునీది. సణుగుళ్లు పెట్టీది. పట్టించుకునీవాడు కాడు లచ్చుడు.

ఓసారి ఏం జరిగిందంటే, ఎప్పటిలాగానే కన్నబిడ్డ మీద ప్రేమపుట్టి నాయుడుగారు ఉదయాన్నే ఊళ్లో బయల్దేరీసి ఝుమ్మంటూ చోడవరం వచ్చిపడిపోయేరు. అప్పటికి తొమ్మిదయింది. ఆయనతోపాటుగా ఎప్పటిలాగానే లచ్చుమయ్యా దౌడాయిస్తూ వచ్చేడు. వాడు వేసుకున్న ఖాకీ చొక్కా అప్పటికే పూర్తిగా చెమటతో తడిసి ముద్దయింది. ఆయాసం తీర్చుకుంటూ జయమ్మ ఇంటి ముందర ఖాళీ జాగాలో ఓ మూల కూర్చున్నాడు. వాడు చాలా జాగ్రత్త మనిషి. గొంతికిళ్లా కూర్చున్నప్పుడు సైతం సిగ్గుపోకుండా వేసుకున్న పెద్ద ఖాకీనిక్కరు మడతల్ని తొడల మయాన దోపుకుని వొందిలీకంగా కూచుంటాడు. అయ్యగారు లోపల్నించి ఎప్పుడు పిలిస్తే అప్పుడు పారెల్లాలన్నట్టుగా స్టేడీలోనే ఉంటాడెప్పుడూనూ.

సువేగాని వాకిట్లో వదిలేసి ఇంట్లోపలికి వెళ్లేరు నాయుడుగారు. కూతురు జయమ్మ తండ్రిని ఆప్యాయంగా పలకరించింది. అల్లుడు ఈశ్వరరావు మావగారికి నమస్కారాలు చెల్లించుకున్నాడు. భార్యను చూస్తూ 'ఆ లచ్చుడికీ ఇన్ని నీళ్లో, కాఫీయో పొయ్యమ్మా..' ప్రాధేయపడుతున్నట్టుగా అనేసి ఆఫీసుకి పోయేడు. 'ఆ. ఆ. అలాగే..' అంటూ విస్సాటంగానే సమాధానమిచ్చింది జయ.

ఈశ్వరరావు వెళ్లిపోయేక తండ్రీ కూతుళ్లు ఆప్యాయంగా మాటల్లో పడిపోయేరు. అప్పుడిక ఉన్నట్టుండి నాయుడుగారికి గుర్తొచ్చిందొక విషయం. పక్కలో బాంబు పడినట్టే ఉలిక్కిపడ్డారు. చిరుచెమట్లు పట్టిపోయారు. చప్పున చొక్కాజేబులు తడువుకున్నారు. ఆనక ఉసూరుమన్నారు. దెబ్బతినీసినట్టుగా అయిపోయేరు. నిస్త్రాణమేదో ఆవహించినట్టుగానూ మారిపోయేరు. ఉండుండి తండ్రి అలా నీరసపడిపోయేసరికి జయమ్మకి అంతు పట్టలేదు. ఏం జరిగిందోనని ఆందోళనగా ఆరా తీసింది.

అమరాంలో ముక్కు పొడుం డబ్బా మరిచిపోయి వచ్చీసినట్టుగా అదోలా మొహం పెట్టి కూతురితో చెప్పేరు నాయుడుగారు. ఆ మాట విని తండ్రి కంటే హెచ్చుగా కూతురే తల్లడిల్లిపోయింది. సాయంత్రం దాకా తన జనకుడు పొడుంపట్టు పీల్చకపోతే ప్రపంచం స్తంభించిపోతుందన్నట్టుగా సృష్టి లయమైపోతుందన్నట్టుగా ముఖం పెట్టింది. ఏదో ఆలోచన రాగానే టపీమని తేరుకుంది.

'దానిదేం ఉందిలే నాన్నా. సింగారయ్యశెట్టి కొట్టుమీదికి లచ్చుణ్ని పంపించి తెప్పించేద్దాం.' అంది.

'అబ్బెబ్బే. అదెలా కుదురుతుంది. నేను పీల్చే పొడుం మామూల్దా. పొగాకుని నేనే గుండ కొట్టుకుని మదరాసు కునేగా సెంటు కలుపుకుని స్వయంగా తయారుచేసుకునీది. నా గురువు మెలిపంతులుగారి దగ్గర నేర్చిన గొప్ప విద్య అది. అది తప్ప మరొకటేదీ నా ముక్కుకి ఎక్కదు. సాయంత్రం దాకా నా తల్లి ఇంట ఉండాలనే వచ్చేను. దేవుడు చిన్నచూపు చూసేడు. పొడుంకాయ లేకుండా చేస్సేడు. మంచివాళ్లను రక్షించవలసిన భగవంతుడే ఇలా కక్ష కడితే నేనేం చేతును.' జగమంతా జలజలా రాలిపోయినట్టు, భూగోళమంతా బడాబడా పగిలిపోయినట్టు, సృష్టంతా సలసలా కాగిపోయినట్టు– దీనంగా మాట్లాడేరు. జయమ్మ విలవిల్లాడింది. 'తండ్రికి కొడుకయినా తనే. కూతురయినా తనే..' ఈ మాట అనుకోగానే ఆమె మదిలో ఉపాయం మెదిలింది.

'నాన్నా! నీకేం బాధలేదు. నువ్వు చింతపడకు. ఇప్పుడే నీ ముక్కుపొడుం తెప్పించే ఏర్పాటు చేస్తాను. లచ్చుగాణ్ని వెళ్లి తెమ్మనమందాం. వాడయితే ఇలా వెళ్లి అలా వచ్చీగల్డు. సరిగ్గా భోజనాల వేళకల్లా తెచ్చెస్తాడు. వాడికి ఇక్కడే మంచి తిండి పెడదాం.' అని చెప్పేసింది.

'ఇప్పుడే వచ్చేడు. మళ్లీ ఊరెళ్లి రావడమా. దూరం హెచ్చు కదూ.' నసిగేరు నాయుడు.

'అదేంటి నాన్నా! ఎవడి ఉద్యోగం వాడు చెయ్యాలి. చెప్పుల పని చెప్పులు చెయ్యాలి. కిరీటం పని కిరీటం చెయ్యాలి. ఎవడి నుదుటిరాత ప్రకారం వాడు నడవాలి. లేదా పరిగెట్టాలి. దానికి మనవేం చేయగలం.' అంటూనే 'లచ్చూ.. ఓ లచ్చయ్యా..' కేక పెట్టి వాకిట్లోకి వచ్చింది.

మట్టసంగా మట్టినేల మీద కూచున్న లచ్చుడు జయమ్మ గొంతు విని ఉలిక్కిపడ్డట్టుగా లేచేడు. భుజం మీదున్న తువ్వాలు గుడ్డ తీసి చంకలో పెట్టీస్కుని నిలుచుండిపోయేడు.

'ఏటి సెలవు తల్లీ.' బుర్ర దించుకుని భూమి కరుస్తున్న నేత్రాలతో వందనంగా అడిగేడు.

'అర్జంటుగా నువ్వు అమరాం వెళ్లి రావాల్రా. ఇక్కడున్నట్టెళ్లి వచ్చీయాలి.' అభ్యర్థనగా కాకుండా ఆర్డర్లా గళం విప్పింది. లచ్చుమయ్యకి వెంటనే అదేం అవగతం కాలేదు. 'ఇప్పుడే కదా వచ్చేం. మళ్లీ ఎందుకెల్లాలి..' అన్నట్టుగా బుర్రగోక్కుంటూ,

'అలగేనమ్మా. మునసబుగోరు రారేటి.' వినయంగా అడిగేడు.

'నాన్న రారు. ఆయన ముక్కుపొడుం డబ్బా ఊళ్లో మరిచిపోయేరట. అది లేకుండా ఆయనకెలా దినం తీరుతుంది. వెళ్లి పట్టుకొచ్చీ. ఆ డబ్బా ఎక్కడుంటుందో తెలుసా నీకు.' తనేదో స్కూటరో జీపో ఇచ్చి లచ్చుణ్ని వెళ్లమన్నట్టుగా కంఠం పెంచి గట్టిగా చెప్పేసింది జయ. ఆ దెబ్బకి లచ్చుడు అదిరిపోయినట్టుగా అయిపోయేడు.

'అయ్యబాబోయ్. ఏటిది. పొడుం డొక్కు నేకుండానే బావు ఎలిపొచ్చీనారా. ఎంత దార్నం. అసలికి అది పీలకపోతే మునసబుగోరి మర్యాదేటి కావాలి. గౌరవమేటి కావాలి. అది నేకుండా వూరి అబివుద్దికి ఆయన ఏ తీరుమానాలు సెయ్యగల్డురు. వొవులికేనే ఈ సంగతెలితే పరువు తక్కువ. ముందు తలారీగా నాకే తలకాయి తీసేసినట్టు. తల్లీ. నువ్వొల్లకుండుమీ. నిమసాల మీదొట్టుకొచ్చేత్తాను. నాన్న కచేరీ గూట్లో ఆ కాయ ఉంతాది. నాకు తెల్దేటి. ఇప్పుడే పారెల్తాన్నాను.' ఇలా పలుకుతూ జయమ్మ చెప్పేదేం వినకుండా వీధిలోకి గెంటీసేడు. రయ్యిరయ్యిమని పరుగులు మొదలెట్టీసేడు. అప్పుడిక జయమ్మ మనసులోనే,

'ఓరినాయినా వీడి బలం మండా. వీడి ఓపిక మండా. బయట ఎంత ఎండకాస్తోంది. ఎక్కడ అమరాం. ఎక్కడ చోడారం. పదిమైళ్లకి పైనే దూరం. ఇప్పుడే వచ్చేడా. మళ్లీ వెల్లేడు. మళ్లీ వస్తాడు. నాన్నతో సాయంత్రం మరోసారి వెళతాడు. అంటే ఈ రోజు మొత్తాన వాడు నలభయ్యో యాభయ్యో మైళ్లు పరిగెట్టినట్టు. అయ్యబాబోయ్. ఆ పరమాత్ముడు వచ్చీ జన్మలో ఏం పుట్టక పుట్టించినా ఫరవాలేదు. తలయారిగా పుట్టించీకూడదు..' మనసులో అనీసుకుంది. ఈ ప్రాప్తికి వేయిదేవుళ్లకు దండాలు పెట్టీసుకుంది.

ఇంతగా అనుకున్నా ఆ మహాతల్లి హృదయంలో వాడి పట్ల ఏ అభిమానమూ పుట్టకపోవడానికి కారణం ఆమె కాష్టాలనాయుడుగారి జన్యువులతో జన్మించడం మినహా మరోటి కాదని ఈ సందర్భంగా మనం చెప్పుకోవచ్చు. లచ్చుణ్ని ఊరిమీదికి బెత్తాయించి ఇంట్లోపలికి వచ్చిన జయమ్మని చూసి మంచిపని చేసేవన్నట్టుగా ముఖం పెట్టేరు నాయుడు. అక్కడితో జయమ్మ లచ్చుడి సంగతి

మరిచిపోయింది. ముందురోజు తను తయారుచేసిన కరకజ్జం, మినపసున్ని పెద్ద ప్లేట్లో పెట్టి నాన్న ముందు పెట్టింది. 'ఇవి తింటూ ఉంటే క్షణాల్లో భోజనం ఏర్పాట్లు చేస్తాను..' అని చెప్పేసి వంటగదిలోకి కదిలిపోయింది.

నాయుడుగారిక్కడ తియ్యని కరకజ్జం తింటుంటే అదే వేళకి అమరాం దారిపట్టిన లచ్చుడు ఆయాసపడుతూ ముందుకు సాగిపోతున్నాడు. గోతులూ గీతులూ చూసుకోడంలేదు. కాలంకూడా వాడితో కలిసి ప్రయాణిస్తున్నట్టుగా ఉరుకుతోంది. మధ్యాహ్నం ఒంటిగంటన్నరయింది. అప్పుడే జయమ్మ పెట్టిన పులిహార పుచ్చుకుని, కొబ్బరిపచ్చడీ అన్నం తిని, వేపిన పెరుగు మిరపకాయల్ని బెల్లంపులుసు అన్నంతో పటపటలాడించి, బంగాళాదుంపల కుర్మాని పెరుగన్నంలో నంచుకుని ఎంగిలిపడ్డారు నాయుడుగారు. సేదతీరే ప్రయత్నంలోనూ పడ్డారు.

బోయినం అయిపోయినా నాయుడుగారికి నలతగానే ఉంది. అప్పటికే చాలా సేపయింది ఆయన ముక్కుపొడుం పీల్చి. మెతుకులు కతికి నడుంవాల్చిన వేళ రొంత పొగాకు గుండ ముక్కులో పెట్టుకుంటే వచ్చే ఆనందం ఆయనకి తెలియంది కాదు. అందుకే లచ్చుడు ఎప్పుడొస్తాడోనని సూర్యుడికోసం కమలం ఎదురుచూస్తున్నట్టుగా చూస్తున్నారు. పొడుం కుతి తీరక అప్పటివరకూ తను ముక్కు తుడుచుకున్న పాతరుమాలునే పైకి తీసి వాసన చూస్తున్నారు. ఆ మాత్రం పొగాకు వాసనే పరమాన్నం తింటున్నట్టుగా ఆస్వాదిస్తున్నారు.

గడియారం రెండు కొట్టీసరికల్లా ఊడిపడ్డాడు లచ్చుడు. వచ్చినవాడు నీరసపడి పోయి కనిపించేడు. పరుగెత్తి పరుగెత్తి ఒంట్లో ఉన్న ఆవీజీవీ లాగీసినట్టుగా అయిపోయేడు. ముఖంలో కళలేదు. దాహం వేస్తోందని సంజ్ఞచేసేడు. వస్తూ వస్తూనే కాగితం చుట్టి చేత్తో పట్టుకున్న పొడుండబ్బాను జయమ్మకి అందించీసి వాకిట్లో కూలబడిపోయేడు.

వాడి పరిస్థితి చూసి జయ తొలుత కొంచెం చలించింది. కానీ, ముక్కుపొడుం చేతికందగానే ఆమెలో పుట్టిన ఆనందం ఆ చలింపును తుళ్లగొట్టీసింది. వాణ్ణసలు పట్టించుకోకుండా డబ్బా తీసుకెళ్లి తండ్రికి అందించింది. నశ్యం చేతికి రాగానే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు భారతీయులు పొందినంత ఆనందం పొందేరు మునసబుగారు. గాంధీ జయంతినాడు స్వేచ్ఛపొందే జీవితఖైదీలు పడేటంతటి సంతోషమూ పడ్డారు. పక్కమీంచి లేచి గబాగబా నాలుగైదు పట్లు బ్రహ్మాండంగా పీల్చీసేరు. పొడుం ఘాటు నషాళానికి చేరేక ఫడాఫడా నాలుగు తుమ్ములు తుమ్మీసి ఇల్లంతటినీ తుంపర్లతో పావనం చేస్సేరు. అనంతరం ముక్కూగిక్కూ తుడుచుకున్నారు. సంజీవని తెప్పించి చివరినిమిషంలో తనను బతికించిన కూతురిలా జయమ్మ వైపు ఆప్యాయంగా చూసేరు. కృతజ్ఞతా పూర్వకంగా మొహం పెట్టేరు. ఆమె కూడా పొడుంకాయని నాన్నకివ్వగలగడం చిన్న విషయం కాదనుకుంది. తండ్రి ఛస్తున్న వేళ ఉద్ధరిణితో తులసితీర్థాన్ని గొంతులో పోసే ఒకానొక పెద్ద కొడుకు ఆత్మతృప్తిలా ఆ క్షణాన ఆమె ముఖం మెరిసింది. కూతుర్నయి పుట్టినప్పటికీ తండ్రికి మగనలుసుల్లేని లోటు తీరుస్తున్నట్టుగా ఆమె వదనం ఆ సమయాన మెరిసింది. తండ్రీకూతుళ్ల ప్రేమానురాగాలు ఇంట్లో ఇలా పరిఢవిల్లిపోతుంటే అక్కడ వాకిట్లో ఎండపొడన కుడిచెయ్యి తలకింద పెట్టుకుని దెబ్బతిన్న జింకలా పడుక్కుని ఉన్నాడు లచ్చుడు.

'వాడికి కాస్త తిండి పెడితే మంచిదేమో.' కూతురితో అన్నారు నాయుడు తప్పదన్నట్టుగా.

'అవునవును. వాడి కోసం వార్చిన గంజి సిద్ధంగానే ఉంది. రాత్రి అన్నంలో ఇప్పటి వేడన్నం కొద్దిగా కలిపి పెట్టేస్తాను. మాగాయ ఎలాగూ ఉంది. ఇక లేనిదేవిటి.' వంటగదివైపు దారితీసింది జయమ్మ.

'రాత్రి అన్నం..' ఈ మాట వినగానే కూతురు ఎంతటి ఊర్జితమంతురాలో గ్రహించిన నాయుడుగారి ఆనందం అర్ణవమైంది. 'అన్నానికి లే.' అంటూ జయమ్మ పెట్టిన కేకతో లేచి కూచున్నాడు వాకిట్లోని లచ్చుమయ్య. కోనేరుకెళ్లి కాళ్లూ చేతులూ ముఖం కడుక్కొచ్చేడు. మూడు గంటల వేళ పెరట్లో అరటి ఆకు తుంచి పరుచుకున్నాడు. ఆకులో పాత కొత్త అన్నాల మేలుకలయికను వడ్డించింది జయమ్మ. గంజి పోసింది. ఆకు చివర మాగాయముక్కలు, ఉప్పు బెడ్డలు జల్లి వెళ్ళింది. అసలే ఉదయంనించీ ఉరుకులు, ఆ మీదట దహిస్తున్న ఆకలి. గంజీఅన్నాన్ని కుమ్ముకుతిన్నాడు లచ్చుడు. అన్నాన్ని నమలకుండా మోజుగా మింగుకుంటూ పోయేడు. మధ్యమధ్యలో మాగాయముక్కల్ని గుటుకూ గుటుకూ మనిపించేడు. ఆకులో ఒక్కటంటే ఒక్క మెతుకూ మిగలకుండా తినీసేడు. మరుకొంచెం అన్నం పెడితే బాగుణ్ణనుకున్నాడు. ఇంతలోనే 'పెరట్లోకెళ్లి చెయ్యికడుక్కో.' అనే జయ మాటలు సూటిగా వచ్చి తగిలీసరికి మారు మాట్లాడకుండా తిన్న అరిటాకు మడిచిపట్టుకుని ఇంటి వెనకవేపు వెళ్లేడు. అక్కడ అతని కోసం సిద్ధంగా ఉన్న ప్లాస్టిక్కు డొక్కు నీళ్ల తీసుకున్నాడు. తుప్పలూ డొంకల్లోంచి నడుచుకుంటూ వెళ్లి పెరటి తలుపుతీసి ఆవలెక్కడో ఆకు పారీసి వచ్చేడు. నీళ్లు ఎత్తిపెట్టి తాగి చేతులు కడుక్కున్నాడు. ముందువేపు వాకిట్లోకి వచ్చి తిన్న చోటును డొక్కులో నీళ్లతో శుభ్రం చేసేడు. నేలమీద తువ్వాలు పరిచేడు. దానిమీద కూలబడ్డాడు. అయిదు నిమిషాలయ్యేసరికి వాడు ఈ లోకంలో లేడు. మరో ప్రపంచ విహారణలో ఉన్నాడు.

కాగా, ఇంట్లో ఉన్న నాయుడుగారు వాడికంటే ఎక్కువే తిన్నారు. వాడికంటే హెచ్చు ఆధరవులే లాగించేరు. వాడికంటే గొప్ప పక్కమీదనే వాలేరు. అయినప్పటికీ నిద్రపట్టడం లేదు. కాబట్టే వాకిట్లో గుర్రుకొడుతున్న లచ్చుగాణ్ని చూసి ఈర్ష్యపడిపోయారు. 'వెధవ ఎంత అదృష్టవంతుడో. హాయిగా నిద్దర చేస్తున్నాడు..' అనుకుంటూ కొంతసేపు కుళ్లుకున్నారు. ఆయనలా ఇంకొంచెం సేపు నజ్జునజ్జుగా గడిపీసరికి అయిదయింది. మొహం కడిగేరు. కూతురు ఇచ్చిన కాఫీ తాగేరు. అమరాం ప్రయాణమయ్యేరు.

అప్పటికే వాకిట్లో నిద్దరపోతున్న లచ్చుడు లేచేడు. ప్లాస్టిక్కు డొక్కులో మిగిలిన జలాలు సేవించేడు. జయమ్మ గారు పోసిన టీచుక్కలు చప్పరించి తాగేడు. మునసబుగారి శెలవు కోసం ఎదురు చూడ్డం ఆరంభించేడు.

కూతురుకి వీడ్కోలు పలికి నాయుడుగారు అయిదున్నర ప్రాంతంలో ఇంటి బయటకొచ్చేరు. లచ్చుణ్ని చూసేరు. వాడు మళ్లీ పరుగుపెట్టడానికి సిద్ధంగా ఉన్నానన్నట్టుగా ఉన్నాడు.

'పాపం పొద్దున్నించీ గుండెలు అవిసిపోయేలా లగెత్తేడు. వాణ్ని తన సువేగా మీద కూర్చోబెట్టుకుని పట్టుకుపోవచ్చు. అయినా అదెలా కుదురుతుంది. ఎవరయినా చూస్తే మునసబు కుర్చీకే నామర్దా. ప్చ్! తాను మేలు చేయాలనుకున్నా వాడి తలయారీ కొలువు వాడికి మేలు చేయనివ్వడం లేదు..' ఈ బాపతుగా ఏదో ఆలోచించి, తన తప్పేమీ లేదన్నట్టుగా అనీసుకుని, ఎప్పటిలాగానే దౌడు తీయాలని వాడికి నేత్రాలతోనే పురమాయించీసేరు. తాను ప్రయాణించే మోపెడ్‌ను చాలా తక్కువ వేగంతో నడిపి వాడికి కొంతలో కొంతయినా మేలు చేసి తీరాలని సంకల్పం చెప్పుకున్నారు. బండి స్టార్ట్ చేసేరు.

ముందు తలయారి లచ్చుడు. వెనుక మెల్లగా కదులుతున్న సువేగా. చోడవరం దాటి అమరాం వైపు ప్రోటోకాల్ దారిపట్టింది. అలా పట్టి పట్టి మరో గంటన్నర తర్వాత గమ్యం చేరుకుంది.

ఇల్లు చేరిన మునసబుగారు మోపెడ్‌ని మెల్లగా నడిపినందువల్ల కలిగిన అసౌకర్యాన్ని పెద్దమనసుతో మరిచిపోతూ బండిని లచ్చుడికి ఇచ్చేరు. వాడే దాన్ని పెరట్లో స్టేండేసి నిలబెట్టేడు. మునసబుగారు పొమ్మనగా ఆ రోజుకి విధినిర్వహణ అయిపోయిందని తలచి ఇంటికిపోయేడు.

వాడూ అలా ఇల్లు చేరగానే వాడికోసం ఎప్పటినుంచో చూస్తున్నట్టున్న వాడి పెళ్లాం గంగియ్యమ్మ రగిలిపోడం మొదలెట్టింది. రంధికి దిగిపోయింది.

'అసలేటి నీ ఉద్దేసం. అసలేటి నీపాటు. నువ్వు మనిసివా? మానువా? మానిద్దూ బావూ! ఆ దిక్కుమాలిన ఉజ్జాగం.' నిప్పురవ్వలా రవరవలాడిపోయింది.

తిరిగి తిరిగి ఇంటికొచ్చిన లచ్చుమయ్యకి ఇదేం అర్థంకాలేదు.

'ఓసె. పిచ్చేటే నీకు. నానెందుకు డూటీ మానీయాల మద్దిన.' కసురుకున్నాడు.

'మరి మానీవేటి. ఏటి నీ కొలువు. సవ్వడానికా?. బతకడానికా.?' ఎదురు ప్రశ్నించింది గంగి. వాడికేం బోధపడలేదు. బుర్రగోక్కున్నాడు.

'నా కొలువుకేటి నాడెంగానే ఉన్నాది గదేటి' నసిగేడు.

'ఏటి నాడెంగుంది. నువ్వింటాకట మళ్లీ ఊళ్లోకొచ్చినావట్ట. మళ్లీ చోడారం పోనావట్ట.

ఇన్నిసార్లు ఊళ్ల మద్దిన తైతక్కనాడితే నువ్వేం బతుకుతావోరే. ఆ మునసబు నిన్ను మనసినుకున్నాడా? పసువనుకున్నాడా?' మహంకాళిలా రెచ్చిపోయింది. అప్పటికిగానీ లచ్చుడికి పెళ్లాం గోల పూర్తిగా అర్థం కాలేదు.

'ఒస్సు అదా. మరి తలారీ అంటే తప్పదు గదేటి. అంతేసి దూరాలు జాపోసీసుకుని తిరగడం నాకేటి మక్కువేటి.' అన్నాడు వీలయినంత మంచిగా.

'తియ్యోహే. అదెవడి డూటీ. ముందు బతికుంతే గదా. ఎగసోస దిగసోస అయిపోయిలాగ దౌడాయిత్తే ఇకనేటి. రోగాలొచ్చి సత్తాం. మీ మునసబుకి మంచీ సెడ్డా నేదేటి. ఇచ్చిది ఈకన్నర దొబ్బీది జావున్నర. ఆలింట్లో మనుసుల్ని అలగ పరిగెట్టి డూటీలు సెయ్యమను. అప్పుడు తెలుత్తాది ఆ బావుకి.' కసిరీసింది. దీంతో లచ్చుడికి తారకం ఎక్కిపోయింది. ఎప్పుడయితే తన యజమానిగారిని తన పెళ్లాంగారు తిట్టిపోస్తోందో మరిక ఆగలేకపోయేడు. వాడిలో స్వామిభక్తి పొడపాములా పైకిలేచింది. నాగుపాములా పడగ విప్పింది. తాచుపాములా కోరలు సాచింది.

'నోర్ముయ్యే ఎదవకానా. మా మునసబుగోరిని అనీపాటిదానివేటి. ఆయనెవరుకున్నావు. ఈ ఊరికే మారాజు. నేను ఆయనగోరి దగ్గిర బంట్రోతపాణ్ణి. ఆ బావు ఏటి సెప్తే అది సెయ్యాలొసిందే. పైగాని ఆయన మనకంటేని గొప్ప కులపోడు. నాయుల్లంతే ఏటనుకున్నావు.' అన్నాడు భీకరస్వరంతో.

ఏ క్షణమైతే పెనిమిటి కులాల ప్రస్తావన తెచ్చేడో గంగియమ్మ ఆగలేకపోయింది. పేట్రేగిపోయింది. అమాయకత్వం వల్లే మొగుడు నానా బాధలూ పడుతున్నాడని ఆ అమ్మకి పూర్తిగా తెలిసిపోయింది. తలయారి ఉద్యోగం వాడి ప్రాణం తీసీసి తీరుతుందన్నట్టుగా అయిపోయింది. వెంటనే సరికిసరిగా తగులుకుంది.

'ఎవడిదిరా గొప్ప కులం. మీ నాయుడిదా. ఏట్రా ఆయనగోరి కులం. ఆయనేటి బాపనోడా. రాసోడా. కోవటోడా. ఆయనగోరు పెద్ద కులపోడేటి. మతినేకండా మాటాడక.' విరుచుపడింది. ఈ మాటలు వినగానే పెళ్లాం చాలా అవివేకంతో మాట్లాడుతోందని లచ్చుడు ఠక్కున ఒక నిర్ణయానికి వచ్చీసేడు. తన భార్యకి ప్రపంచజ్ఞానం బొత్తిగా లేదన్న బాధ వాణ్ని చుట్టుముట్టీసింది. 'ఇంత ఎర్రిపప్పతో ఎలా కాపరం జేస్తన్నానో గదా..' అనుకుంటూ తన మీద తనే తెగ జాలిపడిపోయేడు. 'తను గాకండా మరొకడెవడయినా దీన్ని కట్టుకునుంతే ఇదెంత దెబ్బయిపోనో గదా..' అనీసుకుని తెగ ఇదయిపోయేడు. భార్యకి విషయమంతా తేటతెల్లంగా చెప్పాలని కోపాన్ని తగ్గించీసుకున్నాడు. అప్పటికప్పుడే చల్లబడిపోయేడు. రుసరుసలాడుతున్న గంగి దగ్గిరసావచ్చేడు. అనునయంగా ఆమె బుర్రమీద చెయ్యేసేడు. అప్పటివరకూ కరకరా మాట్లాడిన గంగి మొగుడి హస్తం స్పర్శతో కొంచెం శాంతించినట్టయింది. కళ్లకు నీళ్లు తెచ్చుకుంది. అప్పుడు లచ్చుడు అన్నాడు కదా.. 'చూడే గంగీ. ఇంత సత్తెకాలపుదానివయితే ఎలా బతుకుతావే. మునసబు గోరు పెద్దకులపోల్లు గాదా? ఎవరే నీకు సెప్పింది. ఆయనగోరు నాయుడు. నాయుల్లంటే పెద్ద కులవే.' ప్రవచనంలాగా పటిష్టంగా పలికేడు. అయినా గంగికి అదేం బుర్రకెక్కలేదు. మునుపటి కంటే నిదానంగా గొంతు సవరించింది.

'అదెలగవుద్ది మాయ్యా. ఆయన సూద్రపోడు గదా.' అమాయకంగా ముఖం పెట్టి మనసులోని సందేహాన్ని బైటపెట్టీసింది. గంగి అలా అడిగీసరికి లచ్చుగాడి ముఖం తెలివైనవాడిలాగ వెలిగిపోయింది. వెలిగిన ముఖాన్ని వాడు మరింతగా వెలిగించుకుంటూ..

'ఒసోసె. నీ తెలివి తెల్లారినట్టుందయితేని. పెద్ద కులవంటే నా ఉద్దేసకం నాయుల్లు మనకంటే పెద్ద కులవే గదా. అదన్నమాట. వుప్పుడూ, బాపనోరు అందరికంటేను పైనుంతారు. ఆరి కింద ఎవరుంతారు? రాసోలుంతారు. ఆరి కిందని కోవటోల్లు. ఆల్లకిందని సూద్రపజాతి. ఆ కిందని ఎక్కడో మనం ఉంతాం. ఇందల ఎవడు ఎంత మొనగోడయినా ఇంతగద్దు పైనున్నోడికీ సేవ సెయ్యాలొసిందే. మన పెద్దలు ఎట్టిందిది. మనం ఎవులమే మార్సీనానికి. పెసిరెంటు తిమ్మరాజుగోరికి తిమ్మిరేటి? ఆ బావు పక్కా రాజుగోరయినా కరణం చెర్మగోర్ని సూసినప్పుడు ఏటి సేస్తారు. భుజం మీద తుమాల్తీసీసి, దండాలెందుకెడతారు?' ఉన్నపళంగా పెళ్లాం ముందర ఒకటోరకం కులాల నిచ్చెనొకటి తెచ్చి వేస్సినట్టు మాటలు పేర్చుకొచ్చీసేడు లచ్చుడు. అంతటితో ఊరుకున్నాడా! ఆ నిచ్చెన మెట్ల మీద పెళ్లాన్ని చెయ్యిపట్టుకుని మరీ చకచకా పైకెక్కించీసినట్టు, కచకచా కిందికి దించీసినట్టు ఏదేదో వాదించీసేడు కూడాను.

పెనివిటి మాటలకి గంగికి శోషొచ్చీసినట్టయింది. సగం అర్థమైనట్టు సగం అర్థం కానట్టుగా అయిపోయింది. బుర్రవేడెక్కిపోయినట్టయింది. జాస్తీగా యోచిస్తే తల తిరిగిపోయిలా అనిపించీసింది. అప్పుడింక నెత్తిమీద చెయ్యిపెట్టుకుని 'అసలికి నాకెందుకు ఈ గోలంతాని. నాకెందుకు లేని పోని ఈ బేజారంతాని..' అన్నట్టుగా గుడిసెలోకి దూసుకొస్తున్న చీకటిని తరిమేందుకు గబగబా వెళ్లిపోయింది. ఇంకేవుంది. క్షణాల మీద గూట్లో దీపం వెలిగిసింది. లచ్చుడి నోట్లోకి ముద్దా దిగిసింది. వాడికింక నిద్దరొచ్చీసింది.



- అనిల్ డ్యానీ
9703336688

కనబడని చెయ్యి

ఇది కనబడని చెయ్యి కథ
నీకు నువ్వే ఓటేసుకుని గెలిపించుకున్న వ్యథ
నువ్వలా చూస్తూనే ఉంటావు
నీ ఇంట్లో ఉన్న నీ చెమట ప్రతిఫలాన్ని
మారకం చేద్దాం రమ్మంటాడు
వాడి స్థావరం వెనక ఒక రహస్య మార్గం
ఉందని నువ్వు గుర్తించలేవు
అలాగే నిల్చుని నిల్చుని
నీ పక్కన ఒక ప్రాణం పోతుంది
పురిటి నొప్పులే లేకుండా కొత్త బిడ్డనెలా
కంటావంటాడు?
నమ్మడం అనే ప్రశ్నే ఉండదు, నమ్మి తీరాలి
హఠాత్తుగా నీ మొబైల్‌లోకి వాడు
దూరిపోతాడు
నీ సొమ్ముని వాడి జేబులోనుంచి ఇమ్మని
నీ ఖజానాని ఖాళీ చేస్తాడు
నవ్వుతూ ఏడ్వడం తప్ప నువ్వెక్కడా నోరెత్తలేవు
రోజురోజుకీ నువ్వలా ఖాళీ అవుతున్న
బ్యాంక్ బ్యాలన్స్‌ని చూస్తుంటావు
నీ పక్కనే ఒక ఆకాశహర్మ్యం
నీ సొమ్ముతో వెలుస్తుంది
ఖాళీగిన్నెలతో నువ్వు ఆకలితో నిద్రపోతే
వాడు నీ రక్తమాంసాలని వేరెవడికో
సర్వ్ చేస్తుంటాడు
పండగ పేరు చెప్పి వాడు కొత్త బట్టలు
అమ్ముతాడు
నువ్వు నీ చిరుగుల వస్త్రాన్ని కుట్టుకుంటూ
కూర్చుంటావు
నీ సొమ్ముతో వాడు నీ మరణం శాసనం
రాస్తాడు
మనం మాత్రం రైతుల ఆత్మహత్య లెందుకని
ఒక సుదీర్ఘ చర్చలో మనల్ని మనమే
కొట్టుకుంటాం
ఇప్పుడు దేహం నీది ఆకలి నీది వేదన నీది
కానీ, నిన్ను నడిపించేది మాత్రం
నీకు కనబడని ఒక కార్పొరేట్ చేయి!

'అమ్ముతావా?' అన్న అమ్మాయి ప్రశ్న విని తల ఎత్తాను. రెండు చేతులూ నడుం మీద ఆనించి నేను ఆరబెడుతున్న సిసింద్రీల వైపు చూస్తోంది.

'ఇవి నేను చేసుకున్నవి. అమ్మడానికి కాదు.' సీరియస్‌గా చెప్పాను.

'అలా కాదబ్బాయ్. డబ్బులు ఎక్కువే ఇస్తాను.' రెట్టించింది తను.

కోపంగా తన వైపు చూశాను. 'అసలు ఇవి తయారుచెయ్యడానికి ఎంత కష్టపడాలో తెలుసా నీకు?'

'ఏముందీ ఏడూ ఈజ్ టూ రెండూ ఈజ్ టు అరా! అంతే కదా?' తేలిగ్గా తీసిపారేసింది.

ఆశ్చర్యంగా తన వైపు చూసి, మరుక్షణమే దాన్ని కప్పిపుచ్చుకుంటూ అడిగాను–

'ఏమేంటో అవి?'

'సురేకారం, బొగ్గు, గంధకం. ఇవేగా!'

'మీ అన్నయ్యో తమ్ముడో ఇంట్లో చేస్తారులా ఉంది. వాళ్లు ఇవ్వనన్నారా?' ఎగతాళిగా అడిగాను.

'మా ఇంట్లో వాళ్లెవ్వరూ లేరు. అక్క మాత్రం ఉంది. కానీ నన్నే ఇంట్లో మగపిల్లాడినంటారు.' గర్వంగా చెప్పింది.

'ఓహో! మరైతే తయారుచేసుకోకపోయావా?' అడిగాను.

'ఆ చేసుకునే మా డాబా మీద ఆరబెట్టి బడికి వెళ్ళిపోయాను. అమ్మకు చెప్పడం మర్చిపోయాను. పాడువాన అన్నిటినీ తడిపేసింది.' బాధగా మొహం పెట్టి అంది.

'చెక్కా జానకిరామయ్య కొట్టుకి నడిచి వెళ్ళి సురేకారం, గంధకం నేనే తెచ్చుకున్నాను. మా నాన్న కొంటూ ఉండే పళ్లకొట్టు అతన్ని బతిమాలి దేవదారు పెట్టె తెచ్చుకున్నాను. ఆ పెట్టెను విడగొట్టి చెక్కలను సన్నటి పేళ్ళుగా చీల్చి మా పెరట్లో గొయ్యి తవ్వి ఆ పేళ్ళను కాల్చి బొగ్గు తయారు చేసుకుని దాన్ని దంచి, వస్త్రకాయం పట్టి మెత్తటి పొడిగా చేసుకుని, సురేకారం కూడా పొడి కొట్టుకుని, పాళ్ళు జాగ్రత్తగా కొలిచి చూసుకుంటూ గంధకంతో పాటు కలిపి మందును తయారుచేశాను. మా అక్కనడిగి ఆయిల్ పేపర్లున్న పుస్తకం సంపాదించి గుల్లలు చేసుకున్నాను. నూటాయాభై సిసింద్రీలు... భోజనానికి అమ్మ పిలుస్తున్నా కూడా వెళ్ళకుండా ఒక్కర్తినే కూర్చుని చాలా బాగా చేసుకున్నాను. అక్కను సాయం రమ్మంటే నాకిలాంటివి పడవని చెప్పేసింది దొంగమొహంది! అసలవి ఎంత బాగా కుదిరాయనుకున్నావ్?! జువ్వల్లా అంత పైకి సిసింద్రీలు వెళ్ళడమంటే మాటలా చెప్పు?! కానీ నేనెప్పుడు చేసినా అలానే వెళతాయనుకో! ఏం లాభం! పాడువాన! మొత్తం పాడుచేసింది! ఇప్పుడు చేద్దామంటే ఇంకా మూడురోజులే ఉన్నాయ్ దీపావళికి.' వివరంగా తన బాధ వెళ్ళబోసుకుంది.

పోయిన ఏడాది నాకూ అలాగే జరిగింది కనుక ఆ బాధ నాకు తెలుసు. అందుకని తనపై జాలి వేసింది. 'ఇస్తానులే కానీ, నా సిసింద్రీలు నీ అంత బాగా కాలవేమో. నీవి జువ్వలు కదా!' నవ్వునాపుకుంటూ అన్నాను.

'ఇవాళ ఉదయాన్నే ఇంటి బైటకొచ్చి నువ్వు వెలిగించడం

సిసింద్రీ

చూశాన్లేమ్మా... పర్వాలేదనిపించింది. అందుకే కొందామని వచ్చాను.' తన దర్పానికి నాకు మళ్ళీ నవ్వొచ్చింది.

'డబ్బులేమీ వద్దులే ఓ యాభై తీసుకెళ్ళు. నేనలా అనడమే తడవుగా.. 'ఆహా తొమ్మిదో క్లాసుకే ఎంత దానగుణం!' అని తన దోసిట్లో పట్టినన్ని సిసింద్రీలను అందుకుని పరుగు పెట్టింది.

కొంచెం ముందుకు వెళ్ళి వెనక్కు తిరిగి చూసి చెప్పింది. 'అయినా తొమ్మిదో క్లాసుకొచ్చావు, ఇంకా సిసింద్రీలేంటబ్బాయ్, జువ్వలు... తారాజువ్వలెగరెయ్యాలి!' అని చెప్పింది.

'ఆ పని తమరూ చెయ్యొచ్చుగా?' అరిచాను.

'నేనింకా ఏడోక్లాసే అబ్బాయ్! నాకైతే ఎగరెయ్యాలనే ఉంది. ఇంట్లో ఒప్పుకోరు' అని మళ్ళీ పరుగందుకుంది. మేము ఈమధ్యనే ఈ ఊరికొచ్చాం. అమ్మానాన్నల ఊళ్ళకి ఈ ఊరు దగ్గర కావడంతో ఓ ఇంటిని కొనుక్కుని బదిలీ చేయించుకుని వచ్చారు నాన్నగారు. ఎలా చూసిందో, ఎక్కడి నుంచి చూసిందో కానీ సిసింద్రీలు కావాలంటూ అడిగిన తన చొరవకు ఆశ్చర్యపోవడం నా వంతయింది.

ఆ అమ్మాయి ఎవరో కాసేపటి తర్వాత అమ్మ పక్కింటావిడతో మాట్లాడుతుంటే తెలిసింది. నాన్నగారికి ఇల్లు వెదికి పెట్టింది ఆ పక్కింటావిడ భర్తే. ఆయన నాన్నగారితో పాటుగా ఆఫీసులో పనిచేస్తారు. వాళ్ళ అమ్మాయే సిసింద్రీల కోసం వచ్చిన ఏడోక్లాసు అమ్మాయి. సాయంత్రం సిసింద్రీలన్నిటినీ జాగ్రత్తగా ఏరి ఒక డబ్బాలో వేసుకుంటోంటే వచ్చిందా అమ్మాయి.

'మతాబులు, చిచ్చుబుడ్లు మనిద్దరం కలిపి చేసుకుందామా?' గుండ్రని కళ్ళను ఆసక్తికరంగా విచ్చుకునేలా చేస్తూ అడిగింది.

'నాకవి ఎలా చెయ్యాలో సరిగ్గా తెలీదు. పైగా మందు పాళ్ళు కూడా సరిగ్గా తెలియవు.' చెప్పాను.

'అవ్వే ఏమీ అక్కర్లేదబ్బాయ్. బీడు కలిపిన మందుపొడిని చెక్కా జానకిరామయ్య కొట్లోనే అమ్ముతాడు. మనం అది తెచ్చుకోవడమే. కాగితాలతో గుల్లలు చుట్టుకుని మందు కూరుకోవడమే. ఇసుక ఎక్కడైనా దొరుకుతుంది కదా! ఇంక చిచ్చుబుడ్లకంటావా, కుమ్మరివీధికెళ్ళి బుడ్లు తెచ్చుకుంటే సరి.' వివరంగా చెప్పింది.

'నిజంగా నీకు చెయ్యడం వచ్చా? లేకపోతే తుస్సుమంటాయి.'

'మా మావయ్య చెప్పాడు నాకు. పోయిన సంవత్సరం తను చేస్తుంటే దగ్గరుండి చూసాగా?! కంపెనీ పెన్సిళ్ళు అగ్గిపుల్ల గీసినట్టుగా వెంటనే కాలిపోతాయి. కంపెనీ చిచ్చుబుడ్లు కూడా అంతే... కన్ను మూసి తెరిచేంతలో వెలుగు చిమ్మేస్తాయి. అదే మనం చేసుకున్నామనుకో నా సామిరంగా, అదిరిపోద్దనుకో!' చిచ్చుబుడ్డి వెలుగుతున్నట్టే ముఖాన్ని చేసుకుని చెప్పింది.

భూచక్రాలు, కాకరపువ్వొత్తులు, వెన్నముద్దలు, తాళ్ళు, సీమటపాసులు కూడా నువ్వే తయారుచేసుకుంటావా?' ఆశ్చర్యం నటిస్తూ అడిగాను.

'అంత వేళాకోళం అక్కర్లేదులే అబ్బాయ్! అవన్నీ చెయ్యాలంటే ఏడాదంతా తయారీ పనిలోనే ఉండిపోయి ఏడోక్లాసులోనే ఉండిపోవాలి. నా మాట విని చిచ్చుబుడ్లకు, మతాబులకు నాతో చేతులు కలుపు. కొన్ని అమ్మామనుకో... మనకు చిచ్చుబుడ్లు, మతాబులు సగం అమ్మేసినా కూడా మనం కాల్చుకోవడానికి బోల్డు మిగుల్తాయి. తయారుచెయ్యడానికి మనం పెట్టిన డబ్బులకంటే ఎక్కువొస్తాయి.'

'ఎల్లుండే కదా దీపావళి మనకు టైం

సరిపోతుందా?' సందేహంగా చూశాను.

'గొప్ప అనుమానపు పక్షిలా ఉన్నావే? అనుకున్న పని అనుకున్నట్లే చేసెయ్యాలి. పద బజారుకెళ్దాం. నీకు సైకిలేదో ఉన్నట్టుంది కదా?'

'నాకు డబుల్స్ తొక్కడం రాదు.' కొంచెం బెరుకుగా చెప్పాను.

'ఎందుకు పనిచేస్తావబ్బాయ్. పద... ఎలా తొక్కాలో నీకు నేను నేర్పిస్తాను కదా!' చెయ్యి పట్టుకుని ముందుకు లాగింది తను.

'అంత కంగారుపడితే ఎలా? నాన్నగారు వచ్చాక డబ్బులడగాలి.' కొంచెం సంశయంగా చెప్పాను.

'నా దగ్గరున్నాయి పదబ్బాయ్! తర్వాత లెక్కలు తేల్చుకుందాంలే!' అంటూ హుటాహుటిన బయలుదేరదీసింది. అనుకున్నట్టుగానే తన డబ్బులే పెట్టుబడిగా పెట్టి సామాన్లన్నీ తెచ్చుకున్నాం. తర్వాతి రోజు సాయంత్రానికల్లా మతాబులు, చిచ్చుబుడ్లు తయారుచేసేశాం. రెండు వంతులు పక్కకు తీసి, మిగతా ఒకవంతునూ వీధిలోకి తీసుకెళ్ళి ఓ అరగంటలో నవ్వుకుంటూ తిరిగొచ్చి చెప్పింది. 'ఇదిగో మన పెట్టుబడి కన్నా యాభైరూపాయల లాభం. ఇంకా ఇవన్నీ మనకి చెరో సగం!'

'నేనేమీ పెట్టుబడి పెట్టలేదు కదా! ఉండు వీటికి డబ్బులు తెచ్చిస్తాను.' సంభ్రమాశ్చర్యాల నుంచి తేరుకోవడానికి కష్టపడుతూ మొహమాటంగా చెప్పాను.

'ఎందుకు పెట్టలేదూ? నాకు సిసింద్రీలిచ్చావా? నీ సైకిల్ మీద నన్నెక్కించుకుని తీసుకెళ్ళావా? ఇవన్నీ తయారుచేసేందుకు సాయం చేసావా? ఇదంతా పెట్టుబడే అబ్బాయ్! ఉండు ఇవెలా వచ్చాయో మనం పరీక్షించకుండానే అమ్మేశాం కూడా!' బిగ్గరగా నవ్వేసి ఇంట్లోకి వెళ్ళి అగ్గిపెట్టె తీసుకొచ్చి ఓ చిచ్చుబుడ్డిని వాకిలి మధ్యలో ఉంచి వెలిగించింది. మూడున్నర నిమిషాలసేపు ఆగకుండా వెలిగిన చిచ్చుబుడ్డిని చూసి తన ముఖం ఆనందంతో వెలిగిపోయింది.

'చూశావా?' అన్నట్టుగా నా వైపు చూసి నవ్వుతూ కళ్ళెగరేసింది.

ఆ ఏడాది దీపావళికి బజారు నుంచి కొన్న మిగతా బాణాసంచా కంటే మేము తయారుచేసుకున్న సిసింద్రీలు, చిచ్చుబుడ్లు, మతాబులే అందరినీ ఆనందింపజేశాయి.

అలా దీపావళితో ప్రారంభమైన మా చెలిమి ఆ తర్వాత రోజూ సాయంత్రాలు కలిసి చదువుకునే వరకూ వెళ్ళింది. తను చదవడం కంటే ఆలోచించి అర్థం చేసుకోవడంలోనే ఎక్కువగా దృష్టి పెట్టేది. నేను తనకు లెక్కలు చెప్పేవాడిని. చదువులో నాకంటే తను రెండేళ్ళు తక్కువైనా అప్పుడప్పుడూ సైన్సులో పాఠాలు నాకర్థం కాకపోతే తను చదివి వివరించేది. నీకెలా తెలుసూ అంటే... 'ఇదంతా నా తెలివే కాదులే. నిన్న రాత్రి నీ సైన్స్ బుక్ తీసుకెళ్ళి మా అక్కనడిగి తెలుసుకున్నాను. మళ్ళీ ఉదయం నీ బ్యాగ్‌లో పుస్తకం పెట్టేశాను.' అంటూ పకపకా నవ్వేసేది. మరో నాలుగేళ్ళ పాటు మా మధ్య స్నేహం, దానితో పాటుగా చొరవ మరింతగా పెరిగాయి. తను నన్ను 'అబ్బాయ్' అని పిలిస్తే నేనేమో 'సిసింద్రీ' అని పిలిచేవాడిని. గలగలా మాట్లాడుతూ దూసుకుపోయే మనస్తత్వంతో ఉండే తనను నాతో పాటుగా కొద్దికాలానికే మా ఇంట్లో కూడా అలానే పిలవడం ప్రారంభించారు.

మా ఊళ్ళో జూనియర్ కాలేజీ మాత్రమే ఉండటంతో నేను డిగ్రీ చదువుకోవడానికి దగ్గర్లోని టౌన్లోకి వెళ్ళాల్సి వచ్చింది. రోజూ వచ్చి వెళితే ప్రయాణానికే సమయం సరిపోతుందని అక్కడే హాస్టల్లో ఉండాలని నిర్ణయం తీసుకున్నారు నాన్న. ఒకవిధంగా నేను డిగ్రీలో చేరడం మా ఇద్దరి హృదయాల్లోనూ స్నేహం పెరిగి అది ప్రేమగా పుంజుకుంటోన్న వేగానికి మొట్టమొదటి నిరోధకం అయింది. కల్మషం లేని చెలిమితో నిండిన మా మనసులలో కలకలం ఎప్పుడు మొదలైందో మాకే తెలియలేదు.

నేను వెళ్ళేరోజున దిగాలుగా ఉన్న నా మొహాన్ని చూసి అంది. 'అలా దిగాలుగా ఉంటారా ఎవరైనా? వెళ్ళి ఆ డిగ్రీ ఏదో చేశాకే నీ మొహం నాకు చూపించు.' అంది. ఆరిందాలా తను చెప్పే మాటలు ఎప్పటిలానే నన్ను నవ్వించాయి. మొదటి రెండునెలలూ హాస్టల్లో కష్టంగానే గడిచాయి. నెమ్మదిగా ఆ జీవితానికి అలవాటు పడుతూ చదువు మీద దృష్టి పెట్టాను. నా బెంగ తీరుతుందని నాన్నగారు ఫోన్ కొనివ్వడం మహదానందాన్నిచ్చింది. అమ్మానాన్నలతో కంటే సిసింద్రీతోనే ఎక్కువగా మాట్లాడేవాడిని. మొదట సందేశాలా కాల్స్‌తోనూ క్రమేపీ వాట్సాప్‌లతోనూ మా మధ్య సంభాషణలు రోజంతా నడిచేవి.

ఫస్టియర్ పరీక్షలు రాస్తూనే ఊరికి తిరిగి వెళ్ళాను. మా మధ్య అంకురించిన ప్రేమను ఇంట్లో గమనించారో లేదో తెలియదు కానీ, మేమిద్దరమూ మాత్రం చనువుగానే మాట్లాడుకునేవాళ్ళం. అలా రెండునెలలు గాలిలో తేలినట్టుగా గడచిపోవడం, అక్కడుండగానే మొదటి సంవత్సరం రిజల్ట్స్ కూడా రావడం జరిగిపోయాయి. రెండునెలలు గడిపిన ఆనందం పూర్తిగా తీరకుండానే టౌన్లోకి బయల్దేరాను.

కానీ, ఊరినుంచి తిరిగొచ్చాక సిసింద్రీయే లోకంగా బతుకుతున్న నాకు ఎప్పుడూ అనుకోని విధంగా ఆశాభంగమే ఎదురైంది. సిసింద్రీ నుంచి ఫోన్ రావడం తగ్గిపోయింది. నేను ఫోన్ చేసినా ముక్తసరిగానే మాట్లాడేది. రెండు మూడుసార్లు తనకు ఫోన్ చేసి ఎందుకలా ఉంటున్నావని అడిగాను. కానీ, అంతా నీ భ్రమ మాత్రమే అని ఫోన్ పెట్టేసేది.

బాధ మనసులో సూక్ష్మరంధ్రంలా మొదలై చివరకు పెద్ద పెద్ద తూట్లుగా మారిపోయింది. ఆ వేదనను తట్టుకోలేక అమ్మకు ఫోన్ చేసి అడిగాను.

'ఏం చెప్పమంటావురా? సిసింద్రీ ఎప్పటిలా లేదు. తను ఇక్కడ ఇంటర్మీడియట్లో చేరాక స్నేహాలు బాగా పెరిగాయి. అబ్బాయిలతో కూడా తిరుగుతోంది. అదంటే నీకెంత ఇష్టమో మాకు తెలుసు కదా. అందుకని ఊరికే దాని కోసం ఆపసోపాలు పడిపోకు. నెమ్మదిగా తనను మరచిపోవడానికి ప్రయత్నించు.' అంది అమ్మ. నెత్తిన వేలాది పిడుగులు పడినట్టుగా తోచాయి అమ్మ మాటలు.

ఆ తర్వాత దాదాపు నెలరోజులు నిద్రాహారాలకు దూరమయ్యాను. ఒకరోజు అమ్మానాన్నా నన్ను చూడటానికి వచ్చి చాలా కంగారు పడిపోయారు. వాళ్ళను హత్తుకుని ఏడ్చిన నన్ను ఓదార్చి వెళ్ళినట్లే వెళ్ళి వారం రోజులకే తిరిగి వచ్చారు. హాస్టల్ ఖాళీ చేయించారు. బయట చిన్న పోర్షన్ తీసుకుని అమ్మ నా దగ్గర ఉండేలా ఏర్పాటు చేసి నాన్న తిరిగి వెళ్ళిపోయారు.

అమ్మ నా బెంగ తీరేలా నన్ను ఊరడించేది. సిసింద్రీపై పగ సాధించాలంటే చదువు తప్ప నీకు మరో మార్గం లేదంటూ నాలో పంతాన్ని పెంచేది. వారానికో, పదిహేను రోజులకో నాన్న మా దగ్గరకు వచ్చేవారు. అమ్మ తిరిగి ఇచ్చిన మనోబలంతో నాకు డిగ్రీలో ఆ తర్వాత మంచి మార్కులే వచ్చాయి. ఆ తర్వాత పోటీపరీక్షలు రాశాక గ్రూప్ వన్ పరీక్షలో మంచి ర్యాంక్ రావడం, రాష్ట్రప్రభుత్వంలో ఉన్నతోద్యోగం వచ్చి నేను విజయవాడకు వెళ్ళడం, అమ్మ తిరిగి ఊరికి వెళ్ళిపోవడం వేగంగా జరిగిపోయాయి. కాలచక్రం మరో రెండేళ్ళు ముందుకు దూసుకుపోయింది.

ఒకరోజు అమ్మానాన్నా ఫోన్ చేసి సుమ పెళ్ళికి రమ్మని చెప్పారు. సుమ వాళ్ళ అమ్మానాన్నా కూడా తప్పకుండా రావాలని మరీ మరీ చెప్పడంతో అయిష్టమైనా ఊరికి బయలుదేరక తప్పింది కాదు. ఎందుకంటే సుమ అంటే సిసింద్రీ వాళ్ళక్కే!

అక్కడికెళితే సిసింద్రీ ముఖాన్ని చూడాలి! పాత జ్ఞాపకాల సుడిగుండంలో మునిగి తిరిగి ఉక్కిరిబిక్కిరైపోవాలి! సొంత ఊరికి దగ్గరేనని చెప్పి నాన్న ఇంకా ఆ ఊళ్ళోనే ఎందుకు ఉద్యోగం చేస్తూ ఉండిపోవాలి? అసలు సిసింద్రీ ప్రవర్తనలో మార్పు రాగానే తన తల్లిదండ్రులతో కూడా స్నేహబంధాన్ని తెంపుకుని నా దగ్గరకే వచ్చేసి ఉంటే ఇవాళ నాకీ దుస్థితి వచ్చేది కాదు కదా! బస్‌లో అందరూ ప్రశాంతంగా పడుకున్నా కూడా నాకు మాత్రం ఆ రాత్రి నిద్రే పట్టలేదు. మొత్తానికి ఎలాగో ఇల్లు చేరుకున్నాను. మా ఇంటిని విడిదిల్లుగా మార్చినట్టున్నారు... ఇల్లంతా సందడిగా ఉంది. గబగబా ముఖం కడుక్కుని స్నానం చేశాను. అమ్మ ఇచ్చిన కాఫీ తాగి బయటకు నడవబోయాను.

'ఎక్కడికిరా బయల్దేరావు? టిఫిన్ చేసి వెళు దువుగాని కాసేపాగు.' అమ్మ చెప్పింది.

'చాలారోజులయింది కదమ్మా. అలా ఊళ్ళోకి వెళ్ళి వస్తాను.' అని చెప్పి యావజ్జీవశిక్షకు ముందుగానే విడుదల చేసిన ఖైదీలా వడివడిగా బయటకు నడిచాను.

- రాజేష్ యాళ్ళ
9700467675

ఊరినిండా నాకున్నవి సిసింద్రీ జ్ఞాపకాలే! ఏ దారిన నడిచినా వాటి మీద నుంచే నడిచినట్టుగా, ఆ దారెంత నున్నగా ఉన్నా కూడా ముళ్ళపై నడిచినట్టుగా అనిపించింది. నా అసహనాన్ని అణచుకుంటూ అసంకల్పితంగా నా అడుగులు తీసుకెళ్ళిన వైపు కలలో నడచి వెళ్ళినట్టుగా వెళ్ళాను. అకస్మాత్తుగా లోకంలోకి వచ్చి చూస్తే రామాలయంలో ఉన్నాను. దగ్గరికి వెళ్ళడానికి మనస్కరించలేదు. గుడి ప్రాంగణంలో ఉన్న రావిచెట్టు కింద అరుగు మీద కూర్చున్నాను. ఆలోచనల చితిలో మనసు కాలుతున్న వాసన నాకే తెలుస్తోంది.

'గుళ్ళోకొచ్చి దేవుడికి దణ్ణం పెట్టకపోవడం మర్యాదేనా అబ్బాయ్?!'

చిరపరిచితమైన స్వరం వేణుగానంలా వినపడింది. అంతలోనే ఆ స్వరం ఇప్పుడు ఆత్మీయమైనది కాదని గుర్తుకు రావడంతో మరోవైపుకు ముఖం తిప్పుకున్నాను.

'ముఖం తిప్పుకుంటే నేను చుట్టు తిరిగి రాలేనేనా?' మళ్ళీ చిలిపిగా అడిగింది.

ఒక్కసారిగా నాలో ఆగ్రహాగ్ని చెలరేగుతుండగా తన వైపు చూశాను. తను మాత్రం పాలవెన్నెల్లా నవ్వుతూ కనపడింది. నాలో అప్పటివరకూ ఉన్న కోపం కాస్తా చటుక్కున మాయమైపోయింది. ఎలా వచ్చాయో తెలీదు... కన్నుల్లో గిర్రుమంటూ నీళ్ళు!!

'ఎందుకిలా చేసావ్?!' నా గొంతులో బొంగురు నాకే కొత్తగా ఉంది.

'ఎలా చేశాను?' తన నవ్వులో కవ్వింపు.

'నీకు తెలీదా?' తన ముఖం చూస్తోంటే నాలో కోపం పెరగడం లేదు.

'అంతా నువ్వే చేశావ్!' మళ్ళీ నవ్వు.

'నేనా?!'

'అవునబ్బాయ్. నువ్వే! నీ ఫస్టియర్ పరీక్షలు అవగానే మనం ఇక్కడే కలిశాం. మిట్టమధ్యాహ్నం వరకూ ఇక్కడే కబుర్లు చెప్పుకుంటూ ఉండిపోయాం. పూజారి గారు కూడా వెళ్ళిపోయారు. అప్పుడు నువ్వేం చేశావ్?' తన ప్రశ్న నన్ను గతంలోకి వెళ్ళేలా చేసింది.

అవును! పూజారి కూడా వెళ్ళిపోయాక ఆ ప్రాంగణమంతా నిర్మానుష్యమైంది. తనను నాకు దగ్గరగా లాక్కున్నాను. ఊపిరాడనంత గట్టిగా కౌగిలించుకున్నాను. గుండ్రని తన పెద్ద పెద్ద కన్నుల్లో ఓ క్షణం భయం కనిపించినా లెక్క చెయ్యలేదు. బుగ్గపై ముద్దుల వర్షం కురిపించాను. హద్దులు దాటిన నా పెదవులు తన పెదవులను అందుకోవడానికి పరుగులు తీశాయి.

అంతే! ఒక్కసారిగా సిసింద్రీ నన్ను వెనక్కు తోసి పరుగు పెట్టింది. తన వెనుకే పరుగు పెడుతూ నేను పిలుస్తున్నా వినకుండా తన ఇంట్లోకి వెళ్ళిపోయింది.

'టౌన్లోకి వెళ్ళాక కొద్దిరోజులు బుద్ధిగానే ఉన్నావబ్బాయ్. ఆ తర్వాత నీలో వయసు తెచ్చిన మార్పు స్పష్టంగా కనపడింది. నాకూ నీకు దగ్గరగా ఉండాలనీ, నీతో తనివితీరా హాయిగా గడపాలనీ ఎంతో ఉండేది. మనం చనువుగా ఉన్నామన్న సంగతి మన అమ్మానాన్నలకు తెలిసీ ఊరుకున్నారంటే మనిద్దరమూ జీవితాన్ని పంచుకోవడం వాళ్ళకు ఇష్టమని మనకూ అప్పటికే అర్థమైంది. అందుకే ధైర్యం పెరిగిపోయింది. కానీ చదువుకునే వయసులోనే అలా ఒకరికొకరం అన్నట్టుగానే ఉండిపోతే మన లక్ష్యాలు పక్కదారి పట్టిపోవూ? అప్పటికే నువ్వు డిగ్రీ ఫస్టియర్ని అత్తెసరు పెట్టేశావ్. నేనేమో అప్పుడే ఇంటర్ బైపీసీలో చేరాను. అలా ఆరోజు నువ్వు అతిచనువు చూపడంతో ముందు మనకీ, మన కెరీర్ ముఖ్యమని నాకు తెలిసొచ్చింది. అందుకే అత్తతో నీకు నేనలా చెప్పించాను. నీకు నా మీద కోపం వస్తేనే కానీ, చదువు మీద దృష్టి పెట్టవని నాకు తెలుసు. నీ కోపాన్ని పోగొట్టే అర్హత రావాలంటే నేనూ నా కెరీర్ మీద మనసు లగ్నం చెయ్యాలి కదా! కష్టమని తెలుసు. అయినా, గుండెను రాయి చేసి ఎలానో చదివానబ్బాయ్! ఇంకొక్క ఏడాది కళ్ళు మూసుకుంటే చాలు నా హౌస్ సర్జన్సీ కూడా పూర్తయిపోతుంది. ఈ సిసింద్రీ పూర్తిగా నీదైపోతుంది!'

చొరవగా నా మెడ చుట్టూ చేతులు వేసి చెప్పింది సిసింద్రీ. తన మాటలు మొదట దిగ్భ్రాంతిని, తరువాత సంభ్రమాన్ని, అటుపై ఆనందాన్ని కలిగించగా నా చేతులతో తనను దగ్గరకు లాక్కున్నాను. చాలాసేపటికి కానీ, మా కౌగిలి వీడింది కాదు. నెమ్మదిగా అది చట్టపట్టాలుగా మారింది. గుడి బయటకు వచ్చి వీధిలో నడుస్తోంటే అక్కడ పిల్లలు సిసింద్రీలను వెలిగించి అవి ఆకాశంలోకి దూసుకుపోతోంటే ఆనందంగా చూస్తున్నారు.

'చెక్కా జానకిరామయ్య కొట్టుకి వెళదామా?' నవ్వుతూ అడిగాను.

చిరునవ్వులను జువ్వలా విరజిమ్మింది నా సిసింద్రీ!

దారితప్పిన పిల్లవాడు

- పి. చంద్రశేఖర్ ఆజాద్
9246573575

నాలుగు రోజుల నుంచి నేనూ, శైలజా వాడితో మాట్లాడుతున్నాం. నువ్వు సుధతో మాట్లాడి ఎన్ని రోజులైంది?" అన్నాడు. అతను మధు ముఖంలోకి చూశాడు.

"అవున్నా... నీ షాపు గురించి మాట్లాడటం కాదు. హృదయం విప్పి నువ్వు పిల్లల్తో మాట్లాడుతున్నావా? నువ్వు నీ పిల్లలకి ఎంత డబ్బు ఇస్తున్నావు అనేది ముఖ్యం కాదు, ఎంత సమయం ఇస్తున్నావు అనేది ముఖ్యం"

బాబూరావు మాట్లాడకుండా సముద్రాన్ని చూస్తున్నాడు.

"కనీసం తాతో, నాయనమ్మో ఇంట్లో వుంటే వేరు, వాళ్లు పిల్లల్తో మాట్లాడుతుంటారు. కథలు చెబుతుంటారు. ఏది మంచో, ఏది చెడో చెబుతారు. మీ ఇంట్లో అదీ లేదు"

"నేను రమ్మంటాను మధూ. వాళ్లు రారు. వచ్చినా రెండు రోజులూ ఉండరు" అన్నాడు బాబూరావు.

"అదే ఎందుకు? వాళ్లు మనవళ్ల మీద, మనవరాలి మీద ప్రేమని చంపుకున్నారా?"

బాబూరావు ఏం మాట్లాడలేదు.

"నువ్వు రెండు పడవల మీద కాళ్లు వేస్తున్నావు బాబూ... ఓ పక్కన రొయ్యల చెరువులు, ఇంకో పక్కన షాపు"

"ఇప్పుడు కాకపోతే ఎప్పుడు సంపాదించమంటావు. రజని పెద్దదవుతోంది. చదివించాలి, పెళ్ళి చేయాలి. ఈలోగా మగపిల్లలు వస్తారు" అన్నాడు బాబు

"నేను కాదనటం లేదు. మీ ఇంట్లో పరిస్థితులు బాగుండలేదు" అంటూ సుధ చెప్పిన విషయాలు మెల్లగా చెప్పాడు.

అవన్నీ వింటుంటే అతని ముఖం ఎర్రబడింది.

"మిమ్మల్ని విమర్శించటం కాదు. పిల్లలకి చిన్న చిన్న కోరికలు ఉంటాయి. అవి తెలుసుకోవాలి. పత్రికలు చదవకూడదు, టీ.వీ. చూడకూడదు అంటే కుదరదు. మనం ఏది కాదంటామో, వద్దంటామో పిల్లలు అదే చేస్తారు. రాకుమారుడ్ని ఉత్తరం దిక్కుకి వెళ్లవద్దు అంటే ఆ దిక్కుకే వెళ్తాడు"

ఎందుకో బాబూరావుకి నవ్వు వచ్చింది.

"అసలు నువ్వు సుధాని షాపుకి పంపటం తప్పు. చదువు మీద ఆసక్తి తగ్గటానికి అది మొదటి కారణం".

"నన్నేం చేయమంటావు మధూ... నాకూ తప్పటం లేదు"

"ఇప్పుడు నాలుగు రోజుల నుంచి ఏం చేశావు. అన్ని పనులు ఆగిపోయాయి? షాపులో కూర్చుంటాడు. ఎదురుగా డబ్బు కనిపిస్తుంటుంది
వచ్చేవారు వేరు. ఇవన్నీ పిల్లల అ
తీసుకువస్తాయి"

చిన్నగా తలూపాడు.

"అందరు పిల్లలూ ఒకేసారి
ముఖ్యంగా ఇంట్లో అసంతృప్తులు
ప్రభావం చూపిస్తాయి. అందుకని
పద్ధతులు మార్చుకుంటే బాగుంటు
అన్నాడు.

"సుధాని వచ్చే సంవత్సరం
హాస్టల్లో వుంటాడు" అన్నాడు బా

"ఇంకో మాట, ఎప్పుడూ ఉన
ఎవరికైనా బతుకు నిస్సారంగా ఉ
ఓసారైనా పది రోజులు మీ అంద
వెళ్లండి"

"నేను అన్నీ ఆలోచిస్తున్నాను.
మధూ... వాడు నీకు కనిపించాడ
ఏం జరిగి ఉండేదో తలుచుకోవట
బాబూరావు.

"ఇంకో మాట, సుధని ఎవరు
తప్పుని పదే పదే గుర్తు చేయవ
వస్తుంది"

"నేను గౌరితో మాట్లాడతా

సుధ నాన్నతో ఇంటికి బం
బాధగా ఉంది.

శైలజ వాడికి కొన్ని పుస్తకా
ఇంటికి రావచ్చు. 'ఇంట్లో చెప్ప

బాబూరావు మధుకి డబ్బు

"ఎందుకురా?" అన్నాడు.

"సుధకి బట్టలవీ తీసుకున
కాదనకు"

"వాడు నా మేనల్లుడు లాం
రమ్మంటున్నా చెన్నై రాలేదు. సు
కలుసుకున్నాం. మీరందరూ రం
వ్యాపారం చేయవద్దు" అన్నాడు.
ఎక్కించాడు.

సుధ మధుని కౌగలించుకు
కళ్లు చెమర్చాయి. రైలు ముందు
కనిపించేంత వరకు చేతులు ఊ

తర్వాత నాన్నకి డబ్బులు తీ

"ఇవేంటి?" అన్నాడు బాబూ

"మన షాపు నుంచి తీసుకు
అయింది" అన్నాడు రైలు ముంద

బాబూరావు, సుధ ఇంటికి
తమ్ముడు మూర్తిని, అక్క రజని
చూడగానే ఇద్దరూ దగ్గరకు వచ

మూర్తి సుధ బ్యాగ్ అందుక
చెయ్యి వేసింది. బాబూరావు మ

సుధ లోపలకి వెళ్లగానే...

"మా అందర్నీ వద్దనుకుని
మళ్లీ ఎందుకు వచ్చావు" అంది

"నువ్వు నోరు మూస్తావా?"



. బడికి వచ్చే పిల్లలు వేరు. షాపుకి
లోచనల్లో మార్పులు

రెండు పనులూ చేయలేరు.
వుంటే, అవన్నీ వారి మీద
ఇలానే చేయమని నీకు చెప్పను,
ుంది. అంతవరకు చెప్పగలను"

నుంచి మంచి బడిలో చేరుస్తాను.
ూరావు.
్న చోట నుండి కదలకపోతే
ంటుంది. కనీసం సంవత్సరానికి
రూ కలసి విహార యాత్రకు

నా పద్ధతులు మార్చుకుంటాను
కాబట్టి సరిపోయింది. లేకపోతే
ానికే భయంగా ఉంది" అన్నాడు

ా వెక్కిరించవద్దు. వాడు చేసిన
. అందువల్ల వాడిలో మొండితనం

" అన్నాడు బాబూరావు

• • •

ుదేరే సమయం వచ్చింది. వాడికి

ఇచ్చింది. ఎప్పుడన్నా నువ్వు మా
డా కాదు' అంది.
ఇవ్వబోయాడు.

ు, చాలా ఖర్చులు అయ్యాయి.

ివాడు. ఇన్ని రోజుల నుంచి నిన్ను
మూలంగా మనం
డి. డబ్బులు ఇచ్చి మన స్నేహాన్ని
స్టేషన్ దాకా వచ్చి రైలు

ఏడ్చాడు. బాబూరావుకి కూడా
కదిలింది. సుధ మధు
ుతున్నాడు.
సి ఇచ్చాడు.
రావు.
న్న డబ్బులు. కొంత ఖర్చు
ుకు ప్రయాణం చేస్తోంది.
చేరుకున్నారు. ఇంటిముందు
ఎదురు చూస్తున్నారు. సుధని
్చారు.
న్నాడు. రజని సుధ భుజం మీద
ట్లాడకుండా ఇంట్లోకి వెళ్లాడు.

ఇంటి నుండి వెళ్లిపోయావు కదా...
ారి కోపంగా.
అన్నాడు బాబూరావు.

"వాడు మాయించాడు. నాలుగు రోజులుగా ఏం తిన్నానో, తినలేదో నాకు తెలుసు, ఏడుస్తూనే వున్నాను, వాడికి అమ్మ అవసరం లేదండి. నన్ను ఏడిపించటానికి వాడు పుట్టాడు" అంటూ ఏడవటం మొదలు పెట్టింది.

అమ్మను అలా చూసేసరికి సుధకి కూడా ఏడుపు వచ్చింది. అమాంతం వెళ్లి అమ్మను వాటేసుకున్నాడు.

"వద్దురా వద్దు – నీకు నేను అమ్మని కాదు" అంటూనే సుధని హత్తుకుంది– అప్రయత్నంగానే.

చూస్తున్న అక్కా, తమ్ముడు ఏడుస్తున్నారు.

సుధ తన బ్యాగ్ తెరిచి అందులో ఉన్న బట్టల్ని చూపిస్తున్నాడు. ఇంతకు ముందు తమ్ముడు మూర్తిగాని, రజనిగానీ అలాంటి కొత్త రకాలను చూడలేదు. మధు – శైలజలు రజనికి కూడా ఓ డ్రెస్ పంపించారు. అలాగే మూర్తికి.



ఇంకా స్వీట్ బాక్స్ తెరిచారు. అవన్నీ కొత్తగా ఉన్నాయి. అన్నీ ఖరీదయినవే. 'ఇన్ని డబ్బులు నీకు ఎక్కడివి సుధా' అని అడిగింది రజని.

"ఇవన్నీ మధు అంకుల్ కొన్నారు. డబ్బులు వద్దు అన్నారు" అని చెప్పాడు.

మరుసటి రోజు బడికి వెళ్లాడు.

"ఇన్ని రోజులు బడికి రాకపోతే నువ్వు చదువు మానేశావు అనుకున్నాను" అంది టీచర్.

"మీరు చెప్పారు కదా! అందుకని నేను ఊరు వెళ్లాను"

"ఏ ఊరు?"

"మద్రాస్. అక్కడ మెరీనా బీచ్ చూశాను, ఇంకా చాలా చూశాను. టీచర్" అని చెబుతుంటే ఆశ్చర్యంగా వింది.

"ఇవన్నీ సెలవుల్లో చేయమన్నాను, బడి మానేసి కాదు" అంది

"నిజమే టీచర్. నాకు వెళ్లాలనిపించింది. వెళ్లాను" అన్నాడు. మొదటిసారి బాలూతో గర్వంగా మాట్లాడాడు. తను మద్రాస్‌లో దిగిన దగ్గర్నుండి తన అనుభవాలన్నీ చెప్పాడు. అంతా అయిపోయాక–

"నువ్వు ఇంటి నుంచి పారిపోయావు కదూ" అన్నాడు బాలు. అప్పటిదాకా ఉన్న ఉత్సాహం సుధలో నీరు కారిపోయింది.

"నువ్వు మీ షాపులో దొంగతనంగా డబ్బులు తీసుకున్నావు"

"అవి మా డబ్బులే" బింకంగా అన్నాడు సుధ

"ఎవరి డబ్బులు అయినా చెప్పకుండా తీస్తే దొంగతనం అవుతుంది సుధా..." అన్నాడు బాలూ.

"నువ్వు మద్రాస్ చూడలేదు. అందుకని నీకు నా మీద అసూయగా ఉంది" అన్నాడు సుధ

"నాకు అసూయా! నీ మీదా!" అని నవ్వు...

"నిన్ను చూస్తుంటే నాకు జాలి సుధా" అన్నాడు బాలు

"ఎందుకు?"

"నేను నీకంటే ఎన్నో ఊర్లు తిరిగాను. మా నాన్నకి మూడు సంవత్సరాలకు ఇంకో ఊరు బదిలీ అవుతుంది. నువ్వు అలా కాదు. భీమవరంలోనే వుండాలి. తర్వాత, నేను ఏం చూసినా మా అమ్మానాన్నలతో చూస్తాను. నా అక్కతో చూస్తాను. నాకు ఇల్లు వదిలి పెట్టి వెళ్లేవారంటే ఇష్టం ఉండదు"

సుధ మాట్లాడలేదు.

"అలాంటి వారిని క్రమశిక్షణ లేని పిల్లలు అంటారు. నీకు ఇంకోటి తెలుసా?"

"ఏంటది బాలూ..."

"మనం ఈ ప్రపంచమంతా చూడలేం, అయినా పుస్తకాలు చదివితే ప్రపంచమంతా మనకు కనిపిస్తుంది. ఇంకెప్పుడూ ఇలాంటి పిచ్చి పనులు చేయకు" అన్నాడు.

సుధకు బాలూ ఇలా మాట్లాడుతుంటే తప్పు చేశానా అనిపించింది.

- సమ్మెట ఉమాదేవి
9849406722

తెల్లారినట్టు తెలుస్తున్నా ఎప్పుడో మెలకువ వచ్చినా.. రెప్పలు మూసుకునే ఉన్నాడు విరాట్. అక్కడ అందమైన కలనొకటి భద్రపరుచుకుంటున్నాడు. అతణ్ణి వివశుణ్ణి చేస్తూ ఆమె పురివిప్పిన మయూరిలా ఆడుతోంది. రెప్పలు అల్లార్చి చూస్తున్న ఆమె నయనాలు కూడా మయూరాల్లాగే ఉన్నాయి. రాగానికి తగ్గట్టుగా వడివడి అడుగుల ఆమె నాట్యం, ఆమె కంఠం, ఆమె కదలికలు, ఆ కులుకులూ అన్నీ పికముల చలనములే..! కనులు తెరిస్తే అదే వేగపు కులుకులతో వెళ్లిపోతుందేమో అని భయం.. విరాట్ భ్రమ కానీ కనులు తెరిచి కూడా పదిమందిలో కూడా ఆమెనే దర్శిస్తున్నాడు.

'ఒరే నీ వెర్రిగానీ.. ఇవ్వాళ రేపు అందరూ అమ్మాయిలు ఇలా చురుకుగానే ఉంటున్నారు.. ఆడుతున్నారు పాడుతున్నారు. ఏదో దివి నుంచి నీకోసమే ఓ కిన్నెర దిగి వచ్చినట్లు ఏమిటా పలవరింతలు? అయినా కాలేజీలో అంతమంది అదే నృత్యం చేశారు. ఇంచుమించు అందరూ అంతే అందంగా ఉన్నారు. ఆ అమ్మాయి మాత్రమే నీకు ప్రత్యేకంగా నచ్చడం కాస్త ఆశ్చర్యమే..' అన్నాడో మిత్రుడు.

'ఒరే వెర్రివాడా..! కొందరు కొందరికి ప్రత్యేకంగా కనపడతారు. వీడికి ఆ అమ్మాయికి రాసి పెట్టి ఉంటే మళ్లీ ఎక్కడో ఎప్పుడో కనపడుతుందిలే..' వేదాంతిలా మరో మిత్రుడు అనగానే- అందరూ నవ్వులు చిందించారు.

• • •

'హలో మా ..'

'ఏంటి నాన్నా హైదరాబాద్‌కి రావడం లేదా?'

'లేదమ్మా.. నేనూ శ్యామ్ పాల్వంచకు బయల్దేరాం. వాళ్ళింట్లో చదువుకుంటాం.'

'ఓకే జాగ్రత్త నాన్నా.. నీకో సంగతి చెప్పాలి. పప్పా మన కోసం జర్మన్ షెపార్డ్ తెచ్చారు.'

'అబ్బా... నీకెప్పుడూ ఆ డాగ్స్ గోలే మా.. నా కోసం నెమలి తెచ్చినప్పుడు చెప్పు..'

'నెమలిని మన ఇళ్ళల్లో పెంచడం కష్టం అంటే వినవు. నీకింకా ఆ నెమలి పిచ్చి వదల్లేదురా.'

'వదలదమ్మా.. వన్ ఫైన్ డే నేనే తెచ్చేస్తాను..'

• • •

పాల్వంచకు వస్తే పగలంతా శ్యామ్ వాళ్ళింట్లో చదువుకోవడం.. మూడింటికల్లా బండిమీద మరో నలుగురైదుగురు మిత్రులతో కలిసి కిన్నెరసానికి వెళ్లి అటూ ఇటూ తిరుగుతూ ఫొటోలు తీసుకోవడం.. తిరిగి వచ్చేటప్పుడు మంగ్యా నాయక్ దాబాకు చేరుకోవడం అలవాటైపోయింది విరాట్‌కి, అతని మిత్ర బృందానికి. ఇప్పుడూ అంతే! మంగ్యా దాబాలో కూర్చుని వాళ్ళ కబుర్లతో హోరెత్తిస్తూ ఆ సాయంత్రాన్ని ఆనందిస్తున్నారు.

'ఏరా రఘూ.. నీకు మీ మేనమామ కూతురితో పెళ్ళట కదా..'

'మేనమామలు ఉండాలి కానీ, వారికి ఆడపిల్లలు ఉండకూడదురా. మొదటినుంచీ తెలిసినవాళ్ళు చుట్టాలుగా ఓకే. పెళ్లాలుగా, మొగుళ్లుగా మాత్రం పనికిరారురా.' విరక్తిగా అన్నాడు రఘు.

'ఒరే రఘూ.. బహువచనం ఉండకూడని పదాలకు బహువచనం పెడితే ఎలా రా బాబు..? పెళ్ళాలు, మొగుళ్ళూ కాదురా.. పెళ్లాము, మొగుడు మాత్రమే! అని నొక్కి వక్కాణిస్తున్నాను..' నవ్వులు విరబూశాయక్కడ. మిగతా వాళ్లంతా ఇలా కబుర్లలో ఉంటే విరాట్ ఎప్పటిలా...

'మంగ్యా.. మనం మళ్ళీ అడవిలోకి ఎప్పుడు వెల్దాం..? నాకు నెమళ్ల ఎప్పుడు చూపిస్తావు..' అని అడగసాగాడు. విరాట్‌కి ఎన్నోసార్లు అలా మంగ్యాతో అడవిలోకి వెళ్లి రకరకాల చెట్లను పక్షులను, సాయంత్రం ఏటి నీడలో సూర్యున్ని.. మసక వెన్నెల్లో కొమ్మల సందుల్లో నుంచి చందమామను చూడటం అలవాటు.

ఉడుకుతున్న కోడికూరలో మసాలా పొడి చల్లుతూ.. 'వెల్దాం దొరా.. మా ఆడది కడుపుతో ఉంది. ఎప్పుడు ఏ అవసరం వస్తదో అని ఎటూ బోతల్లేను. నాలుగు రోజుల్నుండీ సుస్తుగున్నది. పదిరోజులు సెలవు బెట్టిపిచ్చి చెల్లెను గూడా దెచ్చుకున్నా..' అన్నాడు.

'అన్నా పిండి కలిపేసినా.. నీ కూర అయ్యిందా? ఇగ రొట్టెలు చేసేయ్యనా..' సన్నని స్వరమేదో అడిగింది..

'అయిపోయింది దశ్మీ.. జల్దీ జల్దీ చెయ్యి. ఆరుగురు సార్లు వచ్చి కూసున్నరు పాపం' కూరలో కొత్తిమీర చల్లుతూ అన్నాడు. 'చేస్తున్న అన్నా.. నువ్వు వాళ్ళకు ఇస్తానే పో, నే జేసేస్తానే ఉంటా..'

ఆ స్వరం వింటూంటే విరాట్ గుండెల్లో తెలియని అలజడి. ఆమె వేగంగా రొట్టె చేసి పెంకు మీద వేయడం, ఆ తరువాత పెంకు మీద నుంచి తీసి నిప్పుల మీద వేయగానే అది పొంగడం... ఆ పుల్కా తీసుకెళ్ళి మంగ్యా తమ మిత్ర బృందానికి ఇవ్వడం ఆబ్బురంగా చూస్తున్నాడు విరాట్. 'ఏమి మహిమ ఉంది ఆ వేళ్ళకు' అనుకుంటూ ఆమె ముఖం వంక చూసి, ఉలిక్కి పడ్డాడు. 'శ్యామ్! నా మయూరి.. పదాలతో కాదు, వేళ్ళతో నాట్యం చేస్తున్నది.' సంభ్రమంగా అరిచాడు.



పొయ్యి వెలుగులో వింతగా మెరిసిపోతున్న అందరూ ఆమెను అంత సంభ్రమంగానూ చూశారు. ఆమె మెడను చుట్టుకున్న పొడవాటి జడ, ఆమె గడ్డం మీద చిన్నపాటి పచ్చబొట్టు, నుదుటిపై చిరు చెమటలు. ఆ మోముపై నదిపాయలా జారిన ముంగురులు. మిన్ను మరిచిన ఏ దేవకాంతో అక్కడ నిలిచినట్లు అందరూ తినడం ఆపి మరీ.. ఆమెను చూడసాగారు. తమ మిత్రుని పలవరింతల కాంత అందానికి కన్నులతోనే ప్రణమిల్లారు. ఆమె ఇదేమీ పట్టించుకోకుండా వేగంగా పుల్కాలు చేసి అందిస్తోంది. మాటలాపేసి తన చెల్లెను చూస్తున్న వారి చూపులకు మంగ్యా కలవరపడ్డాడు. మంగ్యాతో రెండేళ్ళ పరిచయం ఆ మిత్ర బృందానికి. ఇన్నాళ్లు అతనికి ఇంత అందమైన చెల్లెలు ఉందని తెలియదు.

'ఇంకొంచెం కూర తేనా దొరా..! దశ్మీ మా చెల్లె. సిటీల డిగ్రీ సదువుతున్నది.' వివరించాడు.

'అబ్బో ఈ దశమినాటి జాబిలి పేరు 'దశ్మీ' నా.. ఆ డిగ్రీ కాలేజీ వేదిక మీద మబ్బులేవో కమ్మినట్లు కదిలి ఆడిన మయూరం ఈమేనా..?' అనుకున్నాడు విరాట్. తనను ఆ కార్యక్రమానికి తీసుకెళ్ళిన మిత్రులకు మనసులోనే ధన్యవాదాలు చెప్పుకున్నాడు.

'దొరా.. మంచి నీళ్ళు కావాల్నా..' మధుపాత్రతో వచ్చిన దేవకన్యలా అడిగింది.

మౌనంగా నీళ్ళు అందుకుని తాగేశాడు.

'నేను కాలేజీల డ్యాన్స్ చేశానని మా అన్నకు చెప్పకుండ్రి ప్లీజ్.. నా మీద కోపం జేస్తాడు..' రహస్యంగా వాళ్ళకు చెప్పి వడివడిగా వెళ్లిపోయింది.

చిన్నగా నవ్వుకున్నారు అందరూ.

బిల్లు చెల్లించి వెళ్తున్న విరాట్ దగ్గరకు వచ్చి దశ్మి.. 'ఒక సాయం జేస్తవా దొరా..' అని అడిగింది.

'చెప్పు దశ్మీ ..'

'నేను మా వదినకు సాయంగ కొన్ని దినాలు ఇక్కడే ఉండాలి. పొద్దుగాళ్ళ అంతా మా తండాలోనే ఉంటాము. సాయంత్రమే కదా ఇక్కడకు వచ్చేది. ఇంతట్ల పేపర్ల గిట్ట మా ఎగ్జామ్స్ గురించి వస్తే జర చెప్తారా..'

'తప్పకుండా చెప్తాను ఈలోగా నువ్వు సమయం దొరికినప్పుడల్లా చదువుకుంటూ ఉండు దశ్మీ..' ఎన్నాళ్ళ నుంచో తెలిసిన అమ్మాయితో మాట్లాడినట్లు మాట్లాడాడు. ఆమె తలూపింది. అక్కడి నుంచి కదిలి వచ్చేశాడు. ఎక్కడి నుంచో పరుగున వస్తున్న వాగుపొంగులా ఆమె రూపం, ఆమె సామీప్యం, మాట, నవ్వు, మౌనం, నృత్యం, ఆమె కదలికలు... ఒకదాని తరువాత ఒకటి అతన్ని చుట్టుముట్టేశాయి.

• • •

వారాంతాలు విరాట్ శ్యామ్‌తో కలిసి పాల్వంచ రావడం, దశ్మీని కలవడం.. దశ్మీ కోసమే ఏదో వంకతో పాల్వంచ రావడం జరుగుతూనే ఉంది. విరాట్ గలగలా మాట్లాడుతూ ఆమెను కలుపుకోవాలని చూస్తుంటాడు. ఆమె మాత్రం చాలా తక్కువగా మాట్లాడుతూ ఓ మౌనిలా ఉంటుంది. బాగా స్నేహమయ్యాక ఆమె మాట్లాడుతుందిలే అనుకుంటూ ఆమె సామీప్యత కోసం ఎదురుచూడసాగాడు అతను.

'ఒక మనసు దేన్నయితే బలంగా వాంఛిస్తుందో అదే దక్కి తీరుతుంది' అని రఘు చెప్తుంటే- ఏమో అనుకునేవాడు విరాట్. అలాగే ఓ రెండు రోజులకు శ్యామ్ వాళ్ళింటికి మంగ్యా వచ్చాడు.

'దొరా! మీతో ఒకమాట మాట్లడాల..' విరాట్, శ్యామ్‌లతో అన్నాడు భయంగా.

మెల్లగా అతన్ని బయటకు తీసుకెళ్ళి ఓ దగ్గర కూర్చోబెట్టి, 'ఏమి జరిగింది మంగ్యా..?' అని అనునయించి అడిగారు.

'దొరా, మీకు తెలుసు కదా.. ఈ సుట్టుపక్కల అన్ని ఊర్లల్లో ఏ పిట్ట యాడ దొరుకుతాదో.. యాడ ఏ యాట దొరుకుతాదో నాకు బాగా తెలుసనీ.. వేరే ఊరినుండి ఎవరో దొరలొచ్చిండ్రు. వాళ్ళతో రమ్మని మస్తు సతాయిస్తున్నరు. అవ్వన్నీ ఒగనాడు నడిసినాయి. ఇప్పుడు మేం జంగిల్ జోలికే బోతల్లేం... అంటే అస్సలు ఇంటల్లే దొరా. ఆల్లుజూస్తే పహిల్మాన్ల లెక్కున్నరు. ఏవో పచ్చులు గావలంటారు. ఏదో యాటకు బోదము రమ్మంటారు. వద్దు వద్దు అన్నా... దినాము అచ్చి కూసుంటున్నరు. ఎన్ని పైసలు కావాలంటే అన్ని పైసలిస్తాము అంటున్నరు.'

'పోనీ వెళ్ళకపోయావా నాలుగు పైసలు సంపాదించుకునే వీలున్నప్పుడే సంపాదించుకోవాలి అంటావు కదా..'

'లేదు దొరా ఇప్పుడు జంగిల్ ఆఫీసర్లు ఊరుకోరు. పోలీసులు ఊరుకోరు. అవ్వన్నీ ఏళ్లనాడే బందువెట్టినం.'

'మరి అదే చెప్పు వాళ్ళతో భయమెందుకు?'

'అది కాదు దొరా...! వాళ్ళకు నా చెల్లె దశ్మీ మీద కన్నువడింది. నన్ను మాయజేసి దాన్ని ఏమన్నా జేస్తారని భయమయితాంది..' కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు మంగ్యా. అంతటి బలశాలి అలా బీరువయి కన్నీరు పెడుతుంటే విరాట్ కదిలిపోయాడు.

'తేరుకుని ఇప్పుడేమి చేద్దాం మంగ్యా?' శ్యామ్ అడిగాడు 'నేను ఇట్లా అడిగానని ఏమీ అనుకోరుగా దొరా?' చాలా కించపడతూ అడిగాడు.

'లేదు మంగ్యా.. దశ్మీ గురించి నాకు కూడా చాలా ఆందోళనగా ఉంది.'

'ఏమి జెయ్యాలే దొరా..! దశ్మీ లేదని ఆమెతో పాటు సిటీలా ఉండే కవితమ్మ రూమ్ కాలీజేసి ఎల్లిపోయిందట. ఇప్పటికిప్పుడు హాస్టళ్ళ బెట్టలేను. జర నీతోపాటు ఒక వారం దినాలు మీ రూమ్‌లో ఉండనిస్తావా దొరా..?' విరాట్‌ని అడిగాడు. తనపై మంగ్యా ఉంచిన నమ్మకానికి కదిలిపోయాడు విరాట్.

'దశ్మీ రక్షణ బాధ్యత నాది మంగ్యా. కానీ అది

మూడు రూముల ఇల్లయినా నాతో ఉన్న మౌలీ ఏదో కోర్సు నేర్చుకోవడానికి హైదరాబాద్‌కి వెళ్లిపోయాడు. ఇక అరవింద్ నెల క్రితమే ఉద్యోగం వచ్చి వెళ్లిపోయాడు. నేను ఒక్కడినే ఉంటున్నాను అది తెలుసు కదా' వివరించి చెప్పాడు. 'నాకు తెలుసు దొరా.. ఈ పరిస్తితిలో నా చెల్లెను కాపాడేవాళ్ళు నువ్వు దప్ప ఎవ్వరూ కానొస్తల్లేరు. నువ్వు ఎసొంటోడివో నాకు దెలుసయ్యా. ఒక వారమయితే నేన్ తీసుకెళ్ళి పోతానొ.' తలవంచుకుని అన్నాడు.

'బెంగపడకు మంగ్యా.. నువ్వు ఎన్ని రోజులు ఉంచినా నేను ఆమెను క్షేమంగా ఉండేలా చూసుకుంటాను..' మాటిచ్చాడు విరాట్.

ఆ సాయంత్రమే ఆమెను ఖమ్మంకి తీసుకెళ్ళిపోయాడు. వానలో తడిచిన కుందేలులా వజవజలాడుతున్న ఆమెకు వేడివేడి ఫలహారం తెప్పించి పెట్టి.. వెచ్చని రగ్గునిచ్చి పక్కగదిలో పరుండజేశాడు. గొళ్ళెం పెట్టుకున్న దశ్మీని చూసి మురిపెంగా నవ్వుకున్నాడు. నాలుగు రోజుల్లో తీసికెళ్ళిపోతాను అనుకున్న మంగ్యా, భార్య ప్రసవం వల్ల పదిహేను రోజులవరకూ రాలేదు. ఆ రాక్షసులు ఇక్కడిక్కడే తిరుగుతున్నారంటూ విరాట్‌ను, దశ్మీని ఆ దరిదాపులకు కూడా రానివ్వలేదు. వాళ్ళ బెడద తీరాక, దశ్మీకి మరో పదిహేను రోజుల్లో పరీక్షలు అన్న ప్రకటన వచ్చింది. విరాట్ ఇచ్చిన భరోసాతో ఆ పక్క గదిలోనే ఉండి శ్రద్ధగా చదువుకోసాగింది.

తానున్నప్పుడు ఎంతో ఒబ్బిడిగా ఉండే దశ్మీ... తాను లేనప్పుడు ఆమె కోసం వచ్చే నెచ్చెలులతో భలే హుషారుగా ఉంటుంది. వారితో గలగల కబుర్లు చెప్తుంది. వాళ్ళు ఫోన్‌లో ఏవో పాటలు పెడుతుంటే వారితో కలిసి డాన్సులు చేస్తుంటుంది.

'నీవు భలే డాన్స్ చేస్తావే. డాన్సంటే నీకు అంతిష్టమా?' ఓ రోజు అడిగాడు.

'మాలో అందరికీ డాన్స్ వచ్చు. మా ప్రతి పండగకీ, పెళ్ళిళ్ళకూ చిన్నా పెద్దా అందరం డాన్స్ చేస్తాము. అందరం కలసి ఆడాలనె తప్ప అదో పెద్ద డాన్స్ కాదులే దొరా..'

'ఈ దొరా అన్న పిలుపు మానవా.. నేనెలా బీటెక్ చేస్తున్నానో.. నువ్వూ అలాగే బీకామ్ చేస్తున్నావు. నువ్వు దేనిలోనూ తక్కువ కాదు. హాయిగా పేరు పెట్టి పిలువు' అని ఎన్నిసార్లో చెప్పాడు. దశ్మీ వినదు. పైగా ఎప్పటికప్పుడు ఇళ్లంతా శుభ్రంగా ఉంచడం, వేడిగా భోజనం పెట్టడం... ఇలా ఆమె ఏ పనిచేసినా ఏదో కృతజ్ఞతగా చేస్తునట్లుగానే ఉంటుంది. మధ్యలో విరాట్ ఫ్రెండ్స్, ఆమె ఫ్రెండ్స్ ఇద్దరు ముగ్గురు వచ్చి కొన్నాళ్లున్నారు. మళ్ళీ వెళ్ళిపోయారు. విరాట్‌ని చూడగానే మితభాషిలా ఆచితూచి మాట్లాడే దశ్మీనీ... 'కాస్త ఫ్రీగా ఉండు. చక్కగా మాట్లాడు..' అని ఎన్నిసార్లు చెప్పినా ముడుచుకుపోతూనే ఉంటుంది.

ఈ పరీక్షలు కాస్తా అయిపోతే ఈ మాటరాని మయూరి ఇక వెళ్లిపోతుందన్న దిగులు పట్టుకుందతనికి..

ఏ బంధమో ఆమెను ఇక్కడకు ఈడ్చుకొచ్చినట్టు వెళ్ళిన వారం రోజులకే నలుగురు మిత్రులనేసుకుని బీఈడీ కోచింగ్ అంటూ మళ్ళీ వచ్చి.. తన పక్క రూమ్‌లోనే చేరింది. విరాట్ ముఖం సంతోషంతో విప్పారింది. మంగ్యా తన చెల్లెలు ఓ సురక్షితమైన ప్రదేశంలో ఉండి పైచదువులు చదువుకుంటున్నదని బోలెడంత సంతోషపడసాగాడు

ఆ ఎగ్జామ్స్ అలా అలా పోస్ట్‌పోన్ అవ్వడం, ఆ ఫ్రెండ్సంతా ఏవో కంప్యూటర్ కోర్సుల్లో చేరి ఇక్కడే కొనసాగడం జరిగింది. ఇక విరాట్ నెలరోజుల నుంచి తన ఇంట ఓ వెన్నెల పంటలా తిరుగుతున్న ఆమెను చూసి మురిసిపోతున్నాడు. ఆమెను తనదానిగా చేసుకోవాలన్న పరితపన ఒక పక్క ఆపదకు తనకు దగ్గరలో సురక్షితంగా ఉంచమని పంపితే.. ఆలిగా చేసుకుంటానంటే మాంగ్యా ఎలా అర్థం చేసుకుంటాడో అని భయం ఇంకోపక్క. తల్లి ఒప్పుకుంటుందన్న ఆశ లేదు.

కానీ తండ్రికి మాత్రం 'చిన్నప్పటి నుంచి మనం ఓ నెమలిని పెంచుకుందాం అని అడుగుతున్నాను కదా నాన్నా..! అన్నీ బాగుంటే నా సహచరిగా ఓ మయూరి మనింటికి వస్తుంది..' అని చెప్పుకున్నాడు.

'ఆమె అభిప్రాయం తెలుసుకోకుండా ఆశలు పెంచుకోకు విరాట్. అమ్మ గురించి కూడా ఆలోచించు' హెచ్చరించాడు తండ్రి.

తండ్రి మాటల ఆలోచనల సెగకో, వాతావరణం మారో విరాట్ తీవ్రంగా జ్వరంబారిన పడ్డాడు. దశ్మీ అతన్ని కంటికి రెప్పలా చూసుకుంటుంటే– ఆమె తనదే అని మరింత నమ్మకం కుదిరింది. జ్వరం తగ్గింది కానీ, నీరసం తగ్గలేదు. చివరి సెమిస్టర్ దగ్గరకు రావడంతో విరాట్ తల్లే వచ్చి ఓ వారం రోజులు ఉంది. తల్లికీ దశ్మీ చేరువ కావడానికి ఇది ఒక మంచి అవకాశం అనుకున్నాడు. వాళ్ళిద్దరూ కలసి మాట్లాడుకుంటుంటే సంతోషపడ్డాడు.

తల్లి వెళ్లిపోయాక ఓ మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. పక్కగది కోలాహలంగా ఉంది. ఏమిటా అని చూస్తే దశ్మీ తన భాషలో పెద్ద గొంతుతో గడబిడగా మాట్లాడేస్తోంది. ఆమె స్వరంలోని ఉత్సాహానికి ఆశ్చర్యపోయాడు విరాట్. ఆమె చిటికెలో వాళ్ళకు కావల్సినవన్నీ చేసిపెడుతూ నవ్వుతూ హడావుడిగా తిరగసాగింది. కానీ, ఎందుకో దశ్మీ తనతో ఏనాడూ అంత ఆత్మీయంగా మాట్లాడినట్టు అనిపించడం లేదు. తపనతో ఎందుకు అలా ఉండదు? ఉక్రోషం వచ్చింది. అసలు దశ్మీకి నిజంగా తానంటే ఇష్టమేనా? అనుమానపడ్డాడు.

'ఇష్టమూ, నమ్మకం లేకుండానే ఒక ఆడపిల్ల ఇలా ఇంత ధైర్యంగా నీతో నీ పక్క గదిలోనైనా సరే కలిసి ఉంటుందా..! ఆమెకు నువ్వంటే ప్రాణం..' అని మిత్రులు భరోసా ఇచ్చిన విషయం గుర్తుకు వచ్చింది. చివరకు ఓ రోజు ఆడిగేశాడు..

'నేనంటే నీకు ఇష్టమేనా దశ్మీ..' అని.

'నువ్వంటే ఇష్టపడని వాళ్లెవరు దొరా?' అంది.

ఆమె చెయ్యి పట్టుకుని 'అది కాదు దశ్మీ.. నేను ఏమి అడుగుతున్నానో నీకు తెలియకకాదు..' ఆవేశమో, అభ్యర్థనో అతని గొంతు వణికింది..

'నాకు నిన్ను పెళ్లి చేసుకొని జీవితాంతం నీతో బతకాలని ఉంది దశ్మీ..' పలవరింతగా చెప్పేశాడు.

'పెళ్లి చేసుకుని ఇద్దరు బతకడానికి ఇద్దరికీ ఒకరంటే ఒకరికి ప్రేమో ఇష్టమో ఉండడం మాత్రమే సరిపోదు దొరా.. మీ కుటుంబానికి మా కుటుంబానికి స్నేహం కలవాలి. భాష కలవాలి, పద్ధతులు కలవాలి. ఆర్థిక స్తోమత కలవాలి.' అంది నిశ్చయంగా.

'నీకేమన్నా పిచ్చా..! అన్నీ మరచి మనం ఏకమై కలిసుందామని అంటే అర్థం కాదా?' ఉక్రోషంగా అన్నాడు.

'ఎలా కలిసి ఉంటాం దొరా.. అంత జ్వరంతో ఉన్న నిన్ను అన్ని రోజులు నిన్ను కంటికి రెప్పలా చూసుకున్నానా.. మీ అమ్మ వచ్చాక నువ్వు నన్ను ఎంత గొప్పగా పరిచయం చేసినా, నీకు టాబ్లెట్ ఇవ్వడానికి కూడా నన్ను నీ బెడ్‌రూమ్ వరకు కూడా రానివ్వలేదు తెలుసా? ఉన్న వారంరోజులూ ప్రతి నిముషం మా కులం గురించి, మీ స్టేటస్ గురించే మాట్లాడింది. నువ్వు మాత్రం మా తీజ్ పండక్కు మా అన్న నిన్ను మా తండాకు తీసుకెళ్లినప్పుడు.. ఆ చెట్టుకింద నులకమంచం మీద కూర్చోడానికి ఎంతో ఇబ్బంది పడ్డావు. మా తండావాళ్ళు ఇచ్చిన ఆ ప్రసాదం ముట్టనే లేదు నువ్వు. ఇక నువ్వు మా వాళ్ళతో ఏమి ఆడతావు? ఏమి కలుస్తావు? నీ కజిన్ బర్త్ డేకి నేను రానన్నా నువ్వు నన్ను హొటల్‌కి తీసుకెళ్లినప్పుడు మీ లిప్‌స్టిక్ బ్యాచ్‌తో నేనెన్ని మాటలు కలిపినా ఒక్కరు కూడా నాతో కనీసం చేయి కలపలేదు. నాకు నువ్వంటే, నీకు నేనంటే ఇష్టం ఉండగానే సరిపోదు దొరా.. నావాళ్లూ నీ వాళ్ళూ కలవాలి. అదే జీవితం.' స్థిరంగా చెప్పింది.

'మనం పెళ్ళి చేసుకుంటే మా నాయినా అమ్మా, మా అన్నా వదినా మీ ముందు గదిలో కూర్చుని నన్ను కాసేపు చూసి వెళ్లిపోతారు. మీ అమ్మ నాయన మా తండాకి ఒక్కసారీ రాను కూడా రారు. మన మీద ప్రేమతో ముందు మన పెళ్ళికి ఒప్పుకున్నా.. కలవని అనేక అంతరాలతో వాళ్ళు ఎప్పుడూ సంఘర్షిస్తూనే ఉంటారు. ఏరి కోరి పెళ్లి చేసుకున్న మనం మనవాళ్ళ కోసం రోజూ గొడవ పడాల్సి వస్తుందేమో..' ఎంతో అమాయకంగా కనపడే దశ్మీ ఇంత స్పష్టమైన అభిప్రాయాలూ వ్యక్తపరుస్తుంటే నివ్వెరపోయి వింటున్నాడు. ఇంతలో ఎవరో వస్తే దశ్మీ అటువైపు వెళ్ళింది. తన ముందెప్పుడూ మౌన వీణియలాగా ఉండే దశ్మీ.. తన తండావాళ్ళ ముందు సెలయేటిలా తన హృదయాన్ని ప్రవహింపజేస్తుంటే.. ఇక ఆ సెలయేటిని ఆపకూడదు అనుకున్నాడు.

ప్రవేశం!

అవునులే
ఎక్కడ ప్రవేశించనిచ్చారు గనక
ఎప్పుడూ మా దేహ మాళిగల్లోకి
దొంగల్లా ప్రవేశించడమే గానీ
మా అంతరంగాల్లోకి
ప్రేమగా తొంగిచూసిన
క్షణాలెక్కడున్నాయి మాకు

మా సౌందర్య సీమల్లో
పశువుల్లా పొర్లటమే గానీ
మా హృదయ సౌందర్యాలను
ప్రేమగా తడిమిందెపుడని?

మమ్మల్ని ఆటబొమ్మలుగా తప్ప
అమ్మలగన్న అమ్మలుగా
కొలిచిందెపుడని?
మా పన్నీటిలో
జలకాలాడటమే తప్ప
మా కన్నీటి కాసారాల్లో
మునిగి ఓదార్చిన
సమయాలెక్కడివి మీకు!
మీ మగ అహంకార సిమెంటు
చప్టా మీద మా శరీరాలను
చేప బొమ్మల్లా రుద్ది
పొలుసులు పొలుసులుగా
విడగొట్టటమే గానీ
మా మనసులోని గాయాలను
కలిప కుట్టిన విద్య
మీ ఛాందస చేతివేళ్లకెప్పుడు
అంటుకుందని?

ఎప్పటికప్పుడు
మా రెక్కలు కత్తిరించి
మీరెగరమన్న చోటల్లా
ఎగరటమే గానీ
మాకు స్వేచ్ఛాకాశాలను
ఎక్కడ బహుకరించారు
గనక!
పాచి పట్టిన పితృస్వామ్య
భావజాలాల కింద మమ్మల్ని
తొక్కిపట్టే కథలింకెన్నాళ్లు?
మీ అజమాయిషీలు అభిజాత్యాలు
మీ బండ శరీరాల కండ బలాలతో
మమ్ము నిలువరించటం
ఇంకెన్నాళ్లు?
ఒకపక్క దేవతలమంటూ
దయ్యాల్లా తరిమికొట్టటమేమిటి?
దేవతలుండాల్సింది గుడిలోనే
కదా!

ఏ దేవుడు చెప్పాడయ్యా
మీ మట్టి బుర్రలకు
రక్త మాంసాలున్న మనిషిని
లోపలికి రానివ్వద్దనీ..?

మలినంలేని చోటెక్కడుంది
ఆ మలినంలోంచే కదా
మీరంతా పుట్టుకొచ్చింది
ఈ రక్తమాంసాల పెట్టెలోంచే కదా
మీరు భూమ్మీదకు జారిపడి
రొమ్ము విరుచుకుంటున్నది
మతం పొరలు కమ్మిన
ఛాందసులారా
మనుషులుగా ఆలోచించండి
లేదంటే
ఆ గర్భ గుడుల్లోకి
ప్రవేశించనీయనంత కాలం
మా గర్భ గుడుల్లోంచి
బయటి ప్రపంచంలోకి
మీకు ప్రవేశం లేకుండా చేస్తాం!

\- నిరంతర
8247432521

మంచు వల

రాత్రంతా కష్టపడి పన్నిన వల
పొద్దున్నే కొంచెం కొంచెం లాగుతున్నాడు
సూర్యుడు
మంచు వల కదా
మహా జాగ్రత్తగా వడుపుగా గుంజుతున్నాడు
పంట పొలాల మీంచి లాగినప్పుడు
ఎర్రని ఆకాశం వలలో చిక్కినట్టనిపించింది
చలికాలం ఊరికొస్తే స్వాగతం ఇంత
అందంగా వుంటుంది
పచ్చి పచ్చి కిరణాలను
గుళ్ళ మీదా ఇళ్ళ మీదా దులపరిస్తూ
వలను మడతలు పెడుతుంటాడు
పగటి రేడు
చేపల చెరువులూ రొయ్యల చెరువులూ
వల కన్నాల్లోంచి జారిపడిన
వెండి మబ్బుల్లా మెరిసిపోతాయి
తమను పట్టుకోలేని భానుడి ప్రతాపాన్ని
వెక్కిరిస్తూ
మంచు వల అంచుల మీద
పిట్టలు ఆడుకుంటాయి
పొలాల మీదుగా ఊరి మీదుగా చెరువుల
మీదుగా
వలను లాక్కుంటూ లాక్కుంటూ వచ్చి
ఊరవతల ఖాళీ వెలివాడలో
కూలబడతాడు
బహిష్కృత స్మృతుల బ్రహ్మజెముడు
పొదలకు చిక్కుకున్న
వలను లాగలేక ఇనుడు ఖిన్నుడవుతాడు
ముక్కలు ముక్కలుగా చినిగిన మంచు వల
నన్ను అతుక్కుపోతే భాస్కరుడు బై బై చెప్పి
ఎండల మెట్లెక్కి ఎంచక్కా చెక్కేస్తాడు
వల కరిగిపోయింది కానీ
వలలో పడ్డ పద్యమై నేనింకా
అటూ ఇటూ కొట్టుకుంటూనే ఉన్నాను

\- ప్రసాదమూర్తి
84998 66699

కవిత్వమ్



ముళ్ళకంచె

ఇక చాలు ఆపండి...!
వాడ చావుకి మనువు కుక్కల హడావుడి
ప్రణయామృత సాగరంలో
కసరి బుసకొట్టే కాలనాగుల విష నాట్యం
ఇకచాలు ఆపండి...!
చెట్టుచాటునుంచి దూసుకొచ్చిన
ఆర్యవీరుని దొంగబాణంలా
పుట్టుకనే వక్రీకరించి
పురుషసూక్తం పఠించిన విభజన మంత్రంలా
ఎక్కడ పడితే అక్కడ
మూర్ఖ రాతల రామాయణం
ఇకచాలు ఆపండి...!
సత్యాన్ని తొక్కిపెట్టి
తర్కాన్ని ఎక్కుపెట్టి
రగిలించే చర్చోపచర్చల
చాట భారతం
ఇకచాలు ఆపండి...!
నెత్తురు తాగిన కత్తి నోటికి
వెన్నపూసరాసి
కన్నీరు నిండిన
గాయంపై
కారం చల్లే కుటిల నాటకం
ఇకచాలు ఆపండి...!
నేరమంతా పరువు మీద నెట్టేసి
గురిగింజ వేదాలు వల్లించకండి...!
యుగాలను సవాల్ చేస్తూ
మనసు పుటలమీద తిష్టవేసిన
పుట్టుమచ్చలను చెరిపేయండి
కట్టుబాట్లను అధిగమించి
సమతాకాశంలో ప్రతిధ్వనించే
ప్రేమయుగళ గీతాలకు స్వాగతం పలికి
జాతి గుండెలమీద విస్తరించిన
ముళ్ళకంచెను తునాతునకలు చేద్దాం రండి

\- కోయి కోటేశ్వరరావు
9440480274

థ్యాంక్యూ టీచర్...

- ఎం. ప్రగతి
9440798008

'బెరీనెయిమా జడ, ఆటో పొయినాదంటే నాకు బడికి ఆలీసిమయితాది.' నిదానంగా జడల్లుతున్న తల్లి మీద విసుక్కుంది చంద్రి.

'యేత్తన్నానుండుమే. సిక్కన్న తియ్యాల్నా, వద్దా?' మొట్టుతూ జడలు పూర్తి చేసింది తల్లి.

'యేందోమా, ఇయ్యాల పొద్దుట్యాల కాన్నుంచీ ఒగటే కడుపు నస్తాంది.' పొట్ట మీద చేతులేసి చెప్పింది తల్లితో.

'అట్లయితే ఈ దినం బడికి పోకపోతే మాన్లే. ఇంటికాడుండు.' తల్లి మాటలకు అడ్డు పడింది చంద్రి.

'ఇంకేమున్నుందా, పెద్దయివారమ్మ బర్ర దీస్కోని ఎంటబడతాది. డ్రిల్లయివారు దినమంతా ఎండలో నిలబెట్తాడు.' అంటూ పుస్తకాల సంచి వీపుకేసుకొని బయల్దేరింది.

టవున్లో జిల్లా పరిషత్ హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతోంది చంద్రి. వాళ్ళ ఊరి నుంచి ఆరు కిలోమీటర్ల దూరం. చంద్రితో పాటు ఇంకో ఇద్దరమ్మాయిలు అదే ఊరి నుంచి ఆటోలో వచ్చి ఆ స్కూల్లోనే చదువుతున్నారు. ఆ ఊరికి బస్సు ఉంది కానీ ఎప్పుడొస్తుందో, ఎప్పుడు పోతుందో ఎవరికీ తెలీదు. అందుకే చాలామంది షేరాటోలనే నమ్ముకున్నారు.

ఆటోలో కుదుపులకు చంద్రికి కడుపు నొప్పి మరింత ఎక్కువయింది. బడి ముందు ఆగిన ఆటో దిగిన తర్వాత ఏదో అనుమానం చంద్రికి, తన కడుపు నొప్పికి కారణం డేట్ వొచ్చిందేమోనని. కానీ ఇంకా నెల కాలేదే. ఏం చెయ్యాలో అర్థం కాలేదు. 'ఇంటికి పోదామంటే అమ్మ ఇంటికాడుండదు. చనిక్కట్టె పీకేకి పోయింటాది. అమ్మొక్కటే గాదు, ఎవురూ ఉండరు. అంతా బీగమేసి పన్లకు పోయింటారు. ఏం జెయ్యాల? ఎట్లన్న గానీ బల్లోకే పోతా.' అనుకుంటూ బడిలోకి నడిచింది. ఆటోలో సీటు మీద మరకను ఆమె గమనించలేదు. చంద్రి వెళ్ళిపోయిన తర్వాత చూసిన ఆటో డ్రైవర్ బయటికే తిట్టటం మొదలెట్టాడు.

'ఛూ ఎదవ ముండలు... ఏమయితాందో కూడా తెల్సకుండ బయట తిరిగి సస్తారు. ఈ ముండలు సదువు కోకపోతే, ఊళ్లేలక పోతే కొంపలు మునిగిపోతాయేమో. ఆటో అంత గబ్బు లేసిపాయె.'

బడిలోకి పోయిన చంద్రిని మిగతా పిల్లలు ముట్టుకోకుండా దూరం నుంచే విచిత్రంగా చూస్తున్నారు. ఒకరిద్దరు దగ్గరి కొచ్చి, 'ఏందిమే నీ లంగా చూసుకోలేదా?' ముట్టుకోకుండా దూరం నుంచే చెబుతున్నారు. పావడా వెనకల మరకంటినట్లు చంద్రికి అర్థమై బిక్కచచ్చి పోయింది. కొంతమంది ఆమెవైపు చూస్తూ గుసగుస లాడుతున్నారు. చంద్రి మౌనంగా వెళ్లి క్లాసులో కూచుంది. రోజూ ఆమెతో పాటు అదే బెంచీలో కూచునే మరో ఇద్దరమ్మాయిలు దూరంగా వెళ్లి ఇంకో బెంచీపై కూచున్నారు. అంతా తన వైపే అదోలా చూస్తూ నవ్వుకోవడం చంద్రికి తెలుస్తోంది. ఇక ఎక్కువ సేపు అక్కడ కూచోలేక బయటికెళ్ళి పోయింది. మరి కాసేపటికి క్లాసులోకి ఇంగ్లీషు టీచరు దేవి వచ్చింది.

'గుడ్ మార్నింగ్ టీచర్!' అంతా లేచి నిలబడి అరిచారు.

'గుడ్ మార్నింగ్, సిడౌన్' దేవి స్పందనతో అందరూ కూచున్నారు.

దేవి అటెండెన్స్ తీసుకుంటూ 'చంద్రి...? పొద్దున్న చూశానే, ఎక్కడి కెళ్ళింది చంద్రి?' అడిగింది పిల్లల్ని.

'వచ్చి బయటికెళ్ళి పోయింది టీచర్?' నోటికి చేతులడ్డం పెట్టుకొని ముసిముసిగా నవ్వుతున్నారు పిల్లలు. దేవి నొసలు చిట్లిస్తూ ఖాళీగా ఉన్న బెంచీ కేసి చూసింది. ఆమెకు విషయం అర్థమైంది.

స్కూలు మైదానంలో ఓ చెట్టు కింద కూచున్న చంద్రి మనసు మనసులో లేదు. ఆర్నెల్ల కిందే తను పెద్దమనిషయింది. తొమ్మిది కొచ్చినా ఇంకా పెద్ద మనిషి కాలేదని ఊళ్ళో, బళ్ళో అంతా ఆరా, అదొక్కటే సమస్యన్నట్లు.

'ఏంది ఆదెక్కా, పిల్ల ఇంకా ఈడేరల్యా? డాకిటేరు తానికన్న తోలకపోయి సూపీ గూడదా?' పక్కింటామె సలహా. 'అనుమక్క బిడ్డ నీబిడ్డ కన్నయేడాది ఎనక పుట్టినాది. పోయిన రామనవమికి ఈడేరింది.' 'ఏంది ఇంత మటుకూ ఈ పిల్ల మూల కూకోలేదా? నూగులుండలూ, చెనిగిత్తనాలూ బాగా తినబెట్టు.' ఇరుగూ పొరుగూ, బంధుగణాలూ ఒకటే నస పెట్నారు కానన్ని దినాలూ. స్కూల్లో కూడా ఎవరూ తక్కువ తినలేదు. 'నేను ఏడో క్లాసులోనే అయినా తెల్సా. ఆ కిట్టమ్మయితే ఆరో క్లాసు ఎండాకాలం సెలవల్లోనే మూల గూచ్చుంది. నిజంగ జెప్పు, నువు అయినా గూడా సెప్పకుండా మూసి పెడతాండవు గదా.' ఇలా అదేదో అంతర్జాతీయ సమస్యన్నట్లు, అదంతా చంద్రి తప్పన్నట్లు, చంద్రిని అంతా తలో మాట అంటుంటే చంద్రికి ఏదో అపరాధ భావం. నిజానికి పద్నాలుగేళ్ళు పెద్ద వయసేమీ కాదు, మనిషి స్వతహాగా బలహీనంగా ఉండటం, సరైన పోషకాహారం లేకపోవడంతో ఎదుగుదల లేటయి, పద్నాలుగేళ్ళు దాటాక పెద్ద మనిషయింది. శరీరంలో వస్తున్న మార్పుల పట్ల సరైన అవగాహన లేకపోవడం, దాంతోపాటు క్రమరహితంగా వచ్చే

రుతుచక్రంతో జాగ్రత్త పడటం చంద్రికి అర్థం కావట్లేదు. ఇన్నాళ్ళూ కాలేదని సతాయించారు. ఇప్పుడేమో అవుతున్నందుకు దూరం పెడుతున్నారు. ఆడపిల్లలకు ఏంటీ శిక్ష? మగపిల్లలకు ఈ అగచాట్లేమీ లేవు. అదృష్టవంతులు. ఆలోచిస్తూ ఫస్ట్ పీరియడ్ అయిపోయినట్లు మోగిన బెల్ శబ్దాన్ని కూడా గమనించుకోలేదు.

'చంద్రీ!' దేవీ టీచర్ పిలుపుతో ఉలిక్కిపడి లేచి నిలబడింది.

'ఏం క్లాసుకు రాకుండా ఇక్కడ కూచున్నావు?' దేవీ టీచర్ ప్రశ్నకు ఏమని సమాధానమివ్వాలో తెలియక నేలకేసి చూస్తూ మౌనంగా నిలబడింది చంద్రి.

'డేటయ్యిందా?' దగ్గరికెళ్ళి చంద్రి భుజం మీద చెయ్యేసి అడిగింది దేవి.

'అవును టీచర్, నెలయ్యేకి ఇంకా రెండ్రోజులుంది. ముందు తెల్సలేదు.' తల కిందికేసుకొని తనలోకి తను ముడుచుకుంటూ అన్నది.

'భయపడొద్దు చంద్రీ.. ఏంకాదు, సరిగ్గా నెలకే రావాలనేం లేదు. 28 నుంచి 35 రోజుల వరకు ఎప్పుడొచ్చినా రెగ్యులర్‌గా ఉన్నట్టే. రెండు మూడు నెలలకోసారి అయితేనే ఇర్రెగ్యులర్ అంటాము. అందుకే ఎప్పుడూ బ్యాగ్‌లో ప్యాడ్ పెట్టుకొని ఉండాలి.'

'ప్యాడ్ అంటే ఏంది టీచర్?' అమాయకంగా అడిగింది చంద్రి. శానిటరీ న్యాప్కిన్ గురించి చంద్రికి తెలియదని అర్థమయింది దేవికి. చాలామందిలాగే ఏ పాత నూలు చీరలో ఉపయోగిస్తుందని తేలిగ్గానే అర్థం చేసుకుంది. 'నువ్వెళ్ళి స్టాఫ్ రూమ్‌లో కూర్చో.' అంటూ హెచ్ఎం రూమ్‌లోకి వెళ్ళి, 'మేడం, నాకు ఓ అరగంట పర్మిషన్ కావాలి.' అని ఆమె అనుమతి

తీసుకొని స్కూటీలో బయటికెళ్ళింది.

అరగంట తర్వాత చేతిలో కవరుతో స్టాఫ్ రూమ్‌లోకి అడుగు పెట్టింది దేవి. చంద్రి చేతిలో ఒక జత సల్వార్ కమీజ్ డ్రస్, శానిటరీ నాప్కిన్స్ ఉన్న కవరు పెట్టి 'ఎలా ఉపయోగించాలో చెప్పి బాత్ రూమ్‌లోకి పంపింది. హెచ్ఎంతో విషయం గురించి వివరంగా చెప్పి, ఇతర స్టాఫ్‌ను సమావేశ పరిచింది.

'మేడం, ఎదిగే పిల్లలకు అవేర్నెస్ కల్గించడం చాలా అవసరం. ఇప్పటికే 1వ క్లాసులో చేరిన ఆడపిల్లల్లో నూటికి 60 మంది మాత్రమే 8వ తరగతికి మిగులుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. ఈ కారణంగానే బడి మానేస్తున్న పిల్లలు చాలామంది. రుతుచక్రం అత్యంత సహజమని, దాని గురించి అధైర్య పడకూడదని పిల్లలకు తెలియజెప్పాల్సిన బాధ్యత టీచర్లుగా మనమీదే ఉంది. ఎవరైనా స్వచ్ఛంద సంస్థలనడిగి శానిటరీ నాప్కిన్స్ పిల్లలకు అందజేయడం చాలా అవసరమని నేననుకుంటున్నా. కౌమారదశలో వస్తున్న మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెబుతూ వాళ్ళకున్న అపోహలు తొలగించాలి.' దేవి విషయం వివరించింది.

'అవును మేడం.. మంచి ఆలోచన. ఒకవేళ ఎవరూ ముందుకు రాకపోతే మనమే తలా ఇంత వేసుకొని కొని ఇద్దాము. స్కూల్లో కూడా ఒకచోట ఉంచి అత్యవసరమైన వారికి అందేలా చేద్దాము.' సైన్స్ టీచరు కస్తూరి సమర్థించింది.

పిల్లల్లో చాలామందికి రక్తహీనత ఉన్నట్టు తెలుస్తోంది. మధ్యాహ్న భోజనంతో పాటు, చుట్టుపక్కల దొరికే చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలు అందజేద్దాం. ఎవరైనా గైనకాలజిస్ట్‌ను స్కూలుకు ఆహ్వానించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేద్దాం.' సోషల్ టీచర్ పద్మజ తన అభిప్రాయం చెప్పింది. అందరూ సానుకూలంగా స్పందించడంతో హెచ్ఎం 'ఎక్కువ ఆలస్యం చేయడం కంటే అనుకున్న వెంటనే కార్యక్రమం చేస్తే బాగుంటుంది. ఈరోజే పిల్లలందర్నీ కూచోబెట్టి, అవగాహన కల్పిద్దాం. డాక్టర్ని పిలిపించడం, స్వచ్ఛంద సంస్థలను అప్రోచ్ కావడం మళ్ళీ చేయచ్చు.' అంటూ సర్క్యులర్ రాసి అన్ని క్లాసులకు పంపించారు. గది నుంచి బయటకు వచ్చిన దేవికి తాను తీసుకొచ్చిన డ్రస్ వేసుకొని తనకు సరిపోయిందా లేదా అని ముందుకు, వెనక్కి చూసుకుంటున్న చంద్రి కనబడింది. 'డ్రస్ సరిపోయిందా? ఇక క్లాస్‌కు వెళతావా?' నవ్వుతూ అడిగింది. 'పోతా టీచర్.' అంటూ నాలుగడుగులు ముందుకేసి, మళ్ళీ వెనక్కి వచ్చింది. 'థ్యాంక్ యూ టీచర్.' అని చెప్పి వడివడిగా వెళ్ళిపోయింది. ఆ నడకలో సరికొత్త ధైర్యం, ఆత్మవిశ్వాసం కనిపించాయి దేవికి.

నాసిక్ మట్టిలోకి....

వృద్ధుడు కాఫీ కప్పుని
అరచేతుల్లోకి తీసుకుని
ఒద్దికగా తాగుతున్నాడు
అటుపక్క సిక్కూ
ఇటు పక్క మలయాళీ
ఎదురుగా నేనూ - తెలుగువాణ్ణి!
ఒక్కో గుక్కని
అతని నేల జ్ఞాపకాన్ని దేన్నో
నెమరువేసుకుంటున్నట్టు
అపురూపంగా సేవిస్తున్నాడు

వృద్ధుడు అప్పుడే నిద్రలేచాడు
కిటికీ పక్కన కూర్చున్నాడు
రైలు అవిరామంగా కదులుతూనే ఉంది
కిటికీ ఆవల ఆకుపచ్చని ప్రపంచాన్ని
తేరిపారా అద్దంలోంచి చూస్తూ
నడిచిన చరిత్రనే
గుర్తుచేసుకుంటున్నాడా నేల వీరుడు

తెగిన దారమేదో
ఇంకా చేతుల్లో వేళ్ల మధ్య మిగిలే ఉంది
వృద్ధుడొక్కడే ప్రయాణిస్తున్నాడు
శూన్యంలో ఏ కొమ్మనో చిక్కుకున్న
గాలిపటం కోసమేనా
వేయికళ్లతో పొద్దు వైపు
అలా చూస్తూనే ఉన్నాడు
వృద్ధునిది అసంతృప్త పోరాటం

అటుపక్క సిక్కు
ఇటు పక్క మలయాళీ
ఎదురుగా నేనూ
మేం ముగ్గురం వృద్ధునిలో
పిడికెడు మట్టిని వెతుక్కోవడానికి
బయలుదేరాం
రక్తంతో చెమటతో తడిసిన
పాదం రాల్చిన మట్టిని
నుదుట దిద్దుకోవడానికి
ఉన్నపళంగా లేచి బయలుదేరాం!

- బాలసుధాకర్ మౌళి
95056 46046

ఆకుపచ్చని రాగం

- దేవేంద్రచారి సుంకోజి
9949118082

ఒరే చిన్నోడా... నేనీడ వద్దన్నే పుట్టే సూర్యుడితో.. సందేళ చిలకనవ్వుల చందమామతో .. రేత్రి గుసగుసలాడుకొనే లక్షల చుక్కలతో మాట్లాడతా.. ఇంటి నుంచి అడుగు బయటేస్తే చాలు, ఈదిలో ఎవరో ఒగరుంటారు.. యాడికప్పా ఎలబారినావని పలకరిస్తారు.. ఇంట్లోనే దూరుకోనున్నే ఎవరో ఒగరొచ్చి ఏమి ఇంట్లోనే ఉండావే.. ఒంట్లో బాగలేదా అంటారు. ఊరు దాటినామంటే.. మనుషులే కాదు, చెట్టూచేమా గొడ్డూగోదా రాయీరాప్పా.. ఏదైనా సరే నాతో మాట్లాడతాది.. నేనూ వోటితో మాట్లాడతా..

నాదంతా చాదస్తం అంటావు.. నాకు పిచ్చుంటావు.. చెట్లు మాట్లాడతాయా అంటావు. ఎందుకు మాట్లాడవురా నాయనా.. కని పెంచి పోషిస్తే మాట్లాడకుండా పోయ్యేది మనిషే. ఇంత తిండి పెడితే చాలు, ఈ భూమ్మీద ఇంకే జీవి అయినా కృతజ్ఞతతో ఉంటాది. కొన్నయితే సచ్చేంత విశ్వాసంతో కూడా ఉంటాయి.

నువ్వెప్పుడయినా ఒగ మొక్కను నాటినావా? దానికి పాదు చేసి నీళ్ల పోసినావా? చీడ పడితే మందు కొట్టినావా? చెట్టు చిగురిస్తే లేతాకులను పలకరించినావా? ఎదిగే కొమ్మలను తాకి చూసినావా? నాలుగు చినుకులు రాలితే, చెట్టు ఆనందం ఆకుల్లో పచ్చని సిగ్గై ఒయ్యారాలు పోవడం తెలుసా? మొగ్గేసి, పూతపూసి, పిందెనిలిచి, కాయకాసి... పక్వానికి వస్తే.. తినే జీవికోసం చెట్టు ఎంతగా ఎదురుచూస్తాదో ఎప్పుడైనా నీ అనుభవంలోకి వచ్చిందా? చిన్నపుడు వచ్చే ఉంటాది.. అదిప్పుడు చిన్నతనం అనుకోని మరిచిపోయింటావు.. లేదూ మరిచిపోయినట్టు నటిస్తుంటావు.. నటనే కదా జీవితం.. నీది, నీ చుట్టూ పక్కలా ఉండే వాళ్లదీ..

ఎవరో పెంచిన చెట్టుకు కాసిన కాయలను రాళ్లతో కొట్టో, కొమ్మలను వొంచో కోసుకుని తినడం కాదు.. అచ్చంగా అర్థతుండే మనిషికోసం ఎదురుచూసే చెట్టును నువ్వెప్పుడైనా ప్రేమతో వాటేసుకున్నావా? కొమ్మలను అక్కున చేర్చుకున్నావా? పసిపాప లేత గోర్లను తొలగించినంత సుకుమారంగా చెట్టు నుంచి దోరకాయను తెంపి, ఆ చెట్టుకు కృతజ్ఞత చెప్పి మధురమైన ఆ కాయను తిన్నావా? ఆ చెట్టుకు ఆశ్రయమిచ్చిన నేలతో, ఆ నేలతో సావాసం చేసే మనిషితో స్నేహం చేసినావా?

చెట్టులోంచి నిను పలకరిస్తూ దాగుడు మూతలాడే కోకిల గుర్తుందా? దాని మధురమైన పిలుపు వినిపిస్తోందా? చిన్నప్పుడు నీ ఎక్కిరింతలకు దాని కోపం జ్ఞాపకం ఉందా? నువ్వూ అది పోటీ పడి అరిచిన కూతలు గుర్తున్నాయా? గుర్తుండే ఉంటాయి.. జ్ఞాపకశక్తి ఎక్కువ కదా? గుర్తుండే ఉంటాయి. వాటిని జ్ఞాపకాలుగా చెప్పుకోవటం నీకు ఇష్టముండదు కదా.. ఇష్టముంటే.., ఎన్నో ఏళ్లుగా ఇంకా నీకోసం కలవరించే కోకిలమ్మను పలకరించేందుకు ఎందుకు రావు? చిటారుకొమ్మన ఉడత కిచకిచలు.. ఆకుల చాటున గువ్వల ముద్దులు.. రెమ్మలకు పెనవేసుకునే సాలీడు బంధాలు.. చెట్టు బెరడును అంటి పెట్టుకునే గొల్లభామల బెరకు భయాలు.. సాయంత్రం కాగానే గూళ్లకు చేరే కాకులు కొంగల కచేరీలు.. వాటి ఆరోజు సాధకబాధల పలవరింతలు.. ఏ శాస్త్రవేత్తయినా సృష్టించింది చూశావా? ఇంటి నుంచి బయటొచ్చి .. ఎండలో నడచి నడచి .. అలసి సొలసి.. ఉపశమనం కోసం ఎదరుచూసే పల్లె మనిషికి, ఊరంతటి నీడనిచ్చే గొడుగులా చెట్టు కనిపిస్తే ఎంత ఆనందం.. ఆ చెట్టు నీడకు చేరి మొదలుకు ఆనుకుని కూర్చుని కాళ్ల బార్లజాఫి కళ్లు మూసుకుంటే ఆ ఆనందం ఎలా ఉంటుందో చెప్పగలవా? అసలు నీకు గుర్తుందా..? ఎన్ని రూపాయలు ఖర్చు చేస్తే ఇంతటి ఆనందం నీకు నగరంలో దొరుకుతుంది?

అలసిన ఒళ్లు ... చెట్టు నీడలో సేదతీరి.. కళ్లు మూతలుపడి.. కాసేపు కునుకేసి..కలల్లో తేలి.. నిన్ను వెతుక్కుంటూ వచ్చిన పెంపుడు కుక్క ప్రేమతో నీ పాదాలు నాకి, ఆప్యాయంగా 'గుర్ర్' అంటూ నిన్ను పలకరిస్తే.. నువ్వు కళ్లు తెరిచి చూస్తే.. ఆ కుక్క కళ్లలో కనిపించే కోటి కాంతుల కృతాజ్ఞతాపూర్వక ప్రేమకు ఖరీదు కట్టగలవా?

తీసుకోవటమే కానీ, ఇచ్చేది తెలీని మనుషులకు .. ఇచ్చినా ..తాము వద్దనుకున్నది తప్ప ఎదుటి వారికి అవసరమైంది ఇచ్చేదానికి మనసొప్పని మనుషులకు.. ఇచ్చినా తీసుకున్నా లాభనష్టాలతో బేరీజు వేసుకునే మనుషులకు.. కపటంలేని ప్రేమ విలువేం తెలుస్తుంది? ఎలా అనుభవంలోకి వస్తుంది?

సుదూర పల్లె నుంచి.. కడుపు తిండికోసం .. తన కాళ్లపై తాను నిలబడి సంపాదించుకునే తెలివి తక్కువ వ్యక్తి.. గొర్రెలను మేపుకుంటూ ఎండనపడి నీడకోసం చెట్టు వద్దకు వస్తే.. నిన్ను పలకరిస్తే.. నీ కుక్క ఆ అపరిచిత గొర్రెలను చూసి కోపగిస్తే.. నీ

చిరునవ్వుతో అది శాంతిస్తే.. నీకూ ఆ గొర్రెల కాపరికి మాటలు కలిస్తే.. మీ మధ్య బీడీ ముక్కో.. వక్కాకో బంధం కలిపితే.. మాటలు పెంచితే.. మీమధ్య స్నేహం చిగురిస్తే.. కష్టసుఖాలు కలబోసుకుంటే.. మీ ఊసులను శ్రద్ధగా వింటూ చెట్టు నీడనే శ్రోతల్లా గొర్రెలు విశ్రమిస్తే.. నీడనిచ్చి తాత్కాలికంగా ఆశ్రమిచ్చిన ఆ చెట్టూ మీరూ ఓ కుటుంబమైతే .. ఆ కుటుంబంలో ఈర్ష్యాసూయల్లేని ప్రేమానుబంధాలు వికసిస్తే.. ఇలాంటి మధుర జ్ఞాపకాలతో నీ బుర్ర మరింతగా ప్రేమెక్కి .. స్నేహం విస్తరించి.. చుట్టూ నీకు నందనవనంలా కనిపిస్తే.. ఎలా ఉంటుందో ఎప్పుడైనా ఊహించావా? చెట్టును దాటి.. దారిన నడిచి.. చేనును చేరి.. పైరును చూస్తే ఏమనిపిస్తుంది? ఇన్ని వేల మొక్కలను నేనే పెంచి పోషించాను.. ఇవన్నీ నా సొంతం.. నేను వీటికి సొంతం.. నేనొంటరిని కాను.. నా వెంటే ఎన్నో వేల జీవులు.. నా చూపు కోసం నా స్పర్శ కోసం నా శ్వాస కోసం.. అచ్చంగా నా కోసం.. నేనే ఐన నా కోసమే ఎదురుచూస్తున్నాయనే భావన ఎంత హాయిగా ఉంటుంది.. వేసవి సాయంత్రం చల్లగాలి వీచే అరుదైన రోజు అప్పుడే విచ్చుకున్న మల్లెల గుభాళింపులా మనసుకు మత్తెక్కించడం లేదూ.. నువ్వు పెంచిన మొక్కలు నీతో మాట్లాడ్డం లేదూ.. వేలమొక్కల ఆత్మలన్నీ ఒక్కటై.. నీ ఒక్కడి ఆత్మ వేల ఆత్మలుగా మారి మొక్కలూ నువ్వూ ఒక్కటిగా మారి పచ్చగా ప్రపంచాన్ని బతికించటం లేదూ.. ఇలాంటి నీ ఆనాటి పచ్చని అనుభవం ఎండి నలిగి పొడిగా మారి గాలిలో ధూళిలో కలసిపోయినా.. ఇంకా నీకు పొలం స్వాగతం పలకుతూనే ఉంది.. తన గర్భంలో దాచుకుని పెంచి పెద్ద చేసి మొలకెత్తించి చిగుర్లు తొడిగించి రెమ్మలేసి కొమ్మలొచ్చి ఆకుపచ్చని మనిషిలా నిన్ను మార్చేందుకు ఇంకా ఎదురుచూస్తూనే ఉంది. ఎప్పుడో వదిలి వెళ్లిన నీకోసమే ఇంతగా ఎదురుచూసే ఈ నేల.. ఎప్పుడూ పలకరించే నాకోసం ఎంతగా తనకలాడుతుందో తెలుసా? సందేళ మేతనుంచి ఇంటికొచ్చే ఆవుకోసం ఎదురుచూసే లేగదూడలా, నా కోసం మన పొలం ఎదురుచూస్తా ఉంటుంది. పొలం స్పర్శతో నాలో పెరిగే జీవనోత్సాహం.. నా స్పర్శతో తనలో కలిగే ఆనందం.. నా అడుగు అడుగునా తెలుస్తూనే ఉంటుంది. నేల తల్లి నాతో మాట్లాడుతుంది. నిజం.. నేను ఒక్కరోజు పోకపోయినా నాపై అలుగుతుంది. రోజూ పోయి మాట్లాడుతుంటూ గారాలు పోతుంది. గంగమ్మయితే నేను పోగానే పలకరిస్తుంది. పైపులొంచి దుంకే గంగ.. జలజల పారుతూ నా పాదాలను చుట్టి గిలిగింతలు పెడుతూ పైరులోకి పాకుతుంది. పారతో పాదులు తీస్తూ పొలమంతా గంగను పారిస్తుంటే .. గంగా నేలా మొక్కా నాకు కృతజ్ఞతలు చెపుతుంటాయి. నేనూ ఆ మూడింటికీ శిరసు వంచి వందనం చేస్తుంటా. నీరూ నేలా పైరూ నేనూ.. నాలుగు నుంచి ఒక్కటిగా మారిపోతాం. నేల నాకోసం ఉంది. నీరూ నా కోసం ఉంది. ఆ రెండింటిని ఉపయోగించి పైరు పెంచేందుకే నేను భూమ్మీదకొచ్చాను. నీరూ నేల ఉనికి తెలిపేందుకే నేనున్నాను. నా మనుగడ కొనసాగేందుకు అవి ఉన్నాయి. నీరూ నేలా మనిషి కలిసి చెట్టుకు అల్లుకునే తీగలా కొనసాగితే ఈ ప్రపంచం మొత్తం పచ్చగానే ఉంటుంది. ఇక్కడి నేలలో ఇక్కడి నీటిలో ఇక్కడి పంటలో నా స్వేదం ఉంది.. నా ఆనందం ఉంది. నా కోరికలున్నాయి. నా ఊసులున్నాయి. నా హృదయం ఉంది. ఇక్కడే పండే గింజలు ఇక్కడ కాచే కాయలు.. ఇక్కడ పండే పండ్లు నేనొక్కడినే తినను.. నువ్వు కూడా తింటున్నావు..? నన్ను.. కన్న తల్లిని.. సొంత ఊరిని.. బుడిబుడి అడుగులప్పుడు ఆడుకున్న పొలాన్ని ..నీ ఎదుగుదలకు వాడుకున్న డబ్బుగా మారిన ఇక్కడి పంటలను.. అన్నింటినీ నువ్వు మరిచిపోయావేమో.. చిన్నోడా.. నువ్వు బతికేది ఇక్కడ నేనో, మరో చోట నాలాంటి వాడో పండించే వాటినో తినే. తినే తిండి ఒక్కటే అయినా నీకూ మాకు ఎంత తేడారా నాయనా? మనిషికీ చెట్టుకూ ఉన్నంత తేడా.. మేము ఆకుపచ్చనిచెట్ల లాంటి వాళ్లం.. నువ్వో అచ్చంగా అన్నీ మరిచిపోయే మనిషివి. ఒంటి నుంచి చెమట చిందితేనే మా మనసుకు ఆనందం.. శరీరానికి తేలిక. మీకు.. ఒంటి నుంచి చెమట చిందకుండా ఉండేదానికి ఏసీలు, ఫ్యాన్లు. మా పాదాలకు మట్టి అంటితేనే మేము బతికున్నట్టు.. మీకు పాదాలకు మట్టి అంటితే చికాకు.. మట్టి అంటకుండా ఏర్పాట్లు.. ఎండాకాలంలో ఎండలో ఎండి.. వానాకాలం చినుకుల్లో తడిసి.. చలికాలం చల్లదనానికి వణికితేనే మేము జీవించి ఉన్నట్టు.. మీకు ఎండంటే పడదు.. వానొస్తే చీకాకు.. మంచు కురిస్తే చీదరింపు.. నాలుగ్గదుల్లో నల్లటి అద్దాల నడుమ దూరుకుని.. మీరే తయారుచేసుకునే చల్లదనంలో రాళ్లమాదిరిగా బిగుసుకోనుంటారు.. ఇంట్లో ఉంటే దొంగల భయం.. తలుపుకు నాలుగు తాళాలు వేసుకోనుంటారు.. వీధిలోకొస్తే అనేక భయాలు.. ఎవడు ఏ బండితో గుద్దేస్తాడో.. ఎక్కడ ఎవడు బాంబు పేలుస్తాడో.. ఎవడైనా తుపాకీతో టపటపా పిట్టను కాల్చినట్టు కాల్చేస్తాడో ఎప్పుడు హరీమంటామో అని.. ప్రతిక్షణం భయం బతుకే కదా.. నిజంగా గుండెలమీద చెయ్యేసుకుని చెప్పు ? నువ్వు ఏరోజైనా ఏభయమూ లేకుండా ధైర్యంగా ఉంటున్నావా? చుట్టూ సంపదను మనుషులను యంత్రాలను.. అరచేతిలో ప్రపంచాన్నే పెట్టుకున్న నీవు నీ మనోప్రపంచాన్ని ప్రశాంతంగా ఉండనిస్తున్నావా? భయం లేని నిద్రను, అనుమానం లేని ఆహారాన్ని, మోసం లేని ప్రేమను, కోరిక లేని స్నేహాన్ని అనుభవంలోకి తెచ్చుకుంటున్నావా?

నిన్ను మించిన రోబోలను తయారు చేస్తున్నావే.. కృత్రిమ మేధదే భవిష్యత్తని ఊరిస్తున్నావే.. ఆ కృత్రిమ మేధను తయారు చేసేది మనిషి రూపుదాల్చిన స్వార్థం కాదా.. ఆ స్వార్థపు మనిషి బతికేది తిరిగి మా చెట్టులాంటి వారిపైన ఆధారపడే..! చిన్నోడా .. ఎందుకురా నీకు మేమంటే అంత అలుసు.. మట్టి అన్నా మట్టి మనుషులన్నా పల్లెలన్నా.. పచ్చదనం అన్నా చులకన..?

నీ ఆరడుగుల దేహం ఉండేందుకు ఆరువేల గజాల స్థలంలో ఇల్లు కడతావు.. పట్టెడు తిండి పట్టే కడుపుకు రుచి పేరుతో బుట్టలు బుట్టలు ఆహారం నేలపాలు చేస్తావు..సంతోషం పేరుతో లక్షలు ఖర్చు చేసి విహారాలు చేస్తావు? నీ ఖరీదైన వాహనం ప్రయాణించేందుకు గతుకులున్నాయని మట్టిపైన సిమెంటో తారో వేయిస్తావు..అడ్డుగా ఉన్నాయని నీడనిచ్చే పెద్దపెద్ద చెట్లనే నరికేయిస్తావు?

చిన్నోడా.. నువ్వు పూడ్చింది రోడ్లలో గుంతలను కాదు.. నీకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను.. నువ్వు నరికింది చెట్లను కాదు.. నీకు అన్నం పెట్టే చేతులను.. నువ్వు పెట్టుకున్న రక్షణ గోడలు.. నీకున్న సంపద.. నీ డబ్బుకు పనిచేసే మనుషులు.. భూకంపమో సునామీయో వస్తే ఏమవుతాయి? ఏమవుతారు? నిన్నెవరు ఆదుకుంటారు?

చిన్నోడా.. నీదంతా బలుపు.. ప్రకృతి ముందు మనమెంత? స్వార్థం పెంచే మనుషులతో కాదు.. ప్రేమను పంచే ప్రకృతితో స్నేహం చేయి.. ఒక మొక్కను పెంచు.. ఒక తోటను కాపాడు.. ఒక ఆవుకో గేదెకో ఆశ్రయం ఇవ్వు.. కుక్కనూ పిల్లిని మరవద్దు.. వీలైతే మరిన్ని జీవులనూ పెంచు.. అట్లని పావురాలను బంధించి పెంచొద్దు.. వాటి కాళ్లకు దారాలు నువ్వే కట్టి, ఆ దారాలను తెంపి వాటికి స్వేచ్ఛను ఇవ్వొద్దు.. నేను స్వేచ్ఛాపిపాసిని శాంతికాముకుడిని అని చెప్పుకోవద్దు.. ఏ జీవి స్వేచ్ఛకు భంగం కలగకుండా అన్నింటినీ నీ వాటిని చేసుకుంటూ.. నువ్వు అన్నింటికీ సొంతమవుతూ బతకరా చిన్నోడా!. ఈ నేల శాశ్వతం.. ఇందులోని జీవులు శాశ్వతం. చావుపుట్టుకల క్రమంలో.. విపత్తులొచ్చినా మళ్లీ జీవి ఏదో రూపంలో పురుడు పోసుకుంటుంది.., ఎండిన నేలలో నీళ్లు చేరితే ఎదిగే చేపల్లా.. నువ్వు కూడా ఎప్పుడూ జీవంతో ఉండు.. నవ్వుతో తొణికిసలాడుతుండు.. ప్రేమతో నిండుకుండలా ఉండు. గొంగళిపురుగు నుంచి సీతాకోకచిలుకలా.. సీతాకోకచిలుక నుంచి గొంగళిపురుగులా పరిణామంతో పయనించు.. నేనొక్కడినే శాశ్వతం అనుకోకు.. ఒక్కమాటలో చెప్పాలంటే పచ్చని చెట్టులాఉండు.. పచ్చని చెట్టులా మారితే ఎక్కడున్నా నీకూ నాకూ సంబంధం ఉంటుంది. పచ్చని చెట్టులా మారాక నువ్వు ఎక్కడున్నా నీ చుట్టూ ప్రేమల చిగుర్లు తొడుగుతాయి. స్నేహాల పూలు పూస్తాయి.. శ్రమల పిందెలు వస్తాయి. ఆశల కాయలు ఎదుగుతాయి. స్వేచ్ఛగా పండ్లు మాగుతాయి. ఆ పండ్లతో నువ్వూ నేనూ చుట్టూ ఉన్న ప్రపంచం సంతోషంగా బతికేస్తాం. లోకమంతా పచ్చగా మారి.. నింగి మేఘమై.. చినుకు చెరువై.. నేలంతా ఆనందబాష్పమై.. భూమిలోకి పాదాల వేర్లు విస్తరించి దేహం చేవదేలి తల ఆకాశం గొడుగై నిలబడే ఆకుపచ్చని మనిషిగా మారు.. వేర్లున్న మనిషిగా జీవించు.. లోకానికి వెన్నెముకగా నిలబడు.

వత్తికి అంటిన నూనె కాలిన శబ్దం, వాసన. చివరి దీపం వెలిగింది. కుర్రాడు కొవ్వొత్తిని ఉఫ్‌మని ఆర్పబోయాడు. ఇంతలో ప్రహరీ మూలన దీపమొకటి ఆరిపోయింది. ప్రహరీ కాంతులకు కావలి తానే. పరుగున వెళ్లి మళ్లీ అంటించేసరికి వరసలో మరో మూడు దీపాలు గాలికి అల్లాడుతున్నాయి. చేతులు అడ్డేయడానికి అవి అంతెత్తున పెట్టినవి..!



వెలుగులాటలో అప్పటికే ఆ అలసిపోయాడు.. అందుకే ఏంచేయలేక వదిలేసి మెట్ల మీద కూర్చుని కొవ్వొత్తినే తీక్షణంగా చూస్తున్నాడు. దాని సన్నటి పూత వెలుగులోంచి వీధి మలుపు వింతగా కనిపిస్తోంది. చిట్టిచేతుల్లో కాకరొత్తులు, గుమ్మాల్లో భూచక్రాల్లో పచ్చగా వెలుగుతున్నాయి. కుర్రాడు పండక్కి ఊరెళ్లలేదు. పెంట్ హౌజ్‌లో ఒంటరిగా నిద్రిస్తోన్నవాడిని ఇంటియజమాని కదిపి కొన్ని దీపాలిచ్చిపోయాడు. కిందికొచ్చి ప్రహరీపై వరసగా ముట్టించమన్నాడు. ఆ పనిమీదే కిందకు దిగాడు. ఇంటివారి బాణాసంచా సంచీ బయటకు తెచ్చాడు వారి పిల్లాడు. ముడి విప్పకుండానే సంచీ సందులోకి చేయి జొనిపిచ్చి చిచ్చుబుడ్డి అందుకున్నాడు. వీధిలో తొలి తలకిందులు కాంతుల జలపాతం తనదే కావాలనే ఆరాటం వాడిది. కుర్రాడి చేతిలోంచి కొవ్వొత్తిని గబుక్కున లాక్కుని గుమ్మం ముందుకు పరుగెత్తాడు. ఎక్కడ ఆ రవ్వలొచ్చి బాణాసంచా సంచీలో పడతాయోనని కుర్రాడు వాటిని గోడ వెనుకకు జరిపి నవ్వుతూ పిల్లాణ్ని చూస్తున్నాడు. కొన్ని కాంతులు, రవ్వలు ఇంట్లోకీ వెళ్లాయి. పిల్లాణ్ని అరుస్తూ వాళ్లక్క గాజుల్ని, మువ్వల్ని గలగలలాడిస్తూ బయటకొచ్చింది. కుర్రాడు కొత్తబట్టల్లో లేడు. అసలా అమ్మాయి ముందు ఎంత గొప్ప ఎటైర్‌లోనూ నిలబడలేడు. ఆమె గాలి తోసుకొస్తూ వచ్చేసరికి కుర్రాడు ముట్టించిన చివరి దీపం దాదాపు కొండెక్కేసింది. ఏదో అసౌకర్యం, అవస్త. ఆ అమ్మాయి చెప్పే పండగ శుభాకాంక్షల్ని తప్పించుకుంటూ పెంట్‌హౌజ్ పైకెక్కేశాడు.

● ● ●

బాణాసంచా రొద పెరిగింది. ఒకరి తర్వాత ఒకరు జడలంటించేసరికి ఏదో యుద్ధంలో నగరం తూట్లు పొడిపించికుంటున్నట్టే ఉంది. ఓ పదినిమిషాలు ఆ గోల భరించకతప్పదు.. వీధికి. కుర్రాడు గది లోపలికి వెళ్లి తలుపులు బిగించుకున్నాడు. కిటికీని వేసేందుకు కదలబోగా ఆకాశంలో వెలుగుపూలు గుప్పుమంటున్నాయి. కిటికీకి తగిలించిన టీషర్టుని చెవులకు చుట్టుకుని ఆకాశాన్ని ఆస్వాదిస్తున్నాడు. ఇటు వైపు కన్నా అటువైపు ధనికులెక్కువ. మబ్బుల్నీ అందుకునే రాకెట్ విన్యాసాల్ని చూడాలంటే అటు వెళ్లాలి. క్షణం మాత్రమే బతుకుతోన్న ఇటువైపు కాంతుల్ని ఒక్కోటి లెక్కబెడుతుండగానే రణగొణ ఆగిపోయింది. కుర్రాడు దబీల్న తలుపులు తెరిచి అటువైపు ఆకాశాన్ని చూస్తుండటం మొదలెట్టాడు. క్షణం కూడా చీకటికి అవకాశమివ్వకుండా ఆకాశం నిండా కాంతులు ఎగజిమ్ముతున్నాయి. తన కోసమే, వీధంతా కాంతుల్ని ఖర్చుపెడుతున్నట్టే అనిపించింది కుర్రాడికి. అలాగే ఆకాశానికి చూపుని అంటించేసి.. తలను అస్సలు కిందకు దించకుండా ఒట్టి నేల మీద పడున్నాడు. కళ్లను చుట్టుతా తిప్పుతూ రంగుల్ని, కాంతుల్ని కళ్లకద్దుకుంటున్నాడు. ఆకాశంలో ఓ మూల మాత్రం చీకటి తొలగలేదు. అంతస్సేపు కాంతుల్ని చూసిన కళ్లకు అదెందుకో ఆసక్తిగా అనిపించింది. ఎప్పటికో ఒకటోరెండో తారాజువ్వలు సర్రున లేస్తూ మబ్బుల్ని అందుకోలేక నేలకిరుచుకుపడుతున్నాయి. వాటి విఫలయత్నం ఎందుకో కుర్రాడిని పైకిలేపింది. డాబా మూలకు చేరి ఆ చీకటి ప్రాంతాన్ని కళ్లింతలు చేసుకుని పరీక్షించాడు. నగరమంతా కాంతులు చుట్టుముడితే.. అక్కడ దీపం ముట్టిన దాఖలాలే కనిపించడంలేదు. పోనీ, జనంలేని ప్రాంతమూ కాదు. బతుకులు కిక్కిరిసిపోయే మురికివాడది. కుర్రాడికి అర్థమైంది.. టార్పాలిన్ పట్టాలు, సిమెంట్ సంచులు.. నిండిపోయిన ఆ వాడలో నిప్పంటుకుంటే దావాగ్నేనని. మరి వాళ్లకు పండగ వెలుగులెలా అని ఆలోచనలో పడిపోయాడు. ముఖం కాంతివిహీనమైపోయింది. కుర్రాడి ముఖం ముందు నుంచే ఓ జువ్వ పెద్ద కాంతితో బయలుదేరింది. ఆ నులివెలుగులు అతడి ముఖాన్ని తడిమినా ఆకాశానికేసి ఆసక్తిని కోల్పోయాడు.

● ● ●

చాలాసేపయ్యింది. పటాసుల శబ్దాలు మందగించాయి. ఔట్ల పేలుళ్ల వీధి గోడల్ని వణికించడం తగ్గిపోయింది. క్రమంగా మళ్లీ కాకరపువ్వొత్తులు, చిచ్చుబుడ్లు, భూచక్రాల కాంతులు వికసించడం మొదలైంది. కుర్రాడికెందుకో అలా వీధులు తిరిగి రావాలనిపించింది. అప్పటికే కొందరు యువకులు బైక్‌లపై ప్రతి ఇంటి కాంతిని తడుతూ రయ్యిన దూసుకుపోతున్నారు. అలాంటి ఆసక్తయితే కుర్రాడికి ఇప్పుడు లేదు. ఎందుకో మిణుకుమిణుకుమంటోన్న ఆ మురికి వాడకేసి బండి నడపాలని ఉంది. కుర్రాడు మెట్లు దిగుతున్న చప్పుడికి ఆ ఇంటి అమ్మాయి ఏదో తీపిని తెచ్చేందుకు లోపలికెళ్లింది. పిల్లాడు వత్తి ఊడిన ఓ చిచ్చుబుడ్డిని తెచ్చి కుర్రాడికి ఎదురెక్కి ఇచ్చాడు. దాన్ని సరిచేయడం కుదరదని.. పెద్దోళ్లు కాలుస్తారులేమని... వేరేది కాల్చుకోమని చెప్పేసి కుర్రాడు గుమ్మం దాటాడు. ఆ అమ్మాయి ప్లేటుతో బయటకు వచ్చేలోపే కుర్రాడు బండి కదిపేశాడు. బాణాసంచా కాల్చేపుడు బండి ప్రయాణం ఓ సవాల్. చాలా అప్రమత్తంగా ఉండాలి. కానీ, నిర్లిప్తంగానే కుర్రాడు బండి నడుపుతున్నాడు. ఓ వీధి మలుపు తిరిగేసరికి పెద్ద ఔట్ పేలింది. ఓ మూడుడగులు వెనుకున్నాడు కనుక సరిపోయింది. సడెన్ బ్రేక్ వేయడంతో బండి కాస్త వొరిగింది. దాంతో కుస్తీలు పడుతూన్న కుర్రాడికి ఓ పిల్లల గుంపు దూరంగా కనిపించింది. వాళ్లిటే భయంభయంగా ఒకళ్లనొకలు భుజాలంటించుకుని నడుస్తున్నారు. కొన్ని ముఖాలు ఆకాశం వైపు చూస్తుంటే.. కొన్ని ముఖాలు ప్రతి ఇంటిని పలకరిస్తూ నవ్వుతున్నాయి. ఆ గుంపు మరీ దగ్గరకొచ్చాక కుర్రాడు వాళ్లని పోల్చుకున్నాడు. ఎవరి ఒంటి మీదా కొత్తబట్టల్లేవు. పాతవాటినే కొత్తగా వేసుకున్న మ్యాచింగ్ పొంతన కనిపిస్తోంది. కొందరి ముఖాలకు దట్టంగా పౌడర్, మరికొన్ని ముఖాలకి

లేతగా సురేకారం పొడి. వాళ్లలో ఒకడు మాత్రం తలను నేలకేసి దేన్నో వెదుకుతూ కనిపించాడు. వాడి మీదే కుర్రాడికి ఆసక్తి కలిగింది. బండిని ఓ పక్కకు లాగి చెట్టు కిందకు చేరాడు. వత్తి ఊడి వదిలేసిన టపాకాయల్ని వాడు ఏరుతున్నాడు. వాడి దగ్గర ఓ ప్లాస్టిక్ కవర్ ఉంది. అప్పటికే అది సగం నిండింది. ఏం కనిపించిందో గబుక్కున ఓ గుమ్మం ముందుకు పరుగెత్తాడు. అక్కడో సగం కాలిన భూచక్రముంది. విలువైనదేదో దొరికిన వెలుగు వాడి ముఖంలో కొట్టొచ్చినట్టు కనిపించింది. అది తీసి సంచీలో వేస్తుండగా ఆ ఇంటి పిల్లాడు వచ్చి వాడి చేయి గట్టిగా పట్టుకున్నాడు. అది చూసిన గుంపు ముందుకు అడుగేయకుండా అక్కడే ఆగిపోయింది. ఆ ఇంటి పిల్లాడు గట్టిగా అరుస్తూ వాళ్ల నాన్నను పిలిచాడు. ఆయనొచ్చి చూసి.. అరెయ్ అది కాలిపోయిందే వదిలేయరా.. అని ఏదో చెప్పి చేతులు విడిపించాడు. చేతినిండా సురేకారం మరకలున్న ఆ మురికివాడ పిల్లాణ్ని వాడి స్నేహితుల గుంపు వెంటనే మధ్యలోకి లాగేసుకుని చకచకా అక్కడి నుంచి తప్పించుకుంది.

•••

ఆ గుంపు మళ్లీ చీకట్లో కలిసేంత వరకు కుర్రాడు బండి కదపలేకపోయాడు. ఓ పదినిమిషాల తర్వాత గుండెనిండా గాలి పీల్చుకుని బండిని చేతుల్తోనే నడిపించుకుంటూ కదిలాడు. పక్కనే వెలుగులు విరజిమ్ముతున్నా పట్టింపులేకుండా కొంతదూరం నడిచాక చెమట్లు పట్టేశాయి. ఇక బండి స్టార్ట్ చేసి మరో వీధిలోకి కదిలాడు. కుటుంబాలన్ని రోడ్డు మీద కుర్చీల్లో కూర్చుని ఇంకా మిగిలున్న ఆకాశ కాంతుల్ని చూస్తున్నాయి. పండగ కబుర్లేవో ఎదురింటి వాళ్లతో పంచుకుంటున్నాయి. కుర్రాడికీ కుటుంబం గుర్తొచ్చింది. ఎందుకో అంతమంది మధ్య ఒంటరితనాన్ని ఎక్కువ ఫీలయ్యాడు. బండి వేగం పెంచి అక్కడ కాంతులీనుతున్న ఆత్మీయతల్ని తప్పించుకొచ్చాడు.

•••

సొంతూర్లో తనవాళ్లందరినీ తలుచుకుంటుండగా ఫోన్ మోగింది. కాల్ లిఫ్ట్ చేయగానే... 'లేచావా నాన్నా..!' అన్న అమ్మ గొంతు వినిపించింది. అంతకుముందు కాల్‌లో 'ఒక్కడివే అలా రూమ్‌లో లైట్లు ఆర్పుకుని పడుకోకు... ఓ దీపమన్నా ముట్టించు...' అన్న మందలింపు స్వరం ఈసారి లేదు. పండగపుడు దూరంగా కొడుకున్నాడనే బాధేదో వినిపిస్తోంది. 'బయటే ఉన్నానమ్మా.. ప్రహరీ అంతా దీపాలు పెట్టింది నేనే..!, టపాసులా.. సరేసరే... ఓ అగ్గిపుల్ల వెలిగించి విసిరేసినా పండగే... అమ్మా! ఇక వదిలేయవే... ఎవడన్నా నెత్తిన బాంబేస్తాడు, రోడ్డు మధ్యలో ఉన్నా..!' ఇలాంటి పొడిపొడి మాటలేవో త్వరత్వరగా సరదాగా మాట్లాడేసి ఫోన్ పెట్టేశాడు.. తల్లిబాధను పెంచలేక. పండగ కాంతుల మధ్య చీకట్లని అంత స్పష్టంగా చూశాక... మనసు పాడైంది. సిగరెట్ ముట్టించి బండి నడుపుతున్నాడు.

కొంతదూరం పోయాక ఇందాకటి పిల్లల గుంపు తగిలింది. కుర్రాడు బండి ఆపేసి పక్కకు దిగాడు. వారంతా దొరికిన టపాసుల్లో పేలేవేవో, పేలనివేవో పక్కకు తీస్తున్నారు. ముందే తెచ్చుకున్న అగర్‌బత్తిని ఒకడు బయటకుతీశాడు. కానీ, అగ్గిపెట్టె మర్చిపోయాడు. పిల్లల్లో ఓ నిస్తేజం. కుర్రాడు సిగరెట్‌ని విసిరేసి వాళ్ల దగ్గరకు రావడం గమనించిన ఓ పిల్లాడు పరుగున ఎదురొచ్చాడు. 'అన్నా..! అగ్గిపెట్టె ఇవ్వవా..' అని అడగడంతో జేబుల్లో వెదికాడు కుర్రాడు. ఇంతలో, చేతుల నిండా సురేకారం మరకలున్న పిల్లాడు గట్టిగా అరిచి గెంతేశాడు. వాడికి రంగుల అగ్గిపుల్లల పెట్టె సంచీ అడుగున దొరికింది. అందులో నాలుగే పుల్లలు. ఆ కొన్నే అరుదైన, విలువైన రంగుల్ని తమ మధ్యే గుప్పిట పట్టేందుకేమో... గుంపంతా బిర్రుగా ఆ పిల్లాడి చుట్టుతా మూగింది. గుంపు మధ్యలో వాడు ఒక్కో అగ్గిపుల్లా వెలిగిస్తుంటే... వాళ్లంతా చప్పట్లు కొడుతూ ఎగురుతున్నారు. చివరి రంగుల అగ్గిపుల్ల వెదజల్లిన కాంతుల్లో ఒకటి ఆ గుంపులోంచి తప్పించుకొచ్చి కుర్రాడి ముఖాన్నీ మెత్తగా తాకి వెలిగించింది.

- అజయ్ కుమార్ వారాల
9502395077

సన్నివేశమ్

రంగుల అగ్గిపుల్లలు

ఒక చెట్టు- మరికొన్ని పక్షులు

ఖండిత శిరస్సు చెబుతుంది
గొడ్డలి పదునెంతో....!
1
వేటు పడింది చెట్టు మొదలు మీద!
వేయి తారాజువ్వల్లా ఒకేసారి ఎగిరి
మళ్లీ వాలుతూ
భీతిల్లిన పక్షుల్లో ఒక్కసారి అలజడి!
అప్పటివరకూ భద్రమనుకున్న
జీవితాల్లో
ఉన్నట్టుండి ఒక అలజడి !
2
వేటు పడింది చెట్టుమూలాల మీద !
కదలబారుతోంది చెట్టు !
కదలలేదు పక్షులు
తల్లికొంగు వీడని పిల్లల్లా...!
చెట్టుకు జుంకాల్లా ఊగాడుతూ
పక్షిగూళ్లు !
చెదిరిపోతున్నవి గూళ్లేనా
పక్షుల గుండెలు కూడా...!
చితికిపోతున్నాయి పక్షిగుడ్లు !
రెక్కలు రాని పక్షులూ
రెక్కలుడిగిన పక్షులూ నేలరాలి..
నెత్తుటిముద్దలై..
ఊచకోత కోసినట్టు ఒకానొక
విధ్వంస దృశ్యం!
3
ఒరే... ఒరే... ఆపండ్రా...!
ఒక జీవావరణం శిథిలమవుతోంది!
చెట్టుకీ పిట్టకీ మధ్య పెనవేసుకున్న
తరాలబంధం తెగిపోతోంది !
చెట్టంటే - నాలుగు కొమ్మలూ
పచ్చని రెమ్మలేనా...
అది ఒక జీవనోత్సవ సంకేతం !
చెట్టులో ప్రవహించేది మట్టిలో
సారమేనా....
పచ్చని జ్ఞాపకాల జీవధార కూడా !
పూసే ప్రతి పూవూ పక్షులకు
తోబుట్టువే !
కాసే ప్రతి కాయా అమ్మచేతి
గోరుముద్దే !
4
అవనికి పట్టిన
ఆకుపచ్చని గొడుగును కూల్చేసాక
ఏ కాంక్రీట్ కారడవులు
కదిలొస్తాయిక్కడికి ?
ఏ నల్లతాచు రహదారులు
నడిచొస్తాయిక్కడికి?
పచ్చని ఆకాశాన్ని కూల్చేయడం
ఏ ప్రగతికి ఆనవాలురా నాయనా?
5
పచ్చని పొద్దులాంటి చెట్టూ
చెట్టంత నిబ్బరమూ కూలిపోయాక
చెట్టుతో పాటు చెల్లిపోయిన
బంధాలకు నీల్లొదిలి
బతుకును ముక్కున కరుచుకొని...
వలసపక్షులై
కాంక్రీట్ వనాలవేపు ఎగిరిపోతూ!
(భూములు కోల్పోయిన
నిర్వాసితులకు...)

- సిరికి స్వామినాయుడు
9494010330

కవిత్వమ్

ప్రవహించే నది

పురాతన దేవాలయంలో
పూచే పూలు అందరివీ
కానీ పాపం దేవుడు మాత్రం
కొందరికే!

భక్తుల మనసుల్లోనే కాదు
గుడిలోనూ అతడు బందీనే ..
రెక్కలెపుడూ గరుడ పక్షివే...

చలి తెమ్మెరలు ఏ కొండకూ
కర్టెన్ వేయలేకపోయాయి.
కొండమీది గర్భగుడికి
తాళం వేసిందెవరో..!

గర్భగుడిలో దేవుడు
గర్భాశయంలో జీవుడు
గోడల్లోంచి ఉబికేదంతా
మైలెట్లాయె?
ప్రవహించే నది ఎపుడూ
రక్తంలా శుద్ధమే!

పవిత్రమైన గుడి గంటలు
కొంత సేపైనా ఆగి
సేదదీరుతాయి
ఆగని గంట, గుండె మాత్రమే!
ఇపుడు చెప్పు గుడెక్కడుందో..!
తులసి మాల తిప్పే చప్పుడు
మంత్రాల గొణుగుడూ
వినిపించని ప్రార్థన
చేయాలంటే
జోడించిన చేతుల మధ్యన
హృదయం ఒత్తిలిగిలి చేరాలి
మూసి ఉంచిన కన్నుల మీంచి
నీ శ్వాస ప్రవహించాలి

పాత కంచెల్లో పిచ్చి
మొక్కలుంటాయి
ముక్కు చేరతాయి
పీకేస్తూ కూర్చోలేం...
దాటేయాలి
అవతలికి దూకేయాలి!

- విరించి విరివింటి
99486 16191

కాలం అప్పుడప్పుడూ ఆశగా
కొంతమంది మిత్రుల్ని తీసుకుని నేరుగా ఇంట్లోకొచ్చేది
వాళ్ళు అద్భుతాల్నుంచి నిశ్శబ్దాన్ని
వేరు చేసి ప్రజలందర్నీ చేరదీసేవారు
ఉద్వేగం జీవితాల్నక్కడ తోరణాలు గట్టేది!

మంచీ చెడులు గుంపులు గుంపులుగా
పందిళ్ళలో ఒక విగ్రహాన్ని నిలబెట్టేవి
ఆచారాల్ని నడిరోడ్డమీద గుంజల్లా పాతేవారు
వాటి మెడల్ని నిటారుగా నిలబెట్టేందుకు
పలుగూ పారతో
మిత్రుడలాగే ఏకాగ్రతగా నిల్చునేవాడు

దేవుడంటే ఏ అవతారమ్మీది నమ్మకాల్నైనా అక్షింతలుగా
చల్లుకోవడమేగా
కాలం అందుకనే చవితి, నవమి, దశమి ఆఖరుకి
అమావాస్యన కూడా
మళ్ళీ మళ్ళీ మిత్రుల్ని వెంటబెట్టుకొచ్చేది

పండగెప్పుడొస్తుంది ?

ముఖాలు కొత్త నక్షత్రాల్లా వెలిగేవి కానీ
వాళ్ళ హృదయాల్లోంచి నిర్బంధ కథల్ని
ఒక్కో ముల్లు తీసినట్టు తీసి చూపించేది
వాళ్ళలో ఒకతను నీళ్ళలో ముంచేసినపుడు
ఊపిరాడదని చెప్పేవాడు
మేకులు దింపి శిలువేసినపుడు, నెత్తుటి దీపంలా కాలిన
దేహాన్ని చూపించేవాడు
నిప్పులమీద నడిచినపుడు కన్నీళ్ళు కార్చి
మేకపోతు మెడ తెగినపుడు చచ్చి బతికి
సంతర్పణల్లో పస్తులుండేవాళ్ళు
సాంబ్రాణి పొగజారిన కళ్ళంతింత జేసుకుని కాలం
దేవుళ్ళని వింతగా చూసేది
ఇప్పుడు నాస్తికుల ఇళ్ళల్లో కూడా
ఎవరి దేవుళ్ళు వాళ్ళకి వెలిశారు!
మిత్రులు మాత్రం
అండా సెల్లోనో, లేక కుట్రపూరిత వల్లోనో బందీల్లా
ఉండిపోయారు !!
కాలమొక్కటే బయట పడిగాపులు కాస్తోంది
తడియారని ప్రాణంతో
గుమ్మంలో
ఆకులానే వేలాడుతోంది!

- శ్రీరామ్
9963482597

గీత - వాత







- రామకృష్ణ, కార్టూనిస్టు








కాంతి కాంత

వెలుతురు పూలు.. హృదయి దివ్వెలు... అజ్ఞానపు అఖాతాల్లోంచి మానవతకి చూపునిచ్చే వెలుగుల తావులు. స్త్రీ, దీపం... సమాజ వికాసానికి ప్రతీకలు. అందుకే, చిత్రకారుల వెలుగు గీతల్లోకి ఆ శోభ చేరింది. ఆదిమ తెగల కుడ్యచిత్రాల్లోనూ, మోడ్రన్ పెయింటర్ల చిత్తరువుల్లోనూ ఆ కాంతి కాంతల అచ్చెరువులే. వెలుగుల పండగ.. అందరి ముఖాల్లోను సంతోష కాంతుల్ని వెలిగించాలని, ఇళ్లలో జ్ఞానజ్యోతుల్ని ముట్టించి దేదీప్యమానం చేయాలని కోరుకుంటూ దీపావళి శుభాకాంక్షలు.